

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 26-02-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 06 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50

వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : దంకుని బహిరంగ సభలో సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్


నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో బీజేపీని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీని ఓడించాలని సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ 27వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా మంగళవారం దంకుని ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రకాశ్‌కరత్ ప్రసంగించారు. ప్రజల మద్దతుతో సీపీఐ(ఎం) ముందుకు సాగుతోందని ఈ ర్యాలీ రుజువు చేస్తోందని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రతికూలతలన్నింటినీ ఎదుర్కొని ధైర్యంగా పని చేశారని తెలిపారు. "బీజేపీ మతతత్వ విధానాలకు, తృణమూల్ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా మతతత్వ శక్తులకు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. దేశ రాజ్యాంగాన్ని అంతం చేయడంలో బీజేపీ పాత్రకు వ్యతిరేకంగా మనం లౌకిక శక్తులతో కలిసి పోరాటం చేస్తున్నాం. రాష్ట్రంలోని తృణమూల్ ప్రభుత్వం అవినీతిమయమైంది. ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక స్వభావానికి వ్యతిరేకంగా, బీజేపీ మతతత్వ రాజకీయాలపై పోరాటం జరుగుతోంది" అని అన్నారు. గత మూడేండ్లుగా బెంగాల్‌లోని ప్రజలకు వంద రోజుల పని లభించడం లేదని, వారి పని హక్కును హరించారని అన్నారు. పని హక్కు చట్టం అందరికీ ఉందని, అయితే మమత ప్రభుత్వం ఆ చట్టాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. "రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు. నాలుగు రోజులుగా ఈ రాష్ట్రంలోని వివిధ వార్తాపత్రికలలో మహిళలపై హింసకు సంబంధించిన వార్తలు చూశాను. ఈ జిల్లా (హుగ్లీ)కు చెందిన ఓ మహిళ వేధింపుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో సోమవారం మరణించింది" అని అన్నారు. "ఈ గూండా రాజ్‌కు వ్యతిరేకంగా పార్టీ ముందుండి పోరాడుతోంది. తొలుత మన కార్యకర్తలపై గూండాలను ప్రయోగించారు. నేడు ప్రజలపై ఉపయోగిస్తున్నారు" అని ప్రకాశ్‌కరత్ అన్నారు. "రాష్ట్రంలో వామపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు ఏ మతతత్వ శక్తి కూడా తల ఎత్తలేకపోయింది. నేడు తృణమూల్ కారణంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తివంతంగా మారే వాతావరణం ఏర్పడింది. ఈ రాష్ట్రాన్ని హిందూ మత శక్తికి స్థావరంగా మార్చాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటోంది. మోడీ ప్రభుత్వం తాము హిందువులమని ...3లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి

ఐరాస భేటీలో బట్టబయలైన విభేదాలు 11లో...





కిం కర్తవ్యం?

కెనడా వీసా ని'బంధనాల'తో భారతీయుల ఇబ్బందులు

వివరాలు 11లో

లైఫ్‌సైన్సెస్ పాలసీ తెస్తాం

త్వరలో 10 ఫార్మా విలేజీల ఏర్పాటు

- 5లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తాం
- ఆవిష్కరణలకు కేరాఫ్ హైదరాబాద్
- రాష్ట్రంలో మెగా డ్రైపోర్ట్ ఏర్పాటు
- ఏపీలోని సీ పోర్ట్‌తో అనుసంధానం : బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



బయో ఆసియా సదస్సులో ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు జినోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"హైదరాబాద్ నగరాన్ని కొత్త ఆవిష్కరణలు, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ సహా భారీ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 ఫార్మా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఐదు లక్షలకుపైగా కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలోనే మొట్ట మొదటి 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. చైనా ప్లస్ వన్ అవసరాలు తీర్చే కేంద్రంగా దీన్ని అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును ఏర్పాటు చేసి.. ఇక్కడి నుంచి ఏపీలోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు అభివృద్ధి చేస్తాం." అని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన బయో ఆసియా సదస్సు-2025ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ప్రోత్సహించాలనే దార్శనికతతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్ వివరించారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఎకానమీ సామర్థ్యం గల స్టేట్‌గా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఫార్మా రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తోందని వివరించారు. ఏఐ, క్వాంటమ్, రోబోటిక్స్ సాయంతో వైద్య రంగం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. ఇక్కడి ఎకో సిస్టమ్ అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించే రాష్ట్రంగా తెలంగాణ మారిందని గుర్తు చేశారు. "అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పనకు రాష్ట్రం కేరాఫ్‌గా నిలిచింది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాల్లో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడి దారులకు తెలంగాణ రెడ్ కార్పెట్ పరుస్తోంది. చిన్న పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు అనేక రాయితీలను అందిస్తున్నాం. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి" అని సదస్సులో పాల్గొన్న ప్రతినిధులను సీఎం కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రత్యక్షంగా 51వేల మందికి, పరోక్షంగా 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య, మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటు తోనే ఆగిపోకుండా వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న జనరిక్ మందులు, వ్యాక్సిన్లలో తెలంగాణ వాటా రోజురోజుకీ పెరుగుతోందని వ్యాఖ్యానించారు. దాదాపు 200కు పైగా దేశాలకు ఏటా ఐదు బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ 2025ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రిసిషన్ హెల్త్ రీసెర్చ్ (ప్రిసైస్) సింగపూర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ. పాట్రిక్ టాన్‌కు బహూకరించారు.

ఈ కార్యక్రమంలో ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, దేశ, విదేశాలకు చెందిన సంస్థలతో పాటు ఆ రంగంలో నిపుణులు, నిష్ణాతులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

11 కంపెనీలతో ఒప్పందాలు

బయో ఆసియా సదస్సు మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం 11 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. గ్రాన్యూల్స్, ఆర్చిక్యులర్, ఐజాంట్, బయోలాజికల్ ఇ, విర్చో, విరూపాక్ష, జూబిలెంట్, విమ్టా, అరజెన్, భారత్ బయోటెక్, సాయి లైఫ్ సైన్సెస్‌లు తమ పెట్టుబడులను పెట్టేందుకు అంగీకరించారు. కాగా ఇప్పటికే గ్రీన్ ఫార్మా సిటీలో 6 కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి.

ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం


వివరాలు 10లో

సర్వశక్తులూ ఒడ్డుతాం

టన్నెల్‌లో సహాయ చర్యలను పరిశీలించిన మంత్రులు | అధికారులు, ప్రతినిధులతో సమీక్షా సమావేశం

- ఆ ఎనిమిది మందిని కాపాడేందుకు అత్యున్నత పరిజ్ఞానం వినియోగం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సహాయ చర్యలకు ఆటంకంగా నీటి ఊట, బురద
- 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల బురద
- కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు పూర్తయితే వేగంగా బయటకు పంపింగ్
- టన్నెల్‌లో 11 కిలోమీటర్ల తర్వాత నీరు
- 11.5 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లిన రక్షణ బృందాలు
- 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్





నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి / అచ్చంపేట

ఎస్ఎల్‌బీసీ సొరంగం టన్నెల్ ప్రమాదంలో చిక్కుకుపోయిన ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకు రావడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని మంత్రులు చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. వారు మంగళవారం ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను అంచనా వేశారు. అనంతరం మంత్రులు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రాజెక్టు స్థలంలోని జేపీ కార్యాలయంలో అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ సహా సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వివిధ ఏజెన్సీల ప్రతినిధులు సహాయ చర్యలపై వివరించారు.

అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రమాద స్థలంలో 40 నుంచి 50 మీటర్ల మేర బురద నిండుకుందని తెలిపారు. ఈ బురద నీటిని వెలికి తీయడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని వివరించారు. ఎడమ కాల్వ టన్నెల్‌లో ...10లో



అలుపెరుగని పోరాటం చేస్తా

ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తా

- మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి: ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి


నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

రేపు (గురువారం) జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే.. శాసనమండలిలో మరోసారి ప్రశ్నించే గొంతుకన వుతానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని, నాటి నుంచి నేటివరకు ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకగా పనిచేశానని అన్నారు. రాష్ట్రంలో 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ సాధనలో తన కృషి ఉందని గుర్తు చేశారు. ప్రమోషన్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయించానని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పీఆర్సీ, లీవుల మంజూరు, బదిలీలు, తదితర సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్స్, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు, నిరసనలు, దీక్షలు చేపట్టామని అన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించాలన్నారు. ఐదు రకాల గురుకులాల సమస్యలు, డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ...11లో

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

- ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ



వివరాలు 3లో

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య

టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు

- సీఎం రేవంత్ ఢిల్లీ చక్కర్లు : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ



వివరాలు 10లో

పైసా.. కైసా...?

సర్కారుకు హామీల సవాళ్లు

ఆసరా సహా అనేక పథకాల కోసం జనం ఎదురుచూపులు

'రోజురోజుకీ ఖర్చులు పెరిగి పోతున్నాయి.. చాలీచాలని సంపాదనతో ఇంటిని ఎలా నడపాలో? భవిష్యత్ అవసరాల కోసం ఎలా పొదుపు చేయాలో అర్థం కావటం లేదు...' ప్రఖ్యాత బీమా సంస్థకు సంబంధించి ప్రతీరోజూ టీవీల్లో వచ్చే వ్యాపార ప్రకటనలో ఓ బాధితుడి ఆవేదన ఇది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి కూడా అచ్చం ఇలాగే ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటికి వడ్డీలు ఒకవైపు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాటికి నిధుల సర్దుబాటు మరోవైపు.. రాష్ట్రంపై కక్షగట్టినట్టుగా పైసా విదల్చని కేంద్రం తీరు ఇంకో వైపు... ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకోసం ఆదాయాన్ని రాబట్టుకోవటం ఎలా? అన్నది రాష్ట్ర ప్రభుత్వానికి ఓ సవాలుగా మారింది వెరసి 'పైసా.. కైసా...?' అనే విధంగా పరిస్థితి తయారైంది. చాలినన్ని నిధుల్లేకపోవటం, బడ్జెట్‌లో వేసుకున్న ఆదాయ అంచనాలను చేరుకోలేకపోవటం తదితర కారణాల రీత్యా వివిధ శాఖలు, విభాగాలకు సంబంధించిన దస్త్రాలు... సంబంధిత డిపార్టుమెంట్ల నుంచి ఆర్థిక శాఖకు, అక్కడి నుంచి సీఎస్, సీఎం కార్యాలయాలకు వెళుతున్నాయి తప్ప నిర్ణీత సమయంలో పనులు కావటం లేదనే విమర్శలొస్తున్నాయి. వాటిని పరిష్కరించాలంటే నిధులు కావాలి కాబట్టి ఉన్నతాధికారులు నెలల తరబడి పెండింగ్‌లో పెడుతుండటం పరిపాటిగా మారింది.

బి.వి.యన్.పద్మరాజు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక తరగతులకు హామీలనిచ్చింది. వీటిలో ముఖ్యమైంది, ప్రజలు ఆశగా ఎదురు చూసేది 'ఆసరా' పింఛన్లు. రాష్ట్రంలో ప్రస్తుతం 15.25 లక్షల మంది వృద్ధులు, 15.26 లక్షల మంది వితంతువులు, 4.92 లక్షల మంది వికలాంగులు పింఛన్ పొందుతున్నారు. ఈ క్రమంలో 'ఆసరా' పథకం కింద వయో వృద్ధులకు నెలకు రూ.2,016, వితంతువులకు రూ.2,106, వికలాంగులకు రూ.4,016 పింఛన్ వస్తోంది. వీటన్నింటినీ రెట్టింపు చేస్తామంటూ కాంగ్రెస్ హామీనిచ్చింది. ఈ మూడు రకాల పింఛన్లకు కలిపి నెలకు సగటున రూ.వెయ్యి కోట్లు అవసరమవుతున్నాయి. అంటే ఏడాదికి పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లను సర్కారు ఖర్చు చేస్తోందన్నమాట. వీటిని రెట్టింపు చేస్తే నెలకు అదనంగా మరో రూ.వెయ్యి కోట్లు, ఏడాదికి మరో రూ.12 వేల కోట్లను వెచ్చించాల్సి ఉంటుంది. ఆ రకంగా ఇప్పుడున్న పింఛన్లను రెట్టింపు చేయాలంటే ఏడాదికి రూ.24 వేల కోట్లను కేటాయించాలి. ప్రస్తుతానికి ఈ మొత్తాన్ని భరించే స్థితి లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా బీఆర్‌ఎస్ హయాంలో 2022 ఆగస్టు నుంచి కొత్తగా ఆసరా పింఛన్లు ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇప్పటిదాకా సుమారు 15 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని వెరిఫికేషన్ చేసి, స్క్రూటినీ చేస్తే 12 లక్షల వరకూ అప్లికేషన్లు మిగులుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్క లేసింది. ఈ మొత్తాన్ని ...11లో



'ఖజానా' కష్టాలతో కాలయాపన ప్రధానమైన వాగ్దానాల అమలెప్పుడో?

హామీలు ప్రభుత్వం నెరవేర్చాలి...

ఇవేగాక మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, 50 ఏండ్లు నిండిన జానపద కళాకారులకు నెలకు రూ.3 వేల పింఛన్, రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, మత బోధకులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల గౌరవ వేతనం, వధువులకు (కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్) రూ.1.6 లక్షల ఆర్థిక సాయం తదితర ముఖ్యమైన హామీలను ప్రభుత్వం నెరవేర్చాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో సర్కారు వీటి జోలికే పోవటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 14 నెలలు పూర్తయింది. ఇప్పుడే కాసులకు 'కటకట'గా ఉంటే ముందు ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని బడుల్లో 'తెలుగు' తప్పనిసరి

- సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ పాఠశాలల్లో అమలు చేయాల్సిందే
- విద్యాశాఖ ఉత్తర్వులు



వివరాలు 11లో

ఆ 11 కుటుంబాలకే ఇండ్లు మంజూరు

ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోయడానికొచ్చిన అధికారుల అడ్డగింత

పట్టా పేపర్లు చించివేత

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట లబ్దిదారుల ఆందోళన



నవతెలంగాణ-చివ్వెంల

సొంత గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పట్టాలిచ్చిన అధికారులు.. అందులో సగం మంది పేర్లే తుది జాబితాలో వచ్చాయని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలు పొందిన 28కుటుంబాల్లో 11 కుటుంబాలకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయంటూ ముగ్గు పోయడానికి వచ్చిన అధికారులను మిగతా లబ్దిదారులు అడ్డుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని భీమ్లాతండాలో జరిగింది. భీమ్లా తండా గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు 28 మందిని అర్హులుగా గుర్తించారు. గత నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా వారికి ఇండ్ల పట్టాలు అందజేశారు. తుది జాబితాలో మాత్రం 11 మంది పేర్లే వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం తండాలో ధరావత్ ప్రమీల ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు నిలదీయడంతో వాగ్వాదం జరిగింది. గత నెల మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా 28 మందికి పట్టాలు పంపిణీ చేసి.. నేడు తుది జాబితాలో 11 మందికి మాత్రమే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయనడంతో.. పనికిరాని ఈ పట్టాలు మాకెందుకంటూ అధికారుల ముందే చింపేశారు. గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ సిబ్బంది, మండల అధికారులు రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా సర్వే చేసి 11 మందిని మాత్రమే గుర్తించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. చివరకు హౌసింగ్ ఏఈ రాంబాబు, ఎంపీవో దయాకర్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఇతర అధికారులు వెనుదిరిగారు.



వికలాంగుడిని.. నా పేరు తొలగించారు: ధరావత్ రాజు

వికలాంగుడిని అని చూడకుండా జాబితా నుంచి నాపేరు తొలగించారు. నేను పుట్టుకతో నిరుపేద వికలాంగుడిని. జీవనోపాధి గడవని పరిస్థితి. కూడు గుడ్డకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. గత నెలలో నాకు ఇల్లు వచ్చిందంటే చాలా ఆనందం వ్యక్తం చేశా. తుది జాబితాలో పేరు లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

మాటల్లో రక్షణ... చేతల్లో భక్షణ

రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న కాంగ్రెస్ : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల హక్కులను హరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాటల్లోనే రాజ్యాంగ రక్షణ, చేతల్లో రాజ్యాంగ భక్షణ అన్న విధంగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి, మానవ హక్కుల ఉల్లంఘనలకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యం..పోలీసు రాజ్యమైందనీ, బీఆర్‌ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమై పోయాయని పేర్కొన్నారు. కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. "గతంలో జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఇప్పుడు వనపర్తిలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.. బీఆర్‌ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం, కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ, ఈడీ, సీబీఐ, ఐటీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు

హైదరాబాద్ తాగు నీటి కష్టాలపై హరీశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు."వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి, ప్రజలు భారీ మొత్తంలో డబ్బు వెచ్చించి వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతకుముందెప్పుడూ హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం లేదు. సర్కార్ తగిన చర్యలు తీసుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

సిరిసిల్ల కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

సీఎస్‌కు బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిరిసిల్ల కలెక్టర్ తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకరా పార్టీ మండలి విపక్ష నేత మధుసూదనా చారి, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సీఎస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు సచివాలయం మీడియాపాయింట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ సిరిసిల్లలో కేటీఆర్ పేరుతో ఓ వ్యక్తి టీ షాప్ నిర్వహిస్తున్నారనీ, అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేదనే సాకుతో మూసేయడమే కాకుండా... వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొంత మంది అధికారులు కాంగ్రెస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల కలెక్టర్‌తో పాటు అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరినట్టు తెలిపారు. చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

మృతుల్లో తల్లి, కొడుకు, కోడలు

కన్నీరు మున్నీరవుతున్న చిన్నారులు

నవతెలంగాణ-మునిపల్లి

గుర్తు తెలియని ఓ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరాలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రవి(36) అతని తల్లి లక్ష్మి(54), భార్య శోభ(28)తో కలిసి ముంబై హైవే రహదారిపై గల బుదేరా చౌరస్తాలోని ఫ్లై ఓవర్ పై వెళుండగా.. గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో వారు ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు రవికి ఇద్దరు కొడుకులు (చిన్నపిల్లలు) ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

మార్చి 1 నుంచి ప్రారంభం : కన్వీనర్ డీన్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. మంగళవారం సాయంత్రం 4.45 గంటల నుంచే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సిన విషయం తెలిసిందే.

ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

పెండ్లి ఇష్టం లేక.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ-భువనగిరి

పెండ్లి ఇష్టం లేక ఏఆర్ కానిస్టేబుల్ మామిడాల అనూష (కీర్తి)(30) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొహెడ మండలం వరూకోలు గ్రామానికి చెందిన అనుష 2020 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. నాలుగేండ్లుగా భువనగిరిలో విధులు నిర్వహిస్తోంది. స్థానిక విద్యానగర్‌లో ఓ ఇంట్లో మరో మహిళా కానిస్టేబుల్‌తో కలిసి అనూష అద్దెకు ఉంది. ఈనెల 22వ తేదీన తన పుట్టిన రోజు వేడుకను సహచరులతో కలిసి చేసుకుంది. అయితే, కొహెడ మండలానికి చెందిన ఓ వ్యక్తితో ఈనెల 14న ఆమెకు నిశ్చితార్థం అయింది. కుటుంబీకులు మార్చి 6వ తేదీన వివాహం నిర్ణయించారు. కాగా తనకు ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో అద్దెకు ఉన్న ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు మామిడాల పద్మ, లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ లక్ష్మినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-ములుగు

గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి ఎక్కాల మల్లయ్య సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని కొట్టంలో గొర్రెలను తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా వచ్చి గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 16 గొర్రెలు మృత్యువాత పడగా.. 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం తెల్లవారుజామున కొట్టం వద్దకు వచ్చే సరికి గొర్రెలు మృత్యువాత పడి ఉండటం చూసి మల్లయ్య క న్నీట పర్యమ య్యాడు. సుమారు రూ .3.20 లక్షల వేలపై గానే నష్టం జరి గిందని వాపోయాడు.







వామపక్షాలే ప్రత్యామ్నాయం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఎంసీ దుష్పరిపాలనను ఎండగట్టాలి : ప్రకాశ్‌కరత్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుకుంటుంది. కానీ వాస్తవానికి వారు అదానీ, అంబానీల కోసం పని చేస్తున్నారు. ఈ రాష్ట్రానికి బీజేపీ వస్తే, ఈ కార్పొరేట్ శక్తి బెంగాల్‌ను దోచుకుంటుంది. రాష్ట్ర ప్రజలు వామపక్ష ప్రత్యామ్నాయ శక్తిని చూడాలనుకుంటున్నారని ఈ ర్యాలీ రుజువు చేస్తుంది" అని స్పష్టం చేశారు.

ప్రతి రోజూ ఒక పోరాటమే : ఎండీ సలీం

"ఈ ర్యాలీ సీపీఐ(ఎం) ఉనికిలో ఉందని, ఉంటుందని నిరూపిస్తోంది. కొన్ని ఎన్‌జీవోలు, మీడియా వామపక్షాలు తుడిచిపెట్టుకు పోయాయని ప్రచారం చేశాయి. కానీ అది ఎన్నటికీ జరగదు. జరగబోదు. ఎర్రజెండా అమరవీరుల రక్తంతో తయారు చేయబడింది. రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, గిరిజనులు, విద్యార్థులు, యువజనులు, మైనారిటీలు, ప్రతి ఒక్కరి కోసం పోరాటానికి సీపీఐ(ఎం) ఏర్పడింది" అని సీపీఐ(ఎం) పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బుద్ధదేవ్ భట్టాచార్య రాష్ట్ర ప్రజల ప్రతిభను ఉపయోగించి రాష్ట్రాన్ని నిర్మించాలనుకున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ కాలంలో పాఠశాలలు నిర్మించారు. కానీ తృణమూల్ వాటిని కూల్చివేస్తోంది. బీజేపీ అభివృద్ధి అంటోంది. ఆర్జీకర్ కేసు కోల్‌కత్తా పోలీసులు, సీబీఐ దాని నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. ఢిల్లీ, కోల్‌కత్తా నిజాన్ని వెల్లడించడానికి ఇష్టపడవు. ప్రతిదీ బహిర్గతం చేయాలని కోరుతున్నాం. మనం గత మూడేండ్లుగా ప్రజలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ వారు ప్రజలను విభజించాలనుకుంటున్నారు. అల్లర్లు చెలరేగుతున్నాయి. అల్లర్లు చేసిన వ్యక్తికి మోడీ పద్మశ్రీ ఇచ్చారు. ఈ రాష్ట్రంలో గూండాలకు, అల్లర్లకు చోటు ఉండకూడదని మేము చెబుతున్నాం. మతం, రాజకీయాలను వేరుగా ఉంచాలి" అని ఎండీ సలీం అన్నారు. "బంగ్లాదేశ్‌లో



మతపరమైన మతతత్వ శక్తులు అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలు, ప్రతిపక్ష సభ్యులపై దాడులు జరుగుతున్నాయి. ఈ సంఘటనలు మన దేశంలో కూడా చూస్తున్నాం. బంగ్లాదేశ్‌లోని పేదల హక్కుల కోసం పోరాడుతున్న వారితో మేము నిలబడతాం. ఈ రాష్ట్రంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. మన దేశం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆర్‌ఎస్‌ఎస్ దేశం మొత్తాన్ని మత ప్రాతిపదికన విభజిస్తోంది. మమత బీజేపీతో కలిసి మనకు వ్యతిరేకంగా పోరాడతానని అంటోంది. ఈరోజు వారు కలిసి కూర్చున్నారు. ప్రతిరోజూ ఒక పోరాటం. సీపీఐ(ఎం)ను బలోపేతం చేయాలి. వామపక్ష ఐక్యతను నిర్మించాలి. మనం ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. ప్రజలు మన వైపు వచ్చారు" అని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభలో సీపీఐ(ఎం) నేతలు డెబ్లినా హెంబ్రామ్, మీనాక్షి ముఖర్జీ, దేబబ్రతా ఘోష్ తదితరులు మాట్లాడారు.



యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వలస కార్మికుల కోసం సీఐటీయూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌-ఎల్‌బీసీ) టన్నెల్ చిక్కుకున్న ఎనిమిది మంది వలస కార్మికులను రక్షించడం కోసం యుద్ధ ప్రాతిపాదికన సహాయ చర్యలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. అలాగే పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టని నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. టన్నెల్ నిర్మాణంలో బురద, నీరు వెల్లువెత్తడం కొత్తకాదని, ఇది సాధారణంగా జరిగేదనని, వీటిని నివారించడానికి ముందగానే చర్యలు తీసుకుంటారని సీఐటీయూ తెలిపింది. అయితే తెలంగాణలోని దోమలపేటకు సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో కార్మికులు లోపలికి ప్రవేశించిన 30 నిమిషాల్లోనే నీరు, బురద సొరంగంలో పేరుకుపోవడం కాంట్రాక్టర్‌కు సరైన ఇంజనీరింగ్ నైపుణ్యం లేకపోవడాన్ని వెల్లడిస్తుందని, ఇది కాంట్రాక్టర్, ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమని సీఐటీయూ విమర్శించింది. ఈ నిర్లక్ష్యం వలన కార్మికుల జీవితాలను విషాదంలోకి నెట్టివేసిందని, వారి కుటుంబాలను కష్టాల్లోకి పడేసిందని సీఐటీయూ ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ నిర్లక్ష్యంలో ప్రజా పనుల శాఖ, కార్మిక శాఖల పాత్ర సమానంగా ఉందని పేర్కొంది. చిక్కుకున్న కార్మికులు ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్), ఈఎస్ఐ పథకాల్లో ఉన్నారా లేదా అనే విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వాలని సీఐటీయూ తెలిపింది. కార్మికులకు సరైన పరిహారాన్ని ఇవ్వాలని కోరింది.

ప్రలోభాలకు ఎర

ఓటర్లకు నగదు పంపిణీ మొదలెట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

తాయిలాలను తిరస్కరించాలి: ఉపాధ్యాయులు, అధ్యాపకులకు టీఎస్‌యూటీఎఫ్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో కొందరు ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఓటర్లకు నగదు పంపిణీ మొదలుపెట్టారని తెలిపింది. తాయిలాలను తిరస్కరించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.రెండు వేలు ఫోన్ పే చేసి పూలు అని మెసేజ్ పంపారని వివరించారు. కొందరు ఓటర్లు వాటిని తిరస్కరించి వెనక్కి పంపారని తెలిపారు. మరో ప్రముఖ సంఘం (పీఆర్టీయూ) అభ్యర్థి పక్షాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.వెయ్యి, ఖమ్మంలో రూ.రెండు వేలు, మహబూబాబాద్ జిల్లాలో రూ.ఐదు వేలు పంపిణీ చేసినట్టు సమాచారమని పేర్కొన్నారు. అధికార పార్టీ అధికార ప్రతినిధి అని చెప్పుకునే అభ్యర్థి పక్షాన కొన్ని పాఠశాలల్లో ఓటరుకు రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేసినట్టు తెలిసిందని వివరించారు. జాతీయ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ద్వారా ఇంటింటికీ రూ.రెండు వేల నుంచి ఐదు వేలు పంపిణీ చేస్తున్నట్టు సమాచారముందని తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు నగదు తీసుకోకుండా తిరస్కరించారనీ, వారిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు.పోటీలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు తాము దిగజారి ఉపాధ్యాయుల విలువను దిగజార్చడం పట్ల చావ రవి, ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తాము చేసిన సేవలను వివరించి ఓట్లడగటం కాకుండా డబ్బు పంపిణీ చేసి గెలవాలనుకోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కమిషన్ డబ్బు పంపిణీని అడ్డుకోవాలనీ, పంపిణీ చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గాజాలో ప్రతికూల వాతావరణంలో ఆరుగురు చిన్నారులు కన్నుమూత

- మానవతా సాయం అనుమతించనందువల్లనే ఈ పరిస్థితి
- ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో విధ్వంసకాండ, 85శాతం ప్రజలు నిర్వాసితులు



గాజా : గాజాలో నెలకొన్న అత్యంత శీతల వాతావరణం కారణంగా గత రాత్రి నవజాత శిశువుతో సహా ఆరుగురు చిన్నారులు మృతిచెందారు. వీరిలో ఐదుగురు గాజాలోని రీమల్ ప్రాంతంలోని ఆస్పత్రిలో మరణించారు. ఖాన్ యూనిస్ నగరంలో ఆరవ చిన్నారి కన్నుమూసిందని వైద్య వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా స్వస్థలాలకు తిరిగివచ్చిన వేలాదిమంది పాలస్తీనియన్లు శిథిలమైన తమ ఇళ్ళ వద్దనే రాళ్ళు రప్పల్లో తాత్కాలికంగా వేసుకున్న శిబిరాల్లో నివసిస్తున్నారు. అయితే బలంగా వీచే గాలులు, భారీ వర్షాలతో ఆ శిబిరాలు నివాస యోగ్యంగా వుండడం లేదు. పైగా పాలస్తీనా భూభాగంలోకి శిబిరాలను, మొబైల్ ఇళ్లను రానివ్వకుండా ఇజ్రాయల్ కట్టుదిట్టం చేస్తుండడంతో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యాయి. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా గాజాలో ఉపయోగించిన యుద్ధ ఎత్తుగడలనే ఇజ్రాయిల్ అమలు చేస్తోందని పాలస్తీనియన్లు వాపోతున్నారు. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా గాజాలో మానవతా సంక్షోభం పెచ్చరిల్లుతోందని విమర్శిస్తున్నారు. ఇదిలావుండగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడుల ప్రభావం పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. డబ్ల్యుహెచ్ఓ ప్రతినిధి రిక్ పీపర్‌కార్న్ విలేకర్లతో మాట్లాడుతూ వెస్ట్ బ్యాంక్‌లో ఆరోగ్య సంరక్షణ అనేది తీవ్రమైన ముప్పులో పడిందని చెప్పారు. ఈ ఏడాది ఈ రెండు నెలల కాలంలో 44 దాడులు జరిగాయని తెలిపారు. నాలుగు ఆస్పత్రులు దెబ్బతిన్నా యన్నారు. అంబులెన్సు కోసం వేచి చూస్తూ నలుగురు రోగులు మరణించారు. అలాగే రోగుల కోసం వెళ్ళే ప్రయత్నంలో 8మంది ఆరోగ్య సంరక్షనా కార్మికులు గాయపడ్డారని తెలిపారు. వెస్ట్ బ్యాంక్ అంతటా రాకపోకలపై తీవ్రమైన ఆంక్షలు వున్నాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. దీనివల్ల అంబులెన్సులు, ఆరోగ్య కార్మికులు రాకపోకలు కూడా ప్రభావితమయ్యాయని పేర్కొంది. ఉత్తర వెస్ట్ బ్యాంక్‌లో తుల్కారెమ్ శరణార్థ శిబిరంలో ఇజ్రాయిల్ ఆర్మీ దాడుల కారణంగా 12వేల మంది ఇండ్ల నుంచి పారిపోయారని స్థానిక అధికారులు తెలిపారు. తుపాకీతో బెదిరించి అక్కడున్న వారిని ఇండ్లనుంచి తరిమేశారని డిప్యూటీ గవర్నర్ ఫైజల్ తెలిపారు. ఇండ్లు, వీధులు, శిబిరాల్లోని అన్ని సదుపాయాలను సైనికులు విధ్వంసం చేస్తున్నారని ఆయన తెలిపారు. వందకు పైగా అపార్ట్‌మెంట్లు గల 40భవనాలను గత నెల రోజుల కాలంలో ధ్వంసం చేశారు. శిబిరంలోని పది ఇండ్లను తగలబెట్టారు, దాదాపు 300 దుకాణాలను కూల్చివేశారని ఆయన తెలిపారు. దాదాపు 85శాతం మంది ప్రజలను నిర్వాసితులను చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించకుండా ఇజ్రాయిల్‌ను నిలువరించేందుకు మధ్యవర్తులు తక్షణమే చర్యలు తీసుకోవాలని హమాస్ డిమాండ్ చేసింది.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

ఇండ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్యకార్డులివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి వారు కృషి చేస్తు న్నారని తెలిపారు. వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. జర్న లిస్టులు చాలీచాలని వేతనాలతో జీవితాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరముందని సూచించారు. అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. గత పదేండ్లుగా వివిధ కారణాలతో దాదాపు 500 మందికి పైగా జర్నలిస్టులు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో సంగారెడ్డిలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెస్తున్నామనీ, వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలు

ఇండ్లస్థలాలు

ఈ సమస్య గత నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య మరింత జఠిలమైంది. ప్రభుత్వాలు మారుతున్నాయి గానీ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు మాత్రం రావడం లేదు. జర్నలిస్టులకు వెంటనే ఇండ్లస్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

పెన్షన్ పథకం

రిటైరైన జర్నలిస్టులకు కేరళ, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టుగా పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలి.

అక్రిడిటేషన్లు

ప్రతి రెండేండ్లకోసారి ఇవ్వాల్సిన అక్రిడిటేషన్లు ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ కొత్త కార్డులను ఇవ్వలేదు. ఉన్న వాటినే ప్రతి మూడు నెలలకోసారి గడువును పొడిగిస్తున్నారు. అర్హులైన జర్నలిస్టు లందరికీ అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి.

హెల్త్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో, నిమ్స్‌లో తప్ప ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు జర్నలిస్టుల ఆరోగ్య కార్డుల ద్వారా సేవలను అందించడం లేదు. నిమ్స్‌లో కూడా మందులు బయట నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టు ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలి. వెల్‌నెస్ సెంటర్లను బలోపేతం చేయాలి.

మహిళా జర్నలిస్టులు

మీడియాలో మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్నది. పత్రికా, ఎలక్ట్రానిక్, ఇతర సంస్థల్లో వారికి తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మీడియా సంస్థలను ప్రభుత్వం ఆదేశించాలి.

వేజ్‌బోర్డు, ఉద్యోగ భద్రత

జర్నలిస్టులకు తగిన ఉద్యోగ భద్రత లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మండల, జోన్ విలేకర్ల పరిస్థితి మరీ దారుణం. మీడియా సంస్థల్లో వేజ్ బోర్డు అమలుకావడం లేదు. జర్నలిస్టులకు కనీస వేతనాలను ఇవ్వడం లేదు. జస్టిస్ గురుభక్షి మజీఠియా కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఒక ఐఏఎస్ అధికారిని నియమించి అవి అమలయ్యేలా చూడాలి.

ప్రత్యేక రక్షణ చట్టం

జర్నలిస్టులపై భౌతిక దాడులు జరుగుతున్నాయి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం ఉద్యోగుల తరహాలో తేవాలి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రెస్ కౌన్సిల్ ఉన్నా దాన్ని మోడీ సర్కారు తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నది. తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్ని అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి.



మీడియా కమిషన్

రాష్ట్రంలోని మీడియాలో నెలకొన్న పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయడానికి సీనియర్ ఉన్నతాధికారులు, మేధావులు, జర్నలిస్టులతో కమిషన్ వేసి సమస్యలను గుర్తించాలి. ఆ కమిషన్ సిఫారసు మేరకు జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

మీడియా అకాడమీ

తెలంగాణ అకాడమీ చేపడుతున్న స్వల్ప సంక్షేమ పథకాలు సరిపోవు. జర్నలిస్టులకు శిక్షణా తరగతులను నిర్వహించాలి. చనిపోయిన జర్నలిస్టులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. జర్నలిస్టు బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి.



ఉద్రిక్తతలకు మరింత ఊతం

యూసీసీపై గుజరాత్‌లో ఆందోళన

అహ్మదాబాద్ : ఉమ్మడి పౌరస్మృతిపై (యూసీసీ) చర్చించి ముసాయిదాను రూపొందించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. యూసీసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిన విషయం తెలిసిందే. ఉన్నత స్థాయి కమిటీకి నేతృత్వం వహించేందుకు ఉత్తరాఖండ్‌లో యూసీసీ బిల్లును రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజనా దేశాయ్‌ని గుజరాత్ ప్రభుత్వం ఎంపిక చేసింది. నివేదికను సమర్పించేందుకు కమిటీకి 45 రోజుల సమయం ఇచ్చారు. కాగా రాష్ట్రంలో యూసీసీ అమలుపై సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అసలే మతపరమైన ఉద్రిక్తతలతో అట్టుడికిపోయే గుజరాత్‌లో యూసీసీ అమలుతో ఘర్షణలు మరింత పెచ్చరిల్లుతాయని పలువురు సామాజిక కార్యకర్తలు, స్థానికులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామిక స్వభావాన్ని యూసీసీ విచ్ఛిన్నం చేస్తుందని సామాజిక, సాంస్కృతిక కార్యకర్త హిరేన్ గాంధీ చెప్పారు. 'గుజరాత్ ఇప్పటికే పూర్తిగా ఫాసిస్టుల లేబొరేటరీగా మారిపోయింది. 1980వ దశకం నుండి ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారు. 1980ల నుండే రాష్ట్రంలో యూసీసీ మూలాలు కన్పిస్తున్నాయి. అప్పటి నుండి అది బీజేపీ అజెండాలోనే ఉంది' అని ఆయన అన్నారు. యూసీసీ అమలుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను గుజరాత్‌లోని పలు మితవాద సంస్థలు ఇప్పటికే సమర్థిస్తున్నాయి. మైనారిటీలు మాత్రం తమ మతపరమైన గుర్తింపును కోల్పోతామని, హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా ఇది ఉమ్మడి పౌరస్మృతి కాదని, లక్షిత పౌరస్మృతి అని మైనారిటీ సమన్వయ కమిటీ కన్వీనర్ ముజాహిద్ నఫీస్ వ్యాఖ్యానించారు.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలులోకి వచ్చిన రెండు వారాలకే ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా పౌరులు అందించే వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, తృతీయ పక్షానికి అందుబాటులో ఉంచబోమని ప్రభుత్వం నచ్చచెబుతోంది. గుజరాత్‌లో ప్రజల్లో భయాందోళనలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. చట్టాలను ఆయుధాలుగా చేసుకొని ముస్లిం సమాజాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో యూసీసీ కూడా భాగమేనని పీయూసీఎల్ సభ్యుడు ప్రసాద్ చాకో విమర్శించారు. ముస్లింల ప్రాబల్యాన్ని తగ్గించే దిశగా చట్టాలను రూపొందిస్తున్నారని, విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలతో కించపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి తరుణంలో యూసీసీ అవసరం ఉన్నదా అని ప్రశ్నించారు.

సంపాదకీయం

'రక్తహీనత ముక్త్‌భారత్' ఇంకెప్పుడు?



గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే మన భావి భారతం ఆరోగ్యంగా ఎదుగుతుంది. ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం. కానీ మన దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. దేశంలో 15 నుంచి 49 ఏండ్ల లోపు గర్భిణుల్లో సగానికన్నా ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తాజా లెక్కలు చెబుతున్నాయి. ఇవేవో ప్రయివేటు సంస్థలు చెప్పిన లెక్కలనుకుంటే పప్పులో కాలేసినట్టే. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఇటీవల ప్రకటించిన పచ్చినిజాలు. అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం మన దేశంలో గర్భం ధరించిన మహిళల స్థితి పై విధంగా ఉంది. అంతేకాదు రాష్ట్రాల వారీగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల శాతాన్ని కూడా ఈ నివేదిక బయటపెట్టింది. వీటిలో గుజరాత్, త్రిపుర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రభాగాన ఉండటం గమనార్హం.

ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం నుంచి రక్తహీత సమస్యను తరిమేస్తామంటూ 2018లో 'రక్తహీనత ముక్త్‌భారత్' (రక్తహీనత రహిత భారతం) అనే విధానాన్ని ఎంతో గొప్పగా ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వచ్చి ఏడేండ్లు గడుస్తున్నా ఫలితాల్లో పెద్దగా తేడాలు కనిపించడం లేదని తాజా సర్వేలే చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే 5 ప్రకారం కూడా మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికల్లో, గర్భిణుల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని తేలింది. నిజానికి రక్తహీనత ముక్త్‌భారత్ అన్న సంకల్పంతో మొత్తం ఆరు లక్ష్యాలతో నివారణ మార్గాలను కేంద్రం సూచించింది. ఆ మేరకు ఆహార విధానం, వైద్య చికిత్స, ఐరన్ లోపాన్ని నివారించడం, తీవ్రమైన రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారికి తగిన చికిత్స అందించడం, దీని కోసం మెడికల్ ఆఫీసర్లకు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం వంటి విధానాలను ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చింది. కానీ ఇవేవీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.

మన తెలుగు రాష్ట్రాల్లో కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఇక తెలంగాణలోనూ మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని అనేక లెక్కల సారాంశం. 15 నుంచి 45 ఏండ్లుగల మహిళలు మన రాష్ట్రంలో 57.6 శాతం ఉండగా, వీరిలో అత్యధిక శాతం పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తేలింది. నిజానికి 2014-15తో పోల్చితే 2018-19లో సమస్య మరింత పెరిగింది. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో, బీజేపీ తీసుకొచ్చిన రక్తహీనత ముక్త్‌భారత్ ఏ మేరకు పని చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

గర్భిణి దశలో పోషకాహారం తీసుకోక పోవడం వల్ల తల్లీబిడ్డలపై దుష్ప్రభావం చూపుతోందని ఎన్నో నివేదికలు చెబుతున్నాయి. నాడీ సంబంధిత సమస్యలు, తక్కువ బరువు, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం, మృతశిశువు జన్మించడం వంటి సమస్యలకు గర్భిణులు ఎదుర్కొంటున్న రక్తహీనతే ప్రధాన కారణం. రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహార సరుకులు అందడం గగనంగా మారిపోయిందనేది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. ప్రభుత్వాలు ఏండ్లుగా ఎన్ని విధానాలు తీసుకొచ్చినా రక్తహీనతను నివారించలేకపోతున్నాయి. పైగా నేడు మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా గర్భిణుల ఆరోగ్యం మరింత అధ్వాన్నంగా తయారవుతోంది.

దేశంలోని పెద్ద రాష్ట్రాల కేటగిరిలో అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 71.7 శాతం మంది రక్తహీనత బాధితులు నమోదయ్యారు. ఈ దుస్థితికి పౌష్టికాహార లోపమే ప్రధాన కారణమనేది నిపుణుల మాట. అలాగే ప్రసవ సమయంలో అధిక రక్తస్రావమైనప్పుడు రక్తహీనత ప్రాణాంతకంగా కూడా మారుతోంది. బాలింత మరణాలకు దాదాపు 70 శాతం ఇదే ప్రధాన కారణం. వీటికి తోడు విటమిన్ బి12, ఫోలేట్, ఎ విటమిన్ లోపాలు, వాయు కాలుష్యం కూడా తోడై సమస్యను మరింత జఠిలం చేస్తున్నదని నిపుణులు చెబుతున్నారు. కనుక పాలకులు సమస్య పరిష్కారం కోసం ఈ వైపుగా కూడా తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

సమస్య మూలాల్లోకి వెళ్లకుండా పరిష్కరించడం సాధ్యంకాదు. ఆరోగ్య భారతం నిర్మితమవ్వాలంటే గర్భిణులకు పౌష్టికాహారం అందుబాటులో ఉండాలి. రక్తహీనతకు గురికాకుండా వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. దేశంలో మహిళల ఆరోగ్యాన్ని, భావిభారతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించాలి. అభివృద్ధిని ప్రజల అవసరాలు తీర్చడంలో, వారి జీవన ప్రమాణాలను పెం పొందించే విధంగా చూడాలి. తాజా నివేదికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో తక్షణ చర్యలు చేపట్టాలి.

ఐరాసలో ఉక్రెయిన్ తీర్మానాలు - వివాదాస్పదమవుతున్న ట్రంప్ నిర్ణయాలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రెండవ పదవీ కాలం తొలి నెల రోజుల్లో చేసిన ప్రకటనలు, తీసుకున్న నిర్ణయాల పరిణామాలు, పర్యవసానాల గురించి పరిపరి కథనాలు వెలువడుతున్నాయి. నిజంగా ఏం జరిగేది ఎవరూ చెప్పలేని స్థితి. రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలనే ఎత్తుగడతో అమెరికా ఉందని చెబుతున్నారు. సోమవారం నాడు ఐరాసలో జరిగిన పరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి. తమపై నాలుగో ఏడాదిలో ప్రవేశించిన రష్యా సైనిక చర్యలను ఖండిస్తూ దాడులు నిలిపివేయాలని ఐరాస సాధారణ అసెంబ్లీలో ఉక్రెయిన్ సోమవారం నాడు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దానికి అనుకూలంగా 93, వ్యతిరేకంగా 18 దేశాలు ఓటు చేయగా, భారత్, చైనాతో సహా 65 దేశాలు తటస్థంగా ఉన్నాయి. గతంలో 140దేశాలు రష్యా చర్యను ఖండించే తీర్మానానికి మద్దతు ఇవ్వగా ఈసారి 93కు తగ్గాయి. ఉక్రెయిన్ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకుని " త్వరగా సంక్షోభాన్ని ముగించాలని " తాను ప్రతిపాదించిన దానికి మద్దతు ఇవ్వాలని అమెరికా ఒత్తిడి చేసింది. మరోవైపున రష్యా మీద ఎలాంటి విమర్శ చేయకుండా సంక్షోభాన్ని ముగించాలని కోరుతూ భద్రతా మండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతుగా పది ఓట్లు రాగా ఐదుదేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. వాటిలో వీటో హక్కు కలిగిన బ్రిటన్, ఫ్రాన్సు కూడా ఉండటం విశేషం.

తమకు నాటో సభ్యత్వమిస్తే పదవి నుంచి వైదొలగటానికి కూడా సిద్ధమే అని, తమ ప్రాంతాలను ఆక్రమించిన పుతిన్ అక్కడే తిష్టవేయటాన్ని అంగీకరించేది లేదని జెలెన్‌స్కీ అంతకుముందు చెప్పాడు. తాము చేసిన ప్రతి డాలరు మిలిటరీ సాయానికి రెండు డాలర్లు చెల్లించాలని అమెరికా డిమాండ్ చేస్తోందన్నాడు. ఐదువందల బిలియన్ డాలర్ల ఖనిజాలను అప్పగించాలన్న వాషింగ్టన్ ఒత్తిడికి లొంగేది లేదని కూడా చెప్పాడు, అవసరమైతే వచ్చే పదితరాల వారు తమ రుణాలను తీర్చుకుంటారని అన్నాడు. విలువైన ఉక్రెయిన్ ఖనిజాల్లో 350 బిలియన్ డాలర్ల విలువ గలవి రష్యా అధీన ప్రాంతాల్లోనే ఉన్నాయని ఉపప్రధాని యులియా చెప్పాడు. ఉక్రెయిన్‌కు మద్దతు తెలిపేందుకు సోమవారం నాడు అనేక మంది ఐరోపా నేతలు కీవ్ చేరుకున్నారు. ఉక్రెయిన్‌పై ఒక నిర్ణయం తీసుకొనేందుకు, ఐరోపా రక్షణ గురించి చర్చించేందుకు మార్చి నెల ఆరోతేదీన సమావేశం కానున్నారు. రానున్న రెండు వారాల్లో రెండవసారి సమావేశమయ్యేందుకు అమెరికా, రష్యా ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. తప్పుడు సమాచార బుడగలో ట్రంప్ ఇరుక్కు పోయాడని అన్న జెలెన్‌స్కీని నియంత అని ట్రంప్ వర్ణించటాన్ని అర్ధం చేసుకోదగినదే అని రష్యా సమర్ధించింది.

రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి కారణం అదే కదా!

రష్యాను దగ్గరకు తీసుకొని చైనాకు వ్యతిరేకంగా నిలపాలని నిజంగా ట్రంప్ భావిస్తే అది ఇప్పటికైతే ఊహాజనితమే. ఒకవేళ అదే జరిగితే ఇప్పటికే మరోవైపు ఉన్న భారత్, మూడో వైపు ఉన్న జపాన్‌తో కథ నడిపించి చైనాను దెబ్బ తీయా లన్న వ్యూహం ఉందన్నది ఒక దృశ్యం. ఇది కార్యరూపం దాలిస్తే ఐరోపాలో అమెరికా ప్రాబల్యం తగ్గి చైనా పలుకుబడి పెరుగుతుందని మరికొందరి హెచ్చరిక. ఉక్రెయిన్‌ను ఫణంగా పెట్టి రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంటే ప్రపంచంలో అమెరికాను నమ్మే పరిస్థితి ఉంటుందా? ట్రంప్‌ను నమ్మి రష్యా ముందుకు పోతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే అమెరికన్లు జి7 కూటమిని జి8గా మార్చి రష్యాను చేర్చుకొనేందుకు చూశారు. అది బెడిసికొట్టడంతో రష్యాను వ్యతిరేకించటమే గాదు, దానికి ముప్పు తెచ్చేందుకు చూశారు. ఉక్రెయిన్ సంక్షో భానికి కారణం అదే కదా! గడచిన మూడేండ్లుగా ఆంక్షలతో ఆర్థికంగా దెబ్బతీసేందుకు చూసిన తీరు, ఉక్రెయిన్ [illegible] సంభవించినట్లు చెబుతున్న ప్రాణ, ఆర్థిక నష్టాలను మరచి రష్యన్లు కొత్త బాటలో నడు స్తారా? కష్ట సమయంలో ఆదుకున్న చైనాకు వ్యతిరేకంగా జట్టు కడుతుందా? పుతిన్ లేదా పాలకవర్గం లొంగిపోయినా జనం సమ్మతిస్తారా ? అమెరికాయే చేతగాక బేరసారాలకు దిగు తుంటే రష్యన్లు చైనాను కట్టడి చేయగలరా? ఇలాంటి అనేక ఊహాజనిత దృశ్యాలను కొందరు ఆవిష్కరిస్తున్నారు.

చరిత్రను చూస్తే నాటి సోవియట్-చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన సైద్ధాంతిక వివాదాలు, దేశాల మధ్య విబేధాలకు దారితీశాయి. 1969లో ఆరు నెలలకు పైగా సరిహద్దులో ఇరు సైన్యాలను మోహరించటమే గాదు, స్వల్ప ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. దాన్ని వినియోగించుకొని సోవియట్‌ను దెబ్బతీసేందుకు అమెరికన్లు ప్రజా చైనాను గుర్తించి భద్రతా మండలిలో ప్రాతినిధ్యానికి అంగీకరించారన్నది ఒక అభిప్రాయం. తమ సమస్యల నుంచి బయటపడేందుకు విదేశాలకు మార్కెట్‌ను తెరిచే సంస్కరణలు అవసరమని చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని అక్కడ ఉన్న విస్తారమైన శ్రమశక్తిని కారుచౌకగా పొందేందుకు, మార్కెట్లో ప్రవేశించేందుకు అమెరికా విని యోగించుకుందన్నది మరొక సూత్రీకరణ. అంతిమంగా నాలుగు దశాబ్దాల అనుభవంలో ఎవరు ఎవరిని విని యోగించుకున్నారని బేరీజు వేస్తే ఎగుమతులతో చైనా దిగుమతులతో అమెరికా, ఐరోపా లబ్దిపొందాయి. కొన్ని లాటిన్ అమెరికా దేశాలు ఎగుమతి ఆధారిత వ్యవస్థలతో కొనసాగిన మాదిరి చైనా కూడా అలాగే ఉంటుందని భావించిన అమెరికా ఘోరంగా దెబ్బతిన్నది. అన్ని రంగాలలో తననే సవాలు చేసే విధంగా మారుతుందని అది అంచనా వేయ లేక పోయింది, గుర్తించేసరికే తమ చేతులు దాటిపోయినట్లు గమనించింది. దాని పర్యవసానమే డోనాల్డ్ ట్రంప్ తొలి పాలనా కాలంలో ప్రారంభించిన వాణిజ్య యుద్ధం. ఇప్పుడు దాని కొనసాగింపుతో మరోసారి ముందుకు పోనున్నట్లు సూచనలు.

చైనా గురించి మరోసారి అమెరికా అంచనాలు తప్పనున్నాయా? అట్లాంటిక్ పత్రిక వ్యాఖ్యాత కథనం చైనాకు ప్రపంచాన్ని అప్పగించనున్న ట్రంప్ అంటూ సాగింది. ఇది సామ్రాజ్యవాదుల కోణంలో ఆలోచిస్తున్నవారి బుర్రలో పుట్టిన బుద్ధి అని చెప్పవచ్చు." అమెరికా ప్రపంచ నాయకత్వం ముగుస్తున్నది. ఇది అమెరికా దిగజారి లేదా బహుధ్రువ ప్రపంచం ఉనికిలోకి వచ్చికాదు లేదా అమెరికా ప్రత్యర్థుల చర్యలతో జరుగుతున్నది కాదు. నాయకత్వ ముగింపు, ఎందుకంటే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాడు గనుక. ఇంటా బయటా ట్రంప్ విధానాలు అత్యంత వేగంగా అమెరికా అధికార పునాదులను నాశనం చేస్తున్నాయి. ప్రపంచ అగ్రశక్తిగా ప్రస్తుతం అమెరికాను పక్కకు నెట్టి దాని స్థానాన్ని ఆక్రమించాలని చూస్తున్న చైనా నేత షీ జిన్‌పింగ్ ప్రధాన లబ్దిదారు అవుతాడు. ప్రపంచాన్ని హ్రస్వదృష్టితో చూస్తున్న ట్రంప్‌కు తానేం చేస్తున్నదీ తెలియటం లేదు, అతడి చర్యలు అంతర్జాతీయ భద్రతకు ముప్పు తెస్తున్నా యని, అమెరికా భవిష్యత్ కూడా దానితోనే ముడిపడి ఉందని తెలుసుకోలేక పోతున్నాడు, అమెరికా వదలిన ఖాళీలో చైనా ప్రవేశాన్ని ఇతర ధనిక దేశాలు అడ్డుకోవలేవంటూ ఆ పత్రిక విశ్లేషణ కొనసాగింది.



వాణిజ్య యుద్ధం గురించి అమెరికా గతంలో వేసుకున్న అంచనాలు తప్పాయి. 2024లో అమెరికా వాణిజ్య లోటు లక్ష కోట్ల డాలర్లుగా ఉంటే చైనా వాణిజ్య మిగులు కూడా అంతే ఉంది. అమెరికా, ఐరోపాలో కోల్పోయిన మార్కెట్లను మరోచోట పొందేందుకు చైనా ముందుకు పోతున్నది.ట్రంప్ ప్రకటించినట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి వాటి నుంచి అమెరికా వైదొలిగినా, యూఎస్‌ఎయిడ్ ఆకస్మికంగా నిలిపివేసినా ఆ స్థానాన్ని చైనా ఆక్రమిస్తుందని కొందరు ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దరించే పేరుతో సాయం బిస్కెట్లతో పలు దేశాల్లో పాగా వేయాలని చూసిన అగ్రదేశపు అమెరికా ఎత్తుగడ ఫలించలేదు. అలాంటిది అంతశక్తిలేని చైనా వల్ల అవుతుందా? నిజానికి చైనా నేరుగా అప్పులిస్తున్నది తప్ప అమెరికా, జపాన్, మరొక ధనిక దేశం మాదిరి సాయం పేరుతో షరతులతో కూడిన నిధులు ఇవ్వటం లేదు, అలాంటి ఏర్పాట్లు కూడా లేవు. అమెరికా సాయం పొంది బాగుపడిన దేశాలేమిటంటే ఎవరూ చెప్పలేరు, కానీ అనేక దేశాల్లో మౌలిక సదుపాయాల్లో చైనా పెట్టుబడుల ఫలితాలు కనిపిస్తున్నాయి. చరిత్రలో మార్కెట్ల కోసం ఏకంగా దేశాలనే ఆక్రమించుకోవటం తెలిసిందే. తొలి వాణిజ్య యుద్ధం చైనా-బ్రిటన్ మధ్య నల్లమందు దిగుమతుల మీద జరిగింది. రెండవది కూడా అదే సమస్య మీద బ్రిటన్, ఫ్రాన్స్ కలసి చేశాయి. తొలి యుద్ధంలో నల్లమందును ధ్వంసం చేసినందుకు చైనా నష్టపరిహారం చెల్లించటంతో పాటు హాంకాంగ్ దీవులను బ్రిటన్‌కు 99 సంవత్సరాల పాటు కౌలుకిచ్చేందుకు ఒప్పందం జరిగింది. రెండవ యుద్ధంలో నల్లమందు విక్రయాలను చట్టపరంచేసేందుకు ఒప్పందాన్ని రుద్దారు. వర్తమాన వాణిజ్య యుద్ధాన్ని చైనా మీద అమెరికా 2018లో ప్రారంభించింది.ట్రంప్ దిగిపోయినా బైడెన్ కొన సాగించాడు, తిరిగి ట్రంప్ వచ్చాడు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడూ చైనా కుంగిపోలేదు, ఇప్పుడు మరింత సమర్థవంతంగా ఎదుర్కొనే బలాన్ని కలిగి ఉంది.వాణిజ్యపోరు కరెన్సీ పోరుకు విస్తరించింది.

కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది.

కెనడా, మెక్సికోల మీద 25శాతం పన్ను విధిస్తానన్న ట్రంప్ చైనా దగ్గరకు వచ్చేసరికి పదిశాతమే అన్నాడు.నిజానికి 2024లో జో బైడెన్ చైనా నుంచి దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాలపై 100, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ల మీద 50, లిథియం అయాన్ బాటరీలపై 25శాతం చొప్పున దిగుమతి సుంకాలు విధించాడు. తాజాగా ట్రంప్ చేసిన ప్రక టనను అసలు చైనా పట్టించుకోలేదనే చెప్పాలి. కొన్ని నామమాత్ర చర్యలు తీసుకుంది. అవి అమెరికా నుంచి దిగుమతయ్యే వాటిలో పదో వంతు వస్తువుల మీదనే అని వార్తలు.పెద్ద మొత్తంలో సుంకాలు విధిస్తే ఎక్కువగా నష్టపోయేది అమెరికాయే గనుక ఎంతవరకు ముందుకు పోతుందో చూద్దాం అన్నట్లుగా చైనా ఉంది. ఎనిమిదేండ్ల నాటితో పోలిస్తే తాజా బెది రింపు లెక్కలోది కాదని భావిస్తోంది. అందుకే ట్రంప్ ప్రకటనలను అది ఖాతరు చేయటం లేదు.దీని అర్ధం అసలేమీ ప్రతికూల ప్రభావాలు ఉండవని కాదు.

ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్న పూర్వరంగంలో అమెరికా పాలకవర్గం చూస్తూ ఊరుకుంటుందా? శత్రువుగా పరిగణించే చైనాతో పాటు తన కనుసన్నల్లో నడిచే కెనడా, మెక్సికో, ఐరోపా దేశాలు, చేతులు కలిపేందుకు తహతహలాడుతున్న భారత్ మీద కూడా బస్తీమే సవాల్ అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. ఆయా దేశాలతో బేరమాడేందుకు అయితే సరే, మొదటికే మోసం వస్తే పాలకవర్గం సహించే సమస్యే లేదు. దాని డిఎన్‌ఏలో ఎలాంటి మార్పులు ఉండవు. ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా పాల్గొనేందుకు ప్రోత్సహించటానికి మనమెందుకు డబ్బు ఇవ్వాలంటూ ట్రంప్ చేసిన ప్రకటన అమెరికా సామాన్యులను ఆకట్టుకుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సాయం పేరుతో జరుపుతున్న కార్యకలాపాలు వేరు. ఇప్పటి వరకు జరిపిన వాటితో ఫలితం లేకపోతే సమీక్షల తరువాత కొత్త రూపాలతో అమెరికా రంగంలోకి దిగుతుంది తప్ప వెనక్కు తగ్గే అవకాశం లేదు !

'అందరికీ విద్య' అందని ద్రాక్షేనా?

ఒకప్పుడు ఎంతగానో ఆరాధించిన ప్రభుత్వ విద్య రానురానూ ప్రజాధారణ కోల్పోతున్నదేమోననే ఆందోళన కలుగుతున్నది. మరోపక్క ప్రయివేటు రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈవ్యాపారంలో కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు కూడా నేరుగా భాగస్వాములవుతున్న పరిస్థితి నేడు నెలకొంది. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయ గలిగిన సామర్థ్యంగల అధికారగణం ఉన్నా పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రయివేటు బడుల్లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో ఇవి నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభ నష్టాలతో సంబ ంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యనందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రయివేటు పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండా పోయింది. అందుకే చట్టాల అవసరం అప్పట్లో తలెత్త లేదు. ఇక ప్రభుత్వరంగంలో కూడా ఆనాడు ఎంతో ప్రతిష్టంగా నడిచేవి. రాజకీయ జోక్యం ఉండేది కాదు. కానీ రానురానూ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు



అడుగంటి పోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రయివేటు పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపే మొగ్గు చూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతులు లేనివారు, మరోదారి లేక విధిలేని పరిస్థితుల్లోనే ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇటీవల కాలంలో గ్రామాలకు కూడా ఈ ప్రయివేటు విద్యావ్యాపారం విస్తరించింది. ఇక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. ఏడాదికేడాది చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రయివేటు రంగంలో పెరిగిపోతున్నది.

ఇటీవల సాక్షాత్తూ తెలంగాణ సర్కార్ పాఠశాలల విద్యకు సంబంధించిన వివరాలు అసెంబ్లీలో వెల్లడించింది. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వబడుల్లో చదివే విద్యార్థులు 30లక్షల 78వేల 109 మంది ఉండగా ప్రయివేటులో 20లక్షల67వేల 597 మంది ఉన్నారు. అయితే 2022-23 విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్య తగ్గి ప్రయివేటు రంగంలో పెరిగిపోయింది. సర్కారు బడులకంటే ప్రయివేటు స్కూల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా విద్యార్థులు అదనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింత తగ్గిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా, ప్రయివేటు బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా ప్రవేశాలు పెరిగిపోయాయి. అంటే దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ఏడు లక్షలకుపైగా ఎక్కువమంది చేరారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం కూడా అదే పరిస్థితి. ఇలాగే ప్రభుత్వరంగంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ఆ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి? కారకులెవరు? కారణాలేమిటి? అనేది అటు అధికార వర్గాలకు కానీ, పాలకులకు కానీ తెలియనిది కాదు. 'మధ్యాహ్న భోజనం పెడతాం, పుస్తకాలు ఉచితంగా ఇస్తాం, బోధన ఫ్రీగా చేస్తామంటూ' సకల విధాల ప్రాధేయపడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలితాలనివ్వడం లేదు.దానికి కారణం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు పాలకులు సరైన అవగాహన కల్పించకపోవడమే.

భరించలేని ఫీజులు ప్రయివేటు రంగంలో కట్టాల్సివస్తున్నా అటువైపే మొగ్గు ఎందుకు చూపుతున్నారో ఇప్పటికైనా సర్కార్ ఆలోచించాలి. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉన్నా, ఆచరణకొచ్చేసరికి అసలు సమస్యలే గుదిబండలా మారుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యం గా పాఠశాలల్లో కనీసవసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. మన రాష్ట్రం వరకు పరిశీలించినా వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచినీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేక పోవడం ప్రత్యేకంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కనుచూపుమేరలో కన్పిం చడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవజాతి అభ్యు న్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. 06 నుంచి 14 యేళ్ల బాలబాలికలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమాన్ని పదేండ్లలోనే పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయిం చారు. ఆ సంకల్పం కాగితాల్లోనే 'కన్నుమూసింది'. ఇక డిపెప్, ఎపెప్ సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. విద్యార్థుల ను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడుతుంటే ప్రేక్షక పాత్ర వహించ డం ఏమాత్రం సరికాదు. ఇప్పటికైనా పాల కులు కళ్లు తెరవాలి. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి.

- సభావట్ కళ్యాణ్, 9014322572

పాటలు పుట్టిన తావుల్లో 'ప్రజా సంస్కృతి'



భూపతి వెంకటేశ్వర్లు
9490098343

మనిషి బతికేందుకు గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, వాటి సమానస్థాయికి సరితూగగలిగేది ఏదైనా ఉందంటే అది మన 'సంస్కృతి'. మూఢనమ్మకాల సుడిగుండంలో కొట్టుకుపోతున్న నేటి సమాజానికి ఇది చాలా ముఖ్యం. దీనికి కావాల్సింది ధనమో, దర్పమో కాదు, ఒక మహత్తరమైన సాంఘిక శక్తి సమహారం. 'అబద్దాల ఫ్యాక్టరీ'లో, 'వాట్సాప్ యూనివర్సిటీ'లో తమకు కావాల్సిన భావజాలాన్ని ఉత్పత్తి చేసుకున్నట్టుగా ఇది ఉండదు. శ్రమైక జీవన సౌందర్యపు చెమటచుక్కల నుంచి పుట్టుకొచ్చేది. సామాజిక అవసరాలకు ఉపయోగడపడే వృత్తుల నుంచి ఉద్భవించేది. పొలంలో పనిచేస్తున్న కూలీల గొంతులో కడలి స్వరంలా ఉప్పొంగేది. ఒక్కటేమిటి? చూసే కోణం ఉండాలి గానీ, అది మనతో, ప్రకృతితో ముడివేసుకున్న బంధం. అందులో అణువణువునా దాగి ఉన్నదే 'ప్రజాసంస్కృతి'. దీన్ని నియమ బద్ధంగా, శాస్త్రీయంగా వర్ధిల్లేలా చూస్తేనే పురోగమన భావాలవైపు ప్రజా చైతన్యంగా పురోగమిస్తుంది. లేదంటే చైతన్యహీనమై చతికిల పడుతుంది. ఎందుకంటే, పురోగామి శక్తుల జోక్యం నేడు తగినంతగా లేకపోవడం మూలంగా తిరోగమన శక్తుల జోక్యం తిరుగులేనిదిగా సాగుతున్నది. ఇది మానవజాతికి అతిపెద్ద ప్రమాదకరం.

ఈ దశాబ్దకాలంగా జరుగుతున్న ఘటనల్ని చూస్తే మనం దేశం ఎటువైపు పయనిస్తోందో తెలుస్తూనేవుంది. కలంపై దాడి, గళంపై దాడి, మతంపై దాడి, విశ్వాసంపై దాడి, చివరకు సంస్కృతిపైన కూడా దాడే. చిమ్మ చీకట్లో కూడా ప్రశ్న బతికి బట్టకట్టాలన్నా, మనిషి స్వేచ్ఛగా జీవించాలన్నా ఒక మహా ప్రయత్నమే చేయాల్సిన అవసరం ఉన్నది. అందుకు యువతీయువకుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గం.

మానవ జీవితాలను ముందుకు నడిపించే జ్ఞానమే సంస్కృతి. ఈ జ్ఞానమే లేనప్పుడు అశాస్త్రీయ వాదనలు, అన్యాయాలు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, కర్మ, రాత ఇలాంటివే దేశంలో అలుముకుంటున్న ఒక తీవ్ర జాతీయ వాద నిరంకుశ వాతావరణాన్ని ఏదో ఒక స్థాయిలో నిలువరించాలి. దానికో సువిశాల వేదిక ఏర్పడాలి. అలాంటి పరిస్థితుల్లో ఆవిర్భవించినదే తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే).

ప్రజల్ని నిత్యం చైతన్యపరుస్తూ, వారికి నిరంతరం వాస్తవాల్ని తెలియపరుస్తూ, సాంస్కృతిక జీవన విలువల్ని పెంపొందిస్తున్నది టీపీఎస్‌కే. ఇటీవల కాలంలో సుద్దాల హనుమంతు పేరుమీద ప్రజా సాంస్కృతిక ఉత్సవాలను మహబూబ్‌నగర్ పట్టణంలో రెండురోజుల పాటు నిర్వహించింది. పండుగ సాయన్న, మీర సాయబ్, దున్న ఇద్దస్, సురవరం లాంటి మహనీయులకు ప్రఖ్యాతిగాంచిన నేల పాలమూరు. ఎక్కడెక్కడో సెలయేళ్లలో వర్షపు నీరంతా వచ్చి మహా సముద్రంలో మమేకమైనట్టుగా విద్యార్థి, యువజనులంతా ప్రజాసంస్కృతిలో భాగమై ఒక్కటిగా నిలిచారు. ఏకకాలంలో భారత రాజ్యాంగంలోని ప్రధాన సూత్రాలైన ప్రజాస్వామ్య, సౌర్వభౌమ, గణ తంత్ర, స్వేచ్ఛా సమానత్వం పేర్లతో ఏర్పాటైన నాలుగు వేదికలపై, ఇరవైఆరు కళాశాలల నుంచి వచ్చిన పన్నెం డు వందల మంది ఏకధాటిగా సంస్కృతిని ఎలుగెత్తి చాటారు. పరీక్షలకు పదినిమిషాలుండగా కూడా వేదికపై ఆడి పాడి పరీక్షలు ప్రశాంతంగా రాసి ఆటాపాటలు చదువుకు అడ్డుకాదని నిరూపించారు. జానపద సాహిత్యం ద్వారా జాతి సంస్కృతిని తెలిపారు. వీరుల చరిత్రను, ధిక్కార వారసత్వాన్ని కాపాడుకోవాలని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గుర్తు చేశారు. సహేతుకమైన సత్యాలను కళల ద్వారా అందించారు.



తెలంగాణ భూమి పండిన "పంట పొలం" వంటిది. ఎన్నో రకాల జానపద కళల్ని సుసంపన్నం చేసిన చరిత్ర ఈ తెలుగు నేలది. దానికి తగినట్టుగానే కట్టిపడేసే కళారూపాలు, గిరిజనుల నృత్యాలు, అలరించే ఆటలు, పట్టణ ప్రజల్ని ఆలోచింపజేసి అడుగడుగునా వారి అభిమానాన్ని ఈ ఉత్సవాల్లో చురగొన్నారు. శాంతి సామరస్యం, ఐక్యత, సృజనాత్మకత, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆఫ్రికా ఖండం నమిబియా దేశ ఆరోగ్య శాఖ మంత్రి బెర్నాడ్, స్థానిక ఎమ్మెల్యే, సినీ సంగీద దర్శకుడు సుద్దాల అశోక్ తేజ వంటి ప్రముఖులు హాజరై ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఉర్దూ పాఠశాల విద్యార్థినులు స్వయంగా రాసి ప్రదర్శించిన లఘునాటిక 'ఊడలు దిగిన వికృత సంస్కృతి' అందర్నీ ఆకట్టుకుంది. ఈ నాటికలో దేశాలకు సరిహద్దులుంటాయి, ప్రపంచ ప్రజల మధ్య అసమానతలుంటాయి, విశ్వ మానవాళి ఇంటర్‌నెట్‌కి ఏ హద్దుల్లేవు, అంతర్జాలాన్ని ముంచెత్తుతున్న అశ్లీల దృశ్యాల నడుమ బాల్యం బాధాకరంగా మారిందని మొబైల్‌కు "బై" చెప్పి, పుస్తకాలకు "హాయ్" చెప్పే చక్కటి సందేశాన్ని ఇచ్చారు. మరోవైపు "నేనెప్పుడూ రాజ్యానికి ప్రతిపక్షమే " అంటూ కవులు, కవయిత్రులు కవి సమ్మేళనం నిర్వ హించారు. చిత్రకారులు "మేమంతా ఒక్కటే " అంటూ దేశ సమైక్యత చిత్రాలు గీసారు. శాస్త్రీయ నృత్యాలు, బతుకమ్మ, కోలాటం, లఘు నాటికలు, భజన, జానపద కళారూపాలు, తీరొక్క వేషాలు, సాహిత్య, సాంస్కృతికంగా కోలా హలంగా.. గుంపులు గుంపులుగా తరలివచ్చారు. సుద్దాల వేదిక అంటేనే పాటల యుద్ధాల, ప్రగతిశీల ప్రభాత దృక్పథాన్ని ప్రతిబింబించాయి. మైనార్టీ పిల్లలు, ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. విదేశీ సంస్కృతి అనగానే..? చెత్త అని స్వదేశీ సంస్కృతి అంతా బంగారమని, అలాంటి వివాదాలకు పోకుండా విదేశీ, స్వదేశీ అనేవి కలగలిసిపోయాయి. వాటి వర్గసారాన్ని బట్టి మన వైఖరి ఉండాలని బ్రేక్ డ్యాన్స్, వెస్ట్రన్ డాన్స్, పాప్ సంగీతం, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం అన్ని రూపాలను ప్రజలకు చక్కటి సందేశాన్ని అందించే భావజాలంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సమానత్వ అవగాహనను శక్తివంతంగా చూపించారు. ప్రత్యామ్నాయ భావజాలాన్ని బలంగా చెప్పారు. లౌకిక భావాలు, ప్రజాస్వామిక విలువలు, సామాజిక వివక్షలు, పురుషాధిక్య భావజాలంతో ముడిబడ్డ సమస్యలు, వినిమయతత్వం, వ్యక్తి వాదంతో వచ్చే పర్యావసానాల వంటి అంశాలను కళారూపాలలో వ్యక్తం చేశారు. భావ సారూప్యత గలిగిన వ్యక్తులు, అనేక సంస్థలు కలగలిసిన కార్యక్రమమిది. "ఆట పాటలు సమాజంలో మంచి, చెడ్డల విచక్షణ విప్పి చెప్పే ఆయుధాలు. వాటిని ధరించిన యువ కులతో అడుగులు కలపడమే నేటి ప్రత్యామ్నాయం, సుద్దాల సాంస్కృతిక ఉత్సవాలు ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చినవి. ప్రజా సంస్కృతిని పాదుకొల్పేలా ఊతమిచ్చినవి. ఇలాంటివి గల్లీగల్లీనా, పల్లెపల్లెనా, ఊరుఊరునా ఈ ఉత్సవాలు నిరంతరం నిర్వహించాలి. 'సముద్రం విషపూరితం కానంత వరకే జలచరాల మనుగడ' ఇది సమా జంలోని ప్రతి ఒక్కరి గమనంలో ఉండాలి. మనువాద సాహిత్యం ఎక్కడ జడలు విప్పుతుందో.. నిజమైన సాహి త్యం, ప్రజాసంస్కృతి అక్కడ పుట్టుకురావాలి.ఫాసిస్టు ఆధిపత్యపు రెక్కల్ని విరిచేలా ప్రజల్లో మానసికతను చైతన్యాన్ని పెంపొందించాలి. 'ఇక చీకటి యుగం ముగుస్తుంది.. పోరాడే వారు గెలుస్తారు' అన్న భరోసా, ఆత్మవిశ్వాసం ఈ ఉత్సవాల్లో పాల్గొన్న యువతరంలో కనిపించింది. యువజనుల కలయికలో కలవరం వుంది, ఇది వాస్తవం. వాళ్ల సాం స్కృతిక పోరాటంలో న్యాయం ఉంది, ఇది చైతన్యం. వారి పాటలో నైతికత ప్రకటన ఉంది, ఇది దాని మౌలిక స్వరూపం. ఈ విషయాలన్ని సాంస్కృతిక ఉద్యమాల కిందకు వచ్చే విధంగా చూడాలి. వాళ్ల సృజనకు తగిన వేదికలు ఆ పోరాటాలే కల్పించాలి. అంధకారంలో జీవిస్తున్న ప్రజానీకాన్ని సాంస్కృతికరంగం వైపు మళ్లించాలి. ఇది ఆరంభం కాదు, ముగింపు అంతకన్నా కాదు, ఒక అనుభవం మాత్రమే. దీన్ని అణచివేయ బడుతున్న వారి బాటల్లో విస్తరించే బాధ్యత లౌకిక సమాజానిదే.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
కరీంనగర్
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

అశోక్ కుమార్‌ను గెలిపించాలి

-ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉద్యమ నేత వై.అశోక్ కుమార్‌ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రొఫెసర్ కోదండరాం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగిన టీపీటీఎఫ్, యుటీఎఫ్, బీటీఎఫ్, వై.అశోక్ కుమార్‌కు మద్దతు ఇస్తున్న వివిధ సంఘాల నేతలు సభ్యుల సమావేశంలో హాజరైన కోదండరాం 36 ఏళ్ల పైగా ఉపాధ్యాయ ఉద్యమ అనుభవం కలిగిన, తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల జేఏసీ నేతగా పనిచేసిన అపార విశేష అనుభవం కలిగి, అనేక ఉపాధ్యాయ విద్యారంగా సమస్యల పరిష్కారంలో పోరాటం చేశారన్నారు. అనేక సంఘాల మద్దతు పలికిన వై.అశోక్ కుమార్‌ని కరీంనగర్ నియోజకవర్గం టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నేబోయిన తిరుపతి, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మ రమేష్, యుటీఎఫ్ మాజీ రాష్ట్ర సీనియర్ నేత అశోక్ కుమార్, టీపీటీఎఫ్, యుటీఎఫ్, బీటీఎఫ్, రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొడుకు, కోడలే సూత్రధారులు..
అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రుల ఇంట్లో దోపిడీ

- 70తులాల బంగారం, రూ.5లక్షల నగదు స్వాధీనం
- ఐదుగురు అరెస్ట్
- ఒక్కరోజులోనే కేసు చేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జి


రికవరీ చేసిన బంగారం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ జి

నవతెలంగాణ - హుజురాబాద్

ఆస్తి ముందు తండ్రి, తల్లి, చెల్లి అనే మాటకు విలువ లేకుండా పోయాయి. డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ కన్నతండ్రి, తల్లి, చెల్లి డబ్బు, బంగారం కాజేయడానికి కొడుకు, కోడలే ప్రధాన పాత్ర వహిస్తూ సూత్రధారులుగా మారిన ఘటన ఇది. రాష్ట్రంలోనే సంచలనంగా మారిన దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లోనే చేదించి, దొంగలను పట్టుకొని రికార్డు సృష్టించారు.

కేసు వివరాలను మంగళవారం హుజురాబాద్ ఏసీపీ సిహెచ్.శ్రీనివాస్ జి స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు.

హుజురాబాద్ పట్టణంలోని ప్రతాప్‌వాడలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన భారీ దోపిడీలో సూత్రధారులైన ప్రతాప రాఘవరెడ్డి కొడుకు ప్రతాప నాగరాజు, కోడలు శాలినితోపాటు అతని హెూటల్లో పనిచేస్తున్న అమీర్ స్టేషన్ ఘనపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన సమీర్, హుస్నాబాద్ కుందనపల్లికి చెందిన కృష్ణను మంగళవారం అరెస్టు చేశారు. ఏసీపీ కథనం మేరకు.. ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి తన ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగిందని ముగ్గురు దొంగలు వచ్చి తనపై భార్యపై, కూతురుపై దాడి చేసి 70 తులాల బంగారం, ఏడు లక్షల నగదు పట్టుకెళ్లారని ఫిర్యాదు చేశారు. హుజురాబాద్ టౌన్ సీఐ జి.తిరుమల గౌడ్, ఎస్సై యునస్ అలీ, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ పోలీసుల సహాయంతో కేసును 24 గంటల్లో చేదించి అరెస్టు చేశారు. దొంగతనానికి పాల్పడిన ముగ్గురు కేసి క్యాంపు వద్ద దొరకడంతో వారిని పట్టుకుని అరెస్టు చేశారు. రాఘవరెడ్డి కుమారుడైన ప్రతాప నాగరాజు వివిధ కారణాలతో 1.80 కోట్ల రూపాయలు అప్పు చేశాడు. దీంతో తన అప్పులు తీర్చుకోవడానికి తన సోదరి మానస, తల్లిదండ్రుల వద్ద ఉన్న బంగారం డబ్బులు కాజేయడానికి కోడలు శాలిని తన హోటల్లో పనిచేస్తున్న అమీర్ సహాయం కోరింది. అమీర్ మల్కాపూర్‌కు చెందిన సమీర్‌ను సంప్రదించాడు. సమీర్ కరీంనగర్‌కు చెందిన మున్నా, హుస్నాబాద్‌కు చెందిన కృష్ణతో కలిసి పథకం పన్నారు. ఈ డబ్బులు దొంగిలించడానికి నాగరాజు, శాలిని మిగతా వారు కలిసి మూడుసార్లు ప్రయత్నం చేసినప్పటికీ అది ఫలించలేదు. ఆదివారం రాత్రి నాగరాజు వీరందరిని తన ఇంటికి పిలిపించుకొని మద్యం సేవించి తల్లిని ఇంట్లో నుండి బయటకు తీసుకొని రావడానికి ట్యాంక్ స్విచ్ తానే వేశాడు. ట్యాంక్ నుండి నీరు ఓవర్ ఫ్లో బయటకు రావడంతో తల్లి వస్తున్న విషయాన్ని గమనించి ముగ్గురు పథకం ప్రకారం దాడి చేసి గాయపరిచి ఆ డబ్బులు బంగారాన్ని దాచి పెట్టారు. ఏమీ తెలియనట్లే తెల్లవారి సంఘటనలో గాయపడ్డ తల్లిదండ్రులను ఆస్పత్రిలో చికిత్స చేయించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా డాగ్ స్క్వాడ్ అక్కడున్న వస్తువులను పరిశీలించి హుజురాబాద్ పట్టణ శివారు వరకు వెళ్లడంతో ఆ ప్రాంతంలో వారికి ఒక క్లూ లభించింది. పోలీసులు దోపిడి జరిగిన ఇంట్లో వెతుకుతుండగా దొంగతనానికి పాల్పడ్డ సమీర్ బ్రాస్లెట్ వారింట్లో పడిపోయింది. బ్రాస్లెట్ ఆధారంగా పోలీసులు విచారణ జరుపగా మెడికల్ షాప్‌లో గ్లౌజెస్ కొంటున్న వ్యక్తుల సీసీ ఫుటేజ్ లభించడంతో నిర్ధారణ చేసుకున్న అనంతరం విచారించగా తాము ఈ పని చేశామని కొడుకు, కోడలు ఒప్పుకున్నారు. కాగా ఈ సంఘటనలో పాల్గొన్న మున్నా ఆచూకీ లభించలేదు. సంచలనం సృష్టించిన దోపిడీ కేసును 24 గంటల్లో చేదించిన హుజురాబాద్ సీఐ తిరుమల్ గౌడ్, ఎస్ఐ యూనిస్ అలీ, సిసిఎస్ సిబ్బంది సురేందర్, సాయి, అవినాష్, ప్రదీప్, సంతోష్‌ను ఏసీపీ అభినందించారు.

ప్రయివేటీకరణకు తీవ్ర ప్రయత్నాలు..!

- 26న దేశ వ్యాప్త సమ్మె.

- టీజీయూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వరరావు



నవతెలంగాణ - కరీంనగర్

కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయివేటీకరణకు తీవ్రమైన ప్రయత్నాలు మొదలుపెట్టిందని టీజీయూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, ఇతర రాష్ట్ర నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో లాభాల్లో నడుస్తున్న చండీగఢ్ విద్యుత్ సంస్థను కూడా పూర్తిగా ప్రయివేటీకరణకు పూనుకున్నదని, గతంలో పుదుచ్చేరిలో కూడా ఇలాంటి ప్రయత్నమే జరిగిందన్నారు. చండీగఢ్ రాష్ట్రమే కాకుండా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను కూడా ప్రయివేటీకరించడానికి పూర్తి ప్రయత్నం చేస్తున్నదని, ఈ విధానాన్ని యావత్ భారతదేశంలో ఉన్న 27లక్షల మంది ఉద్యోగులు ఇంజనీర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. విద్యుత్ అనేది సామాన్య ప్రజలకు అతి ముఖ్యమైన వసతిగా ఉండాలి తప్ప దీనిని వ్యాపార వస్తువుగా మార్చి బడా పెట్టుబడిదారులకు చౌకగా కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని అన్నారు. ఇప్పుడున్న విద్యుత్ సంస్థల నష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ విధానాలే కారణమని చాలా మంది నిపుణులు, మేధావులు ఇప్పటికే వాస్తవ పరిస్థితులను తెలియపరిచారని అన్నారు. పెడచెవిన పెట్టి బడా పెట్టుబడిదారులకు మోకరిల్లి మొత్తం వ్యవస్థను వారి చేతుల్లో పెట్టాలని కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. ఈ విద్యుత్ ప్రయివేట్‌గా సంయుక్త కిసాన్ మోర్చా దేశ స్థాయిలో ఉద్యమం కూడా నడిపిస్తున్నదని అన్నారు. దేశ వ్యాప్తంగా విద్యుత్ ప్రయివేటీకరించబడితే అధిక విద్యుత్ ధరలు మోయలేని భారాలు పేద ప్రజలు మధ్య తరగతి ప్రజలు, రైతులపై తీవ్రంగా ఉంటుందని, ఇది వరకే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నేషనల్ కో ఆర్డినేషన్ తరపున విన్నవించడం జరిగిందన్నారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు అన్నారు. నేషనల్ డిమాండ్జేషన్ ఫైఫైన్ అనే ఒక ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేసి భారతదేశ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థలను, బొగ్గు, రైల్వే, ఆయిల్ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలను అప్పనంగా ప్రయివేటు పెట్టుబడిదారులకు అప్పగించడానికి పూర్తి ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. ఈ విషయమై ఫిబ్రవరి 23న నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పూనాలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి రాబోయే జూన్ 26న విద్యుత్ ప్రయివేట్ వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఇతర సంఘాలను, అసోసియేషన్ లను కలుపుకొని సమ్మెను విజయవంతం చేయడానికి కార్మికులందరిని సన్నద్ధం చేస్తామని తెలిపారు.

'శ్రీ చైతన్య' అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ - తిమ్మాపూర్


అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ రమేష్‌రెడ్డి

మండలంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న కందుకూరి చంద్రసేనచారికి గైడ్ డాక్టర్ సతీష్ నారాయణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్విల్లింగ్ ది ఫీల్డ్ ఏ కంపారిటివ్ డాటా మైనింగ్ అనాలసిస్ ఆఫ్ మిషన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్ ఫర్ ఎన్ హాన్స్ ఇంట్రిషన్ డిటెక్షన్ ఇన్ నెట్వర్క్ ట్రాఫిక్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందినట్లు చెప్పారు. అనంతరం చంద్రసేనచారిని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్‌రాజు, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు..

- డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి

నవతెలంగాణ - కరీంనగర్

నిరుద్యోగుల పక్షాన ప్రశ్నించే గొంతుక విద్యావేత్త నరేందర్‌రెడ్డికి పట్టభద్రుల ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 11సంవత్సరాల నుంచి నిరుద్యోగులను ఉద్యోగ ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్థానిక పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయకుండా బడా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ నిరుద్యోగులను ఉద్యోగాలు కల్పించకుండా యువతకు నిరాశకు గురిచేసిన బీజేపీ అభ్యర్థిని స్థానిక పట్టభద్రుల ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.లక్పతి నాయక్, ఏ.భాస్కర్, గిరిజన సంఘం నగర కార్యదర్శి జి.రవీందర్ నాయక్, నాయకులు శివ, సింహాద్రి, రాజేష్, రమేష్, రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించండి : వై.అశోక్ కుమార్



మాట్లాడుతున్న వై.అశోక్ కుమార్

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను వై.అశోక్ కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులందరికీ సమానమైన నాణ్యమైన శాస్త్రీయమైన విద్య అందేలా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పోరాడుతానని అన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్లో 20శాతం నిధులు కేటాయించేలా ఉద్యమిస్తానన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభలలో ప్రశ్నించే గొంతుకగా ఉంటానన్నారు. బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు గుంటి ఎల్లయ్య, మర్రి అవినాష్, సిహెచ్ పోశయ్య, బండి పరశు రాములు, పూల రాజమౌళి, దేవానందం, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నసదానందంను కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండి సలీం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ సెల్ మాజీ కార్యదర్శి ఎగ్గని శ్రీనివాస్ ఉన్నారు.

భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం

కేంద్రాల నిర్వహణకు మరిన్ని సౌకర్యాలు

విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ - మానకొండూర్

భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ చిన్నారుల్లో మనోవికాసం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవితా కేంద్రాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా అన్నారు. మానకొండూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో, భవిత కేంద్రంలోని సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. భవితా కేంద్రాల నిర్వహణకు కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కొంతసమయం దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. టీచింగ్ మెటీరియల్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి యోగితా రానా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని భవిత కేంద్రాల్లో ఒకే టైం టేబుల్, సిలబస్‌ను నిర్ణయించి అమలు చేస్తామన్నారు. భవితా కేంద్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రత్యేక డైరీని నిర్వహించాలన్నారు. అవసరమైన టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ సమకూరుస్తామని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున భవిత కేంద్రాల్లో రెయిలింగ్‌తో కూడిన ర్యాంపులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన కేంద్రంలో స్పీచ్ థెరపిస్టుని నియమించుకోవాలని, అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకోవాలని తెలిపారు. భవిత కేంద్రం పరిధిలోని వీవోలు సందర్శించి సేవలను పరిశీలించాలన్నారు. అన్ని భవిత కేంద్రాలకు రంగులు వేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అవసరమైన చోట స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లను నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు ఐదు రోజులు సెలవు

నవతెలంగాణ - జమ్మికుంట


పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్: సెక్రెటరీ


జమ్మికుంట మార్కెట్ యార్డుకు వరుసగా ఐదు రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా, 27న జాగరణ, 28న అమావాస్య, మార్చి 1, 2 శని, ఆదివారాలు సాధారణ సెలవులు కాగా వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. తిరిగి మార్చి 3న మార్కెట్ పున:ప్రారంభం అవుతుందని రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

జమ్మికుంట మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 13 వాహనాలలో 77 క్వింటాళ్ల విడి పత్తిని విక్రయించడానికి తీసుకువచ్చారు. క్వింటాల్ గరిష్ఠ ధర రూ.7,100, మోడల్-7,050, కనిష్ఠ-6,800 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. కాటన్ బ్యాగ్స్‌లో ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల పత్తిని విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ఠ ధర 6,200, మోడల్-6,000, కనిష్ఠ-5,800 పలికిందని మార్కెట్ సెక్రెటరీ పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

సీపీఐ(ఎం) హుజురాబాద్ మండల కార్యదర్శి కొప్పుల శంకర్

నవతెలంగాణ - హుజురాబాద్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొప్పుల శంకర్ కోరారు. మంగళవారం హుజురాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న జరగనున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు హుజురాబాద్ మండల శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని రాష్ట్రస్థాయిలో పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టంగట్టాలి

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ - తిమ్మాపూర్


మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టంగట్టాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రయివేటు టీచర్లతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని, మరిన్ని ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను నిలపలేని బీఆర్ఎస్ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్, బీజేపీ దోస్తీ కట్టాయని ఆరోపించారు. బీజేపీ నాయకులకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందన్నారు.

అభివృద్ధిని చూసి ఓట్లేయండి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 15నెలలుగా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓట్లేసి గెలిపించాలన్నారు. బీజేపీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నదని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలు మాయమాటలకు మోసపోవద్దని, అభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు మామిడి అనిల్ కుమార్, బండారి రమేశ్‌గౌడ్, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము, పోలు రమేశ్, రాములు యాదవ్, ఆశిఖ్ పాషా, ఎస్. లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

డబ్బు ఉంటేనే రాజకీయం అనే భావన పోవాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అలంకార ప్రాయం కాదు
- ఈ గుండె 7 నెలలుగా అలసిపోయింది, మీ ఓటుతో ఉత్సాహం ఇవ్వండి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గౌడ్


మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

నవతెలంగాణ - కరీంనగర్

'డబ్బు ఉంటేనే రాజకీయం చేయవచ్చనే భావన పోవాలి.. బలహీన వర్గాల బిడ్డలు ఎందుకు రాజకీయాల్లోకి రాకూడదు' అని బీఎస్పీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ గౌడ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత ఏడాది నుంచి 42 నియోజకవర్గాల్లో తిరిగి ఉద్యోగులు, పార్ట్ టైం లెక్చరర్లు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమస్యలు దగ్గరగా తెలుసుకున్నానని చెప్పారు. రాజకీయం చేసే ఆలోచన లేకుండా వీరి సమస్యల్ని వేదికలపై ఉంచినట్లు తెలిపారు. ఇప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ చేస్తున్నానని చెప్పారు. ఈ ఎన్నికల్లో గతం కంటే లక్షా 50వేల ఓట్లు అధికంగా నమోదయ్యాయని వెల్లడించారు. తనతో తిరిగినవాళ్లు, తనను నమ్మినవాళ్లు, మంచి జరుగుతుందని భావించినవాళ్లే ఓటర్లుగా చేరారని తెలిపారు. ప్రతి పట్టభద్రుడి గుండెను టచ్ చేసానట్లు చెప్పుకొచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంటే రాజ్యాంగ పరిరక్షణకు కర్తవ్యం వహించాల్సిన పదవని, సెక్రటేరియట్ గేటు ముందు పట్టభద్రులు గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా చేస్తానని తెలిపారు. డబ్బున్నవారికే రాజకీయం చేసే హక్కు ఉందన్న భావన తొలగించాలని, రాజకీయాల్లో బలహీన వర్గాల ప్రతినిధుల అవసరం ఉందని, అందుకే తనను గెలిపించాలని కోరారు. నాకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని, ఒక అభ్యర్థి పారిశ్రామికవేత్త, మరొకరు కార్పొరేట్ విద్యా వ్యాపారి.. వీరు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా ప్రచారం చేశానని, డబ్బు లేకుండా రాజకీయాల్లో మార్పు సాధ్యమని నిరూపించడానికి తనను గెలిపించాలన్నారు. రేపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా విద్యావంతులైన సర్పంచ్‌లు రావాలంటే తన గెలుపు దాని బాటను సాఫీచేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎంతో కీలకం. మహిళా సాధికారత గురించి ఏ పార్టీ చర్చించలేదని అన్నారు. నా పేరు 'ప్రసన్న', నా భార్య పేరు కూడా నా పేరుతో ముడిపడేలా ఉందని, మహిళలకు గౌరవం ఇచ్చే తన మ్యానిఫెస్టోలో వారి భద్రత, అభివృద్ధి ప్రత్యేక ప్రస్తావన పొందిందని, వారికి వెన్నుదన్నుగా ఉంటా అని హామీ ఇచ్చారు. అలాగే 8హామీలతో తన మ్యానిఫెస్టోను బాండ్ ద్వారా రాసిచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఎదుర్కొని పోటీ చేస్తున్నా. ఒకసారి నా గెలుపుతో నిజమైన మార్పు ఎలా ఉంటుందో చూపిస్తా. ఆత్మవిశ్వాసంతో ప్రచారం ముగించుకున్నా, అవసరమైతే ప్రధాన పార్టీల అభ్యర్థులను బహిరంగ చర్చకు సవాల్ చేస్తున్నా అని స్పష్టం చేశారు. ఈ గుండె అలసిపోయింది.. కానీ మీరు గెలిపిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తానని తెలిపారు. ప్రశాంతంగా ఓటు వేయండి. సీరియల్ నెంబర్ 3 పైన మీ వాడిని గెలిపించి, మండలిలో ప్రజల గొంతుకను ప్రతిధ్వనించేలా చేయాలని అభ్యర్థించారు. ఈ సవ రావేశంలో విఠల్, ఓయూ జేఏసీ నాయకుడు మహిపాల్ యాదవ్, విద్యావేత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

సురభి కాన్వెంట్ హైస్కూళ్లో వీడ్కోలు హంగామా



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం మధురా నగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులు ఆట, పాటలతో హంగామా చేశారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల ఆట, పాటల మధ్య అట్టహాసంగా సాగింది. సురభి పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు సూచించిన ప్రణాళిక ప్రకారం విద్యాభ్యాసం చేస్తే ఒత్తిడిని అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చిప్ప వీరనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



నవతెలంగాణ- మల్యాల

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోతే శివ రామకృష్ణ అన్నారు. మంగళవారం కళాశాలలో సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోతె శివ రామకృష్ణ మాట్లాడుతూ.. మార్చి 5వ నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్న దృష్ట్యా విద్యార్థులు సమయం వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు శ్రీవాణి, అత్తినేని శ్రీనివాస్, వేనేపల్లి సంధ్య, మహమ్మద్ నవాబ్, యముల శ్రీనివాస్, గగడం రచన, బాసని నరేష్, పురాణం శ్రీధర్, దమ్మయ్య గారి శ్రీకాంత్, కేశవేని శ్రీనివాస్, నగునూరి పూర్ణిమ, ఆవారీ సంపత్, అక్తరి భాను, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పట్టభద్రుల ప్రచారం



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని ఎర్దండి, మూలరాంపూర్, బర్దిపూర్, వేములకుర్తి గ్రామాల్లో మంగళవారం మాజీ సర్పంచ్ న్యాయవాది, సంఘం సాగర్, సీనియర్ జర్నలిస్ట్ అంకతి భరత్‌కుమార్ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస సంఖ్య 3 పైన మొదటి ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని కోరారు. ఈకార్య క్రమంలో గ్రాడ్యుయేట్‌లు అరె రమేష్, మాలేపు శంకర్, గుమ్మల నరేష్, భూమల సాయేందర్, దుబ్బాక సురేష్, అజయ్, ప్రదీప్ కర్క, విక్రమ్, గంగయ్య, సాయికుమార్, అశోక్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం వర్షకొండ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోనకంటి వెంకట్, నాయకులు టి. మనోజ్‌కుమార్, దొంతుల శివకుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

జిల్లా విద్యాధికారి కె.రాము

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాలైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), ప్రాథమిక పాఠశాల,తదితర కేంద్రాలను జిల్లా విద్యాధికారి కె.రాము మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని తరగతి గదులను, సీసీ కెమెరాల అమరిక, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వంటి వసతులను పరిశీలించారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచ్ లు ఇతర సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు ములస్తం గంగాధర్, ఉపాధ్యాయులు పి.రాజశేఖర్,అయిత పద్మ పాల్గొన్నారు.

జాతర పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

జగిత్యాల డీపీవో మదన్ మోహన్



నవతెలంగాణ-సారంగాపూర్

మహాశివరాత్రి సందర్భంగా పెంబట్లలో నిర్వహించే శ్రీ దుబ్బ రాజేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జగిత్యాల అడిషనల్ డీఆర్‌డీవో, డీపీవో మదన్ మోహన్ స్థానిక పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ఆయన ఆలయ ప్రాంగణంతో పాటు కోనేరును సందర్శించారు. ఈ సందర్భంగా శానిటేషన్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏవివో దేవేందర్ రెడ్డి, సారంగాపూర్ ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఎంపీఓ సలీం, ఏపీవో శ్రీలత, టీఏలు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తడి, పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కోరుట్ల

స్వచ్ఛ సర్వేక్షన్-2024-25లో తడి, పొడి చెత్త సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారులు పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం అవగాహన నిర్వహించారు. తడి, పొడి చెత్త, సింగిల్ యుజ్ ప్లాస్టిక్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ బి.అశోక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మహేష్, వార్డు ఆఫీసర్ మధు, ఇతర వార్డు ఆఫీసర్లు, ప్రభుత్వ బాలికల పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివపార్వతుల విగ్రహాలు బహుకరణ



నవతెలంగాణ-ఎండపల్లి

మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన రెడ్డి అనూష మహేందర్‌రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం రోజున శివపార్వతుల కళ్యాణం జరపనున్నందున శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను బహుకరించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను బహుకరించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

పూడూర్ సహకార సంఘాన్ని సందర్శించిన ముంబాయి నాబార్డు అధికారులు



నవతెలంగాణ- కొడిమ్యాల

మండలంలోని పూడూరు ప్రాథమిక సహకార సంఘాన్ని నాబార్డు అధికారులు మంగళవారం సందర్శించారు. నాన్ క్రెడిట్ బిజినెస్ చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బండ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, డైరెక్టర్లు, జిల్లా అభివృద్ధి మేనేజర్ ఏం.దిలీప్ చంద్ర, సివి హరిచరణ్ నాబార్డు మేనేజర్ ముంబాయి, ఏజీఎం మహేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, అగ్రికల్చర్ ఆఫీసర్ జ్యోతి, డైరెక్టర్లు నాగభూషణ్‌రెడ్డి, కదారి మల్లేశం, కంబల్ల ఐలయ్య, బండ నరసింహారెడ్డి ,కంబాల ఐలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పోషించని వారికి కౌన్సిలింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :కన్న తల్లిదండ్రుల పోషించక నిరాధరిస్తున్న కొడుకులు, కూతుర్లకు వారి కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రంకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆ కొడుకులు, కూతుర్లను, కోడళ్లను ఆ వృద్ధ తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు పిలిపించి వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఆర్ఎంపీ వెంకటేష్ తల్లి బోయిని గంగవ్వ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. వారి వెంట నాయకులు నాడెం శంకర్, భిక్కషెట్టి ఆంజనేయులు, గంగారెడ్డి, జెట్టి తిరుపతి, మాజీ కౌన్సిలర్ కూతురు రాజేష్, అబ్దుల్లా, అభి, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పంటలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పొట్ట దశలోనే పశుగ్రాసంగా మారుతున్న పంటలు
- తల పట్టుకుంటున్న రైతులు
- అధికారుల పర్యవేక్షణ కరువు



పొలంలో ఆందోళన చేస్తున్న రైతులు

నవతెలంగాణ-ఎండపల్లి

ఎండపల్లి మండలంలో సాగునీరదంక పంట పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అండగంటిపోవడం, కాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో ఆరుగాలం పడిన కష్టం వృథా అవుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్సారెస్పీ నుంచి గొల్లపల్లి మండలంలోని రంగధామినిపల్లె డీ83(ఏ) డిస్ట్రిబ్యూటర్ సెకండ్ రించ్ ద్వారా లక్ష్మీపురం, సిల్వకోడూర్, భీమ్రాజు పల్లి, దట్నూర్, చందోలి, ఆత్మకూర్, దమ్మన్నపేట, గుల్లకోట, చర్లపల్లి, జగదేవ్‌పేట, ఎండపల్లి, అంబర్‌పేట, కొండాపూర్ గ్రామాల రైతుల పంటలకు నీరు అందాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేక గుల్లకోట వరకు మాత్రమే సాగునీరు అందుతోంది. కాల్వకు ఎగువన ఉన్న రైతులు ఇష్టానుసారంగా కాలువకు గండ్లు పెట్టుతూ మోటర్లు బిగిస్తూ సాగునీరు వాడుకుంటున్నారు. దీంతో చివరి ఆయకట్టు ఎండపల్లి, కొండాపూర్, అంబర్‌పేట గ్రామాలకు నీరందడం లేదు. చేసేదేమీ లేక రైతులు వరి పొలాలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. కొంత మంది రైతులు వ్యవసాయ బావి, కెనాల్ ద్వారా వచ్చే నీటిలో పంట కాపాడుకు నేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం కెనాల్ ద్వారా నీరుపోవడంతో పాటు, వ్యవసాయ బావులు పెరిగిన ఎండల తీవ్రకు భూగర్భ జలాలు అండగంటి పోతున్నాయి. పంట చేతికి వస్తుందని ఆశతో చివరి దశలో సాగునీరు అందక ఎండి పోతున్న పంటలను చూసి రైతులు తలలు పట్టుకుంటున్నారు. కాల్వలో పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండిపోయి నీరు ఎలా వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ కరువై రైతులకు శాపంగా మారింది.

కౌలుకు తీసుకొని పొలం సాగు చేసుకున్నా..

బావి ఉండి కూడా కెనాల్ ద్వారా నీరు వస్తే రెండు విధాలా ఏదో విధంగా పంట వస్తుందని ఆశతో సాగు చేశాను. కెనాల్ ద్వారా నీరు రాక, వ్యవసాయ బావుల్లో నీటిమట్టం అండగంటి పోవడంతో చేసేదేమీ లేక పశువులను మేపుతున్నాం.

-సబ రాజేశం, రైతు

చివరి ఆయకట్టుకు నీరందేందుకు చర్యలు

డీ 83(ఏ) డిస్ట్రిబ్యూటర్ కింద ఆయకట్టు రైతులకు నేటి నుంచి సాగునీరు విడుదల చేస్తాం. చివరి వరకు రైతులకు అందే విధంగా చేస్తాం. ఇంతకు ముందు రైతులు కాలువకు గండి పెట్టారు. దాన్ని పూడ్చి వేసినాము, మోటర్లు ఉంటే వాటిని కూడా తీసేసి చివరి వరకు రైతులకు సాగునీరు అందిస్తాం.

-డీఈ రమేష్, ఎస్సారెస్పీ







జాతర ముగిసే వరకు అలర్ట్‌గా ఉండాలి

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్
- స్థానిక పోలీస్ అధికారులతో కలిసి దుబ్బ రాజన్న జాతర ఏర్పాట్లు పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

నవతెలంగాణ-సారంగాపూర్/ మల్లాపూర్

మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి (జాతర)బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు జాతరలో ఎక్కడికక్కడ అలర్ట్‌గా ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆయన ఆలయానికి చేరుకొని ఆలయ ప్రాంగణంతో పాటు జాతరా స్థలిని క్షుణ్ణంగా పరిశీలించి ఇందుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా జగిత్యాల జిల్లాలోనే అతి పెద్ద శైవక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వరస్వామి దర్శనానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆలయం ముందే పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ పోలీస్ సేవల్ని సైతం వినియోగిస్తున్నామన్నారు. ఆయన వెంట జగిత్యాల రూరల్ సీఐ రవీందర్, సారంగాపూర్ ఎస్సై దత్తాత్రి,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మల్లాపూర్: మహాశివరాత్రి పురస్కరించుకొని కొనసాగే జాతరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కనక సోమేశ్వరస్వామి కొండకింద మహాశివరాత్రి వేడుకలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివ రాత్రి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ సెంటర్లను పరిశీలించారు. వారి వెంట మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై రాజు నాయక్, వీడీసీ చైర్మన్ సంఘ గంగా రాజం యాదవ్, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుకారాం, సభ్యులు సుంకట జీవన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సుదోదన్ 2కే25



నవతెలంగాణ-జగిత్యాల

పట్టణంలోని ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సుదోదన్-2కే25 పేరుతో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వ హించారు. రామకృష్ణ, ఎన్ఎస్‌వీ విద్యార్థి సంస్థల చైర్మన్ యాద రామకృష్ణ, ఎన్ఎస్వీ విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేష్, ఎన్ఎస్వి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ పల్లెర్ల నరేష్ హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు పల్లెటూరు వాతావరణం కళ్ళకు అద్దినట్టుగా చూపిస్తూ చేసిన జానపద గేయాలు, సాంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడేలా, ముందస్తు శివరాత్రి ఉత్సవాలలో భాగంగా శివుని వేషాధారణ, హనుమాన్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ యాదరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కూడా డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే డిగ్రీ తర్వాత చేరబోయే కోర్సుల గురించి ఒక ప్రణాళిక ఏర్పరచుకొని పట్టుదలతో చదవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న ఎన్ఎస్ఈ డిగ్రీ కళాశాలలో మీరు చదువుతున్నందుకు అందరూ గర్వపడాలని రాబోయే రోజుల్లో మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్వి కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ గోపు మునీందర్‌రెడ్డి, ఎన్ఎస్వి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ముందస్తు సైన్స్ డే వేడుకలు

నవతెలంగాణ-మేడిపల్లి

ఉమ్మడి మేడిపల్లి మండలంలోని తెలంగాణ మోడల్ (ఆదర్శ)పాఠశాలలో ప్రిన్సిపల్ నాగ సుధారాణి ఆధ్వర్యంలో ముందస్తు సైన్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటారని ఆవశ్యకతను వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వి.సందీప్‌కుమార్, బి.రవీందర్, కవిత, వై.సరిత, డి.కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్పత్తులు, ఆవిష్కరణలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-రాయికల్ : మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపుగూడెంలో ఈనెల 27న మహాత్మాగాంధీ ఇన్స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్ (మహారాష్ట్ర) ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశ్రమలు నెలకొల్పడం, సేంద్రియ ఎరువుల వాడకం,గ్రామీణ హస్తకళలు,స్వయం ఉపాధి వంటి పలు అంశాల్లో శిక్షణ అందించేందుకు ఉచిత అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ అవగాహన సదస్సు యువతకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామాల్లో స్వయం ఉపాధి రంగాలను నెలకొల్పేందుకు ఎం.జి.ఐ.ఆర్.ఐ సైన్స్ అండ్ టెక్నాలజీలో మద్దతునివ్వడం ద్వారా గ్రామీణ పారిశ్రామికీకరణ ప్రక్రియను వేగవంతం చేయడం వంటి అంశాల్లో శిక్షణ అందిస్తుందని అన్నారు.ఈ సదస్సుకు హాజరయ్యేవారు వివరాలకు 9849750854 సెల్ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి కొత్తపేటలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు


నేడు శివపార్వతుల కళ్యాణం



నవతెలంగాణ-రాయికల్

మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కొత్తపేట గ్రామంలోని రాజరాజేశ్వర నాగాలయంలో నేటి నుంచి ఈ నెల 28 వరకు ఘనంగా ఉత్సవాలు జరుగుతాయని కార్య నిర్వహణాధికారి ఎం.విక్రం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ దానవేని రాము మాట్లాతూ.. నేడు శివపార్వతుల కళ్యాణం, గురువారం రుద్రాభిషేకం, శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు చుట్టూ పక్కల మండలాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. చైర్మెన్‌తో పాటు ఈ ఉత్సవాల్లో కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి, రాజారెడ్డి, వెంకటి, భుమాగౌడ్, నాగిరెడ్డి, ముత్యం, మాజీ సర్పంచ్ రాజేశంగౌడ్, మాజీ ఉప సర్పంచ్ రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, చింతపల్లి గంగారెడ్డి సేవలందించనున్నారు.

ఘనంగా కనక సోమేశ్వర స్వామి ఇరుముడి శోభయాత్ర




నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన కనక సోమేశ్వర స్వామి మహాశివరాత్రి జాతర ఉత్సవాలలో భాగంగా కనక సోమేశ్వర స్వామి దీక్షపరులు ఇరుముడితో శోభయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం పూట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఇరుముడితోని కట్టుకొని గ్రామంలో పురవీధుల గుండా శోబయాత్ర నిర్వహించారు. అనంతరం కనుక సోమేశ్వర గిరి ప్రదక్షణ చేపట్టారు. దీక్షపరులకు కుటుంబ సభ్యులకు కనక సోమేశ్వర కొండ కింద మహా అన్నదాన కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి బాల్లేపల్లి ప్రభాకర్ శర్మ, వీడీసీ చైర్మన్ సంఘ గంగా రాజం యాదవ్, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుకారాం, సభ్యులు సుంకట జీవన్ తదితరులున్నారు.

కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళ వారం సాయంత్రం శివపార్వతుల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. రంగురంగుల పువ్వులతో విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించిన పెళ్లి పందిట్లో అందంగా అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను హర హర హర నామ స్మరణల నడుమ మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తోడుకొని వచ్చి ఆశీనులను చేశారు. స్వామి వారి కళ్యాణానికి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించగా ఆలయ అధికారులు కలెక్టర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్

- ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలు
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి.సత్యప్రసాద్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఈనెల 27న జరిగే మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 సాయంత్రం 4గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ కళాశాలలో ముగిసిన క్రీడలు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి క్రీడా, సాంస్కృతిక, సాహిత్య వేడుకలు 2024-25 అంగరంగ వైభవంగా జరిగాయి. మూడు రోజుల పాటు సాగిన ఈ వేడుకలు పొలాసలోని వ్యవసాయ కళాశాలలో ముగిశాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని ఐదు జోన్ల నుంచి ఉత్తర తెలంగాణ, మధ్య తెలంగాణ, దక్షిణ తెలంగాణ, రాజేంద్రనగర్, పరిపాలన జోన్ల నుంచి మొత్తం 175 మంది సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, జావలిన్ త్రో, షాట్ పుట్, పరుగు పందెం (100 మీటర్లు, 200 మీటర్లు), బ్రిస్క్ వాక్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్, టెన్నికోట్, మ్యూజికల్ చైర్ వంటి క్రీడల్లో సిబ్బంది తమ సత్తా చాటారు.

రాజన్నను దర్శించిన మాజీ మంత్రి కొప్పుల



దుబ్బ రాజన్న ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామిని మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జిల్లా నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టేట్ మార్క్ ఫెడ్ మాజీ చైర్మెన్ లోక బాపురెడ్డి, బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంతతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక స్వాగతం పలికారు. పూజాధి కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలను అందించారు. ఆయన వెంట జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తేలు రాజు, గంగారెడ్డి. శ్రీనివాస్, మొదిగం రాజు ఉన్నారు.

రాయికల్ పెద్ద చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలి

రైతు సంఘాల నాయకుల వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నవతెలంగాణ-రాయికల్

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి కష్టాలు రాకుండా పట్టణంలోని పెద్ద చెరువుని డీ-52 కెనాల్ నీటితో నింపాలని మంగళ వారం రైతు సంఘాల నాయకులు డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం చెరువులో నీటి స్థాయి అధికంగా ఉందని, ప్రస్తుతం చెరువులోని నీరు భూగర్భ స్థాయికి చేరేలా ఉండడంవల్ల వచ్చే వేసవిలో తాగు,సాగునీటి కష్టాలు రాకుండా అధికారులు ముందస్తు అప్రమత్తమై ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా చెరువులో నీరు నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, సుతారి తిరుపతి,ముత్యం రాజు, మహేష్ గౌడ్,బేతి సత్యనా రాయణరెడ్డి, గంగారెడ్డి, రాము, పడాల గోపి,నరేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



నవతెలంగాణ- మల్యాల

మండలంలోని మద్దుట్ల గ్రామంలోని పశువుల పాక, హజోల్ల సంబంధించి పురోగతిలో ఉన్న పనులను డీఆర్డీవో రఘువరన్ మంగళవారం పరిశీలించారు. పోతారం గ్రామంలో ఉపాధి హామీ పనులు, మండల కేంద్రంలోని రైతు వేదికలో వారం నుంచి జరుగుతున్న ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకంలో 2021 నుంచి 2024 వరకు 100 రోజులు పని చేసి 45 సంవత్సరాలలోపు వారికి (పుట్టగొడుగుల పెంపకం)కు సంబంధించి శిక్షణ ఇవ్వగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ మదన్మోహన్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, టెక్నికల్ అసిస్టెంట్ జలపతిరెడ్డి లావణ్య పాల్గొన్నారు.

కామ్రేడ్ గంగారంకు నివాళి

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంలో కమ్యూనిస్టు పార్టీ నేత, కార్మిక సంఘ నాయకుడు స్వర్గీయ కామ్రేడ్ కడకుంట్ల గంగారాం వర్ధంతి సందర్భంగా వామపక్ష నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు చెన్న విశ్వనాథం, మాజీ కౌన్సిలర్ మౌలానా, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రాధా, సాంబార్ మహేష్, రాస భూమయ్య పాల్గొన్నారు.

బీసీ డివిజన్ కార్యదర్శిగా బాజన్న

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణ కేంద్రానికి చెందిన తుపాకుల బాజాన్న కోరుట్ల నియోజకవర్గ బీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్టు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లా వెంకటేశ్వర్లు నియామక పత్రం మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాళ్ళ సత్యనారాయణగౌడ్, పాతర్ల సత్యం ముదిరాజ్, సంఘం అధ్యక్షుడు అలవాల శంకర్, ఉపాధ్యక్షులు పొగుల రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పర్యవేక్షణ

నవతెలంగాణ-కోరుట్ల

మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ మంగళవారం పర్యవేక్షించారు. కూలీల మస్టర్ రోల్, పని ప్రదేశాలను పరిశీలించారు. ప్రతి రోజు 50 మంది కూలీలు రావాలని ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు.వారి వెంట కార్యదర్శి శ్రీనివాస, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్ ఉన్నారు.

కొండగట్టులో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ దంపతుల పూజలు



నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలోని కొండగట్టు అంజనే యస్వామి ఆలయంలో మంగళవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా కొండ గట్టులో ప్రత్యేక పూజలు అనంతరం అంజన్నను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి దీవెన, కుమారుడు సుంకే దీక్షిత్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రాజన్న సిరిసిల్ల
బుధవారం | ఫిబ్రవరి 26, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని చిత్తుగా ఓడించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వం కేవలం మత విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, నరేందర్ రెడ్డి గెలుపు కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, సోమ నాగరాజు, నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయాలి
- ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- ప్రతి 2 గంటలకు పోలింగ్ రిపోర్టు వివరాలను పంపాలి
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : శాసనమండలి ఎన్నికల పోలింగ్ మన పెద్దపల్లి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ చందుర్తి, కొనరావుపేట మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ రాజేశ్వర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ పోలింగ్ సజావుగా జరిపేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండాలని, సీసీ కెమెరాలు లేదా వెబ్ కాస్టింగ్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగుతుంద న్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాలను చెక్ చేసుకోవాలని, 100 మీటర్ల రేడియస్‌లో ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎటువంటి ప్రచారం జరగడానికి వీలు లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద డమ్మీ బ్యాలెట్ అతికించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లైన్‌లో వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగులు వృద్ధులు గర్భిణులు ప్రాధాన్యతతో ఓట్లు వేసే విధంగా చూడాలని, 100 మీటర్ల పరిధిలో ఓటర్ సహాయ కేంద్రానికి హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌బుక్, పాన్ కార్డు ఆధార్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్, యూడి ఐడి, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు గుర్తింపు కోసం ఓటర్లు తమ వెంట తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ నాడు ఉదయం ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్లకు చూపిం చాలని, గ్రీన్ పేపర్‌లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీజ్ చేయాలని, బ్యాలెట్ బాక్స్‌పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండే విధంగా పేపర్ అతికించాలని, ఓటర్ సీక్రసి కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు ఒకసారి అంటే 10గంటలకు, 12గంటలకు, 2గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత 4గంటలకు పోలింగ్ వివరాల ను ప్రకటించాలన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. చివరి ఓటర్ ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనలు ప్రకారం బ్యాలెట్ బాక్సులను మూసివేసి సీల్ చేయాలని, ప్రతి ఒక్క సిబ్బంది తన మాన్యువల్‌ను ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవా లని, విధులను పక్కగా నిర్వహిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. అనంతరం కొనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వేములవాడ ఆర్డిఓ రాజేశ్వర్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

కృష్ణవేణి స్కూల్లో ఘనంగా వీడ్కోలు సమావేశం



కృష్ణవేణిలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ - రుద్రంగి : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్ మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయం దగ్గర పడుతున్నందున కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, వడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థునులు

నవతెలంగాణ - చందుర్తి : విద్యార్థులు శ్రద్ధతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దేవరాజ్ అన్నారు. మంగళవారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య, పలు సౌకర్యాలు ఉన్నాయన్నారు. విద్యార్థుల చేతిలో దేశ భవిష్యత్తు ఉందని, మంచిగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాచర్ల జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రాచర్ల జూనియర్ కళశాల లో మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నాయని బాగ చదువుకోని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. మంచి ఫలితాలు సాధించాలని ఉదాహరణలతో మెలుకువలు విద్యార్థులకు సూచించారు. గత విద్యాసంవత్సరంలో స్టేట్ ర్యాంక్స్, డిస్టిక్ ర్యాంక్స్ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజ, చైర్మన్ అయిత వెంకటేశ్వర్లు, కళాశాల డైరెక్టర్స్ ఏలూరి రాజయ్య, జయశ్రీ, మార్కెటింగ్ హెడ్ టి. శ్యాంసుందర్‌రావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం చేయడం ప్రశంసనీయం



అన్నదానం చేస్తున్న ప్రభుత్వ విప్ ట్రస్ట్ సభ్యులు

నవతెలంగాణ - వేములవాడ : మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం చేయడం ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ వాసవి సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు మూడు రోజులపాటు అన్నదానం చేయడం గొప్ప విషయమని అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వాసవి సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులతో పాటు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ - కొనరావుపేట: విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిలా కొనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామలిలింలోని ప్రభుత్వ పాఠశాలలో సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బ్రహ్మం రెండు నెలల కిందటే పాఠశాలలో చేరాడు. అయితే, కొద్ది రోజులకే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. విద్యార్థినులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. దీంతో తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, పాఠశాల చైర్మన్‌తో చర్చించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బ్రహ్మాన్ని హెచ్చరించారు. ఈ క్రమంలో కొనరావుపేట పోలీసులులిలి 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. మహిళా పోలీసులు విద్యార్థినులకు 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించారు. దీనితో, బాధిత విద్యార్థినులు ఉపాధ్యాయుడు తమపై చేసిన అసభ్య ప్రవర్తనను వెల్లడించారు. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ - వేములవాడ : దక్షిణకాశీ క్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆలయాన్ని దర్శించుకుని, మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. క్యూ లైన్లు, కోడె మొక్కు లైన్, ధర్మగుండం, ప్రధాన ద్వారం, ప్రసాదం తయారీ కేంద్రం, అంబేద్కర్ కూడలిని పరిశీలించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్, ఈఈ రాజేష్, సీఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.

వేములవాడలో ఉచిత అల్పాహారం, బస్సు సేవలు ప్రారంభం





అల్పాహారాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఈవో - ఉచిత బస్సులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజే శ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యా యని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఉచిత అల్పాహారం, ఉచిత బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, భక్తులు ఉచిత అల్పాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సూచనల మేరకు అధికారులు సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. తిప్పాపూర్ నుంచి భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, అందరూ వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వస్తున్నారని, ప్రభుత్వం, ఆలయ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని తెలిపారు. సాయంత్రం 7గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్, తర్వాత టీటీడీ నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

శాసనమండలిలో బహుజనుల గళం వినిపించాలి



మాట్లాడుతున్న బుర్ర నారాయణ గౌడ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై శాసనమండలిలో బహుజనుల గళం వినిపించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్ తెలిపారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, నిజాంబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ బిడ్డగా ముందుకు వచ్చారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు సబ్బండ వర్గాల పట్టభద్రులు మద్దతు తెలిపి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎలగందుల వెంకన్న, కందుకూరి రామగౌడ్ జిల్లా అధికార ప్రతినిధి బండారి శ్రీనివాస్, బాలసాని అంజయ్య, వికృతి పరశురాములు గౌడ్, పరకాల చిన్న అంజయ్య, వికృతి ముత్తయ్య, ఓల్లాల జగన్, తీగల మల్లేశం పాల్గొన్నారు.

సాగునీరు వదలకుండా కాంగ్రెస్ మోసం చేసింది

మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : సాగునీరు విడుదలకు కాంగ్రెస్ నాయకులు పూజలు చేసి నీటిని వదలకుండా రైతులను మోసం చేశారని, నాయకుల హామీతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పిటిసి కార్యాలయంలో మంగళవారం మాజీ జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ కెనాల్‌లో పూజలు చేసి హంగు ఆర్భాటాలతో రైతులకు మేలు చేస్తామని, మల్కాపేట రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసి విడుదల చేస్తామని ఊరించి మోసం చేశారన్నారు. మండలంలోని పలు గ్రామాలలో భూగర్భ జలాలు ఎండిపోవడంతో బోర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొని ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటిఆర్ సహకారంతో ఎండాకాలంలో ఎగువ మానేరును నీటితో నింపి మానేరు నదిలో అనేక చెక్ డ్యాంలను నింపి భూగర్భ జలాలను పరీరక్షించడం జరిగిందన్నారు. అందె శుభాష్ మాట్లాడుతూ మల్కాపేట రిజర్వాయర్ పూర్తి చేసి ట్రయలర్‌న్ చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు చెందుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా కాలువను పరిశీలించిన తర్వాత కూడా నీటిని విడుదల చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ వైఖరి తెలిసిందన్నారు. రైతుల పట్ల మొదటి నుండి ద్వంద వైఖరి అవలంబిస్తున్నారని రైతు భరోసాను కూడా రైతులకు ఒక బిక్షం రూపంలో ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ జబ్బార్, నాయకులు పందిర్ల పర్శరాములు, తిరుపతినాయక్, మందాటి రాములు పాల్గొన్నారు.

వేములవాడ మహాశివరాత్రి జాతర ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న ఎస్పీ

నవతలెంగాణ -వేములవాడ : వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి మహాశివరాత్రి జాతరకు దేశం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం జాతరకు వచ్చే భారీ సంఖ్యలో వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్స్, వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని ఆయా ప్రాంతాల్లో విధుల్లో ఉన్న పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. అనంతరం దేవాలయ పరిసర ప్రాంతాలు, దర్శన ప్రదేశాలు, ధర్మగుండం, శివార్చన జరిగే ప్రదేశం, క్యూ లైన్లు, గర్భగుడి పరిసర ప్రాంతాలను పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్సై రాజు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ఎన్నికల విధుల్లో 200పోలీస్ సిబ్బంది
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

నవతెలంగాణ - సిరిసిల్ల : ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్వేచ్ఛాయుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల, తంగళ్ళపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన భద్రత చర్యల మీద అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 27న జరుగు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా 200మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 41పోలింగ్ కేంద్రాలలో 23,347మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా పోలింగ్ ప్రక్రియ మొదలు నుండి పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని పోలీస్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144సెక్షన్ అమలులో ఉంటుందని, 100మీటర్ల, 200మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని, ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి



పట్టబద్రుల సమావేశంలో మాట్లాడుతున్న కేకే

నవతెలంగాణ - ముస్తాబాద్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అయిన నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి కోరారు. ఆయన ముస్తాబాద్ లోని మహర్షి, నవ జ్యోతి పాఠశాలలో గల పట్టభద్రుల సమావేశంలో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిందన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు 52వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చి తప్పేవాడు కాదని రానున్న రోజుల్లో కూడా నిరుద్యోగులందరికీ కూడా ఉద్యోగాలు వచ్చే ప్రణాళికను రూపొందించారన్నారు. పట్టభద్రులు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు కాంగ్రెస్ అభ్యర్థి అయిన నరేందర్ రెడ్డికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజు యువజన అధ్యక్షుడు రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజన్ రావు, భాను, బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు

కేకే మహేందర్ రెడ్డి విమర్శలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

నవతెలంగాణ - సిరిసిల్ల : తెలంగాణ ఉద్యమ సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తన ఇంట్లోని నలుగురికి ఉద్యోగాలు ఇచ్చారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. దేశంలో 11సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ.22కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కనీసం రెండు కోట్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లో 56వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. కేటీఆర్ యువకులకు డ్రగ్స్, గంజాయి అలవాటు చేశారని, ఇతర దేశాల నుండి సిరిసిల్ల వరకు ఉన్న లింకును త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీఎన్జీవోఎస్ 80వ వార్షికోత్సవం

విజయోత్సవాలకు జగదీశ్వర్ పిలుపు



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్

నవతెలంగాణ - సిరిసిల్ల : టీఎన్జీవోఎస్ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర టీఎన్జీవోఎస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ప్రతినెలా 1నుంచి 5వ తేదీలోపు జీతాలు ఇస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, 317బాధితులు, కారుణ్య నియామకాలు, పీఆర్సీ, పెండింగ్ డీఏలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆవిష్కరించారు. ఈ నెల 24నుంచి 28వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబం, దేశ అభివృద్ధికి మహిళా సాధికారత ఎంతో అవసరమని, ప్రతీ ఒక్కరూ పొదుపు చేయడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



సిరిసిల్లలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ డివిజన్లకు సంబంధించి సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పరిశీలించారు. ఈ నెల 27న పోలింగ్ నేపథ్యంలో బుధవారం సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేస్తామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. త్రాగునీరు, భోజన వసతి కల్పించాలని, వాహనాల్లో పోలింగ్ స్టేషన్లకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓలు రాధాభాయి, రాజేశ్వర్, తహశీల్దార్లు ఉమారాణి, మహేష్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

గర్జనపల్లిలో ఘనంగా ఎల్లమ్మతల్లి బోనాలు



ఊరేగింపు చేస్తున్న మహిళలు

నవతెలంగాణ - వీర్నపల్లి : మండలం గర్జనపల్లి గ్రామంలో అంబేద్కర్, సుభాష్ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులు పంటలతో మంచి దిగుబడి సాధించాలని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్



పరీక్ష చేసుకుంటున్న ఏఎంసీ చైర్మెన్

నవతెలంగాణ - వీర్నపల్లి : మండల ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మెన్ రాములు నాయక్ అన్నారు. వీర్నపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాములు నాయక్ పరీక్షలు చేయించుకుని, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫ్రూట్స్‌కు ఫుల్ డిమాండ్

శివరాత్రి నేపథ్యంలో పెరిగిన ధరలు



నవతెలంగాణ - చందుర్తి : వేములవాడ మహాశివ రాత్రి సందర్భంగా పండ్లకు డిమాండ్ పెరగడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. భక్తులు జాగరణ చేయడం, ఎక్కువ మంది ఒక్క పూట పండ్లు తినడంతో ధరలు పెరిగాయని వ్యాపారు లు తెలిపారు. నిజామాబాద్, కోరుట్ల నుంచి వేములవాడకు కాలినడకన వస్తున్న భక్తులు చందుర్తిలో ఆగి పండ్లు కొనుగోలు చేస్తున్నారు. అంగూర్ కిలో రూ.150 నుంచి రూ.200కు, అరటిపండ్లు డజను రూ.70 నుంచి రూ.150కు, సంత్ర రూ.120 నుంచి రూ.200కు పెరిగాయి. దీంతో పండ్ల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ - సిరిసిల్ల : ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి తక్షణ సహాయం కింద రనూ.లక్ష అందించామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో అప్పుల బాధతో దేవయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకోగా, అతని కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.లక్ష అందించామని, రైతు సతీమణి పద్మకు చెక్కు పంపిణీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

నవతెలంగాణ - వీర్నపల్లి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును మార్చి 10 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని, అన్ని తరగతులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపల్ తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలోని చైతన్య హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక మార్కండేయకాలనీలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆట పాటతో ఆనందంగా గడిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయునికి, విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రవణ్, విజయ, ఉపాధ్యాయులు మల్లేష్, సత్యం, రాంరెడ్డి, మల్లేష్, ప్రకాష్, విద్యార్థులు మల్లేష్, శ్రీధర్, సతీష్, నరేష్,



శ్రీకాంత్, అరుణ్, రాము, శ్రవణ్, కుమార్, తిరుపతి, జాకీర్, క్రాంతి, రమేష్, సుకుమార్, సాగర్, ప్రసాద్, విక్రమ్, కల్పన, రజిత, రామ, ఫర్వీన్, ప్రియాంక, మౌనిక, గౌతమి, జ్యోతి, శిరీష తదితరులున్నారు.

నరేందర్‌రెడ్డికి సీపీఐ(ఎం) మద్దతు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య



నవతెలంగాణ-పెద్దపెల్లి టౌన్
పట్టభదుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఐ(ఎం) ఇస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య అన్నారు. మంగళవారం పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27వ తేదీన జరగనున్న కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. దాదాపుగా నాలుగు దశాబ్దాలుగా విద్య, ఉపాధి రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు చేస్తూ నిరుద్యోగ పట్టబద్రుల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడతారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్ రెడ్డికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టుభద్రులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, నాయకులు సీపెల్లి దిలీప్,కుమ్మరి నవీన్, పాల్గొన్నారు

కరెంటు స్తంభాల ఏర్పాటు

నవతెలంగాణ-రామగిరి

మండలంలోని బేగంపేట గ్రామంలోని బాపురావు పల్లె ఎస్సీ కాలనీలో మంగళవారం కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసినట్లు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కల్వలశంకర్ తెలిపారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి గ్రామంలో విరిగిపోయే దశలో ఉన్న స్తంభాలు ఎక్స్టెన్షన్ స్తంభాల సమస్యని ఎన్పీడీసీఎల్ ఛైర్పర్సన్ దృష్టికి తీసుకువెళ్లడంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు బేగంపేట గ్రామానికి నలభై విద్యుత్ స్తంభాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కల్వల శంకర్, దాసరి శివ, ముత్తె చంద్రమౌళి, ఇల్లందుల సంజీవ్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరణ..



నవతెలంగాణ-రామగిరి
సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో ఓసీపీ-2 రిలే ఏలో పనిచేస్తున్న సామల రామచందర్ మనువడు కనుకుంట్ల ఆశ్రిత్‌కు (7) బ్లడ్ క్యాన్సర్ ఉండడం వల్ల ప్రస్తుతం హైదరాబాదు లోని రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అత్యవసర చికిత్స కోసం 15 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. విషయం తెలిసిన వెంటనే సామల రామచందర్‌తో పనిచేసే మిత్రులు, అధికారులు, ఇతర విభాగాల కార్మికుల సహకారంతో ఒక లక్ష రూపాయలు విరాళాలు సేకరించి మంగళవారం ఆ కుటుంబానికి అందజేశారు. ఎవరైనా సహాయం చేయాలనుకుంటే 812145 9376కి ఫోన్ పే చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపటి శశి కుమార్, ఎంఆర్‌సీ రెడ్డి, రామిండ్ల మనోహర్, మర్రి సంతోష్, రాజశేఖర్, జనార్దన్, రామస్వామి, సదానందం, రవిశంకర్,రాయమల్లు, అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బీజేపీ చేసిందేమిటి...

ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నవ తెలంగాణ-జూలపల్లి /ధర్మారం


కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి నిరుద్యోగులకు చేసిందేమిటని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడిని పేరు చెప్పి ఓట్లు అడిగే పార్టీ మాది కాదని, చేసిన పనిని చెప్పుకొని ఓట్లు అడిగే పార్టీ మాదన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే 56 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు, ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేసి యువతకు అండగా ఉండటం జరుగుతుందన్నారు. పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వభారతిలో ఫేర్‌వేల్ డే వేడుకలు

ఆలరించిన విద్యార్థుల డ్యాన్స్ ప్రదర్శన

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎన్టీపీసీ విశ్వభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నవోదయ హై స్కూల్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, విశ్వభారతి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ మంగళవారం ఘనంగా ఫేర్‌వేల్ డే వేడుకలను నిర్వహించారు. విశ్వభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్ అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బంధారపు యాదగిరి గౌడ్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్ హెడ్మాస్టర్ నోయల్ జోసఫ్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల డ్యాన్స్‌లు ఆలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఇన్‌ఛార్జిలు జగన్, మధూకర్, ఆశాలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-గోదావరిఖని:

వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ (విఎస్ఎస్-ఎస్) ఆధ్వర్యంలో విశ్వసనామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాలలో పలు రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, పండితులకు, కవులకు, కళాకారులకు, సంగీత, సాహిత్య, నత్య, చిత్రలేఖన, శిల్ప, జానపద, మిమిక్రి, ఇంద్రజాల, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, కోలాటం వారికి జాతీయ స్థాయి మానవత వెలుగు అవార్డ్స్ - 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించడం జరుగుతుందని సంస్థ ఫౌండర్, చైర్మన్, లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాలకు మార్చి 25లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8977748838 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి సీపీఐ(ఎం) మద్దతు

సీపీఐ(ఎం) ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి

నవతెలంగాణ-గోదావరిఖని:
పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఊటుకూరి నరేందర్ రెడ్డికి సీపీఐ(ఎం) మద్దతు తెలుపుతుందని సీపీఐ(ఎం) ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి తెలిపారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతోన్మాద బిజెపి అభ్యర్థిని ఓడించ గలిగే సామర్థ్యం వారికే ఉందన్న అంచనాతో సీపీఐ(ఎం) కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న నిరంకుశ కార్పొరేట్, మతోన్మాద విధానాలతో దేశానికి, రాజ్యాంగానికి, లౌకిక తత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకి, రాజ్యాంగ సంస్థల స్వయం ప్రతిపత్తికి ప్రమాదంగా



.మాట్లాడుతున్న సీపీఐ(ఎం) ఎం.రామాచారి

మారుతుందని, గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 8 ఎంపీ, 8 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్నప్పటికీ కేంద్రం నుండి ఎలాంటి ప్రయోజనం చేకూరకపోగా, కనీసం తెలంగాణ ఊసే లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని, నల్లధనాన్ని తీసుకొచ్చి పేద ప్రజలకు 15 లక్షల రూపాయలు వేస్తానని మోసం చేసిందని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరిస్తున్నదని, మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి రైతాంగానికి ఉరితాడుగా మారిన దాన్ని పోరాటాలతో వెనక్కి తీసుకున్నప్పటికీ తిరిగి దొడ్డి దారిన మరో రూపంలో వారిపై రుద్దడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశంలో కుల, మతాల పేరుతో చిచ్చులు రేపుతూ ప్రజల మధ్యన విద్వేశాలను సష్టిస్తూ తాను ప్రయోజనం పొందుతుందని, ప్రగతిశీలమైన తెలంగాణ గడ్డపైన వీర తెలంగాణ విప్లవ పోరాటం నడిపిన విప్లవాల గడ్డ పైన మతోన్మాదానికి తావు లేకుండా చేయడానికి, బిజెపి మరింత బలపడకుండా చేయడానికి బిజెపి అభ్యర్థిని ఓడించాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి పట్టభద్రులు అందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్.బిక్షపతి, గీట్ల లక్మారెడ్డి, కాదాసి మల్లేష్, టి.రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి

నవతెలంగాణ-గోదావరిఖని:
అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ పంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కోరుకంటి చందర్ బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని, కాంగ్రెస్ మోసపూరిత హామీలను గ్రామ గ్రామాన ప్రతి ఇంటికి వివరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న శ్రేణుల నిబద్ధత ఎంతో గొప్పదన్నారు. రాబోయే రోజులు మనవేనని, గులాబీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకు



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

సాగాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది గులాబీ జెండా అని, రాష్ట్ర శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసింది తొలి సిఎం కెసిఆర్ అని, బిఆర్ఎస్ శ్రేణులు గులాబీ పార్టీ పటిష్టత, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పల్లెలో గులాబీ శ్రేణులు కలియతిరగాలని, బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, మాజీ జడ్పిటిసి ఆముల నారాయణ, మాజీ కార్పొరేటర్లు పెంట రాజేష్, పాముకుంట్ల భాస్కర్, కుమ్మరి శ్రీనివాస్, గాదం విజయ, కల్వచర్ల కష్ణ వేణి, బాదె అంజలి, ముదాం శ్రీనివాస్, గోపు అయిలయ్య, నడిపెల్లి మురళీధర్ రావు, అచ్చ వేణు, నూతి తిరుపతి, రాకం వేణు, జెవి.రాజు, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కాల్వ శ్రీనివాస్, చెలకలపల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, కన్నూరి సతీష్ కుమార్, కొలిపాక మధుకర్ రెడ్డి, బందారి ప్రవీణ్, ఆర్నపల్లి శ్రీనివాస్, తుంగపిండి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైన్ పనులు మార్చి 20లోపు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- నగరంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నగరంలో చేపట్టిన రోడ్డు, డ్రైయిన్ అభివృద్ధి పనులు మార్చి 20లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం నగరంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. టియూఎఫ్ఐడిసి క్రింద రామగుండం నగరంలోని లక్ష్మీ నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాల్లో 29 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను, 5 కోట్లతో సింగరేణి ఆఫీస్ నుంచి బస్ డిపో వరకు జరుగుతున్న డ్రైయిన్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, మార్చి 20 లోపు ఈ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అడ్డగుంటపల్లెలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. అర్బన్ ప్రైమరీ సెంటర్ పరిధిలోని గర్భిణీ స్త్రీలకు ప్రసవాలు ఎప్పుడు జరుగుతాయో అంచనా వేస్తూ వివరాలు నమోదు చేయాలని, ప్రసవానికి సమీపంలో గల గర్భిణీ స్త్రీలను ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రతిష్ట కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. అనంతరం రామగుండం నగర పురపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టీబీ శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఒకేసారి జనం అధికంగా గుమి కూడకుండా, ప్రణాళిక బద్ధంగా అనుమానితులందరికీ పరీక్షలు నిర్వహించాలన్నారు.

నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం


ఎలిగేడులో...

నవతెలంగాణ-ఓదెల
మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెద్దపల్లి గుండేటి ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ సీరియల్ నెంబర్ 2పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు, పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో ముందుకు పోతుందన్నారు.రానున్న రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికను సీఎం రేవంత్ సిద్ధం చేస్తున్నారన్నారు.గడిచిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనన్నారు. కాంగ్రెస్ బలపరిచిన నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతిరెడ్డి విజేందర్ రెడ్డి,కాసారపు శ్రీనివాస్, గాజుల శివశంకర్, అమ్ముల బిక్షపతి,గుండేటి మహేందర్,అట్టేపల్లి రాజు,అట్టేపల్లి మధు,అసరి అనిల్,తోట్ల ఉదయ్,ఈద పవన్,కొండల్ రెడ్డి, తుమ్మల మల్లయ్య,బండి ఐలయ్య,పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఎలిగేడు
ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా విద్యావంతుడైన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ కొనసాగిస్తున్న ప్రజా పాలన పై పట్టభద్రులను కలిసి వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో అధ్యక్షులు గోపు విజయభాస్కర్ రెడ్డి, డైరెక్టర్ తాటిపెల్లి రమేష్ బాబు, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు అమ్ముల రాయమల్లు, రమేష్ ,పాల్గొన్నారు.



గోదావరిఖనిలో...

నవతెలంగాణ-గోదావరిఖని:
పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్ రావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గోదావరిఖని కోర్టులో లాయర్లను ఆయన కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, కిషన్ రావు, లింగస్వామి, గోషిక ప్రకాష్, భాను, కాంగ్రెస్ నాయకులు వాజిద్ ఖాన్, రహీం, నరేందర్, శ్యాం తదితరులున్నారు.

ఘనంగా దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ పెద్దపెల్లి టౌన్

మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను పెద్దపల్లి పట్టణంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజకుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధికి దాసరి మనోహర్ రెడ్డి ఎంతో కృషి చేశారని పట్టణానికి అన్ని వైపులా డబుల్ రోడ్ల నిర్మాణం పట్టణంలో రోడ్డు మీద బురద లేకుండా చేయడంలో విజయం సాధించారని అద్భుతమైన భావితరాలకు ఉపయోగపడే విధంగా ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట నిర్మాణం మాతా శిశు కేంద్రం లాంటి అనేక కార్యక్రమాలను పట్టణాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, పట్టణ బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓదెల
పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను బ్యాంకాక్‌లో హరిపురం తాజా మాజీ సర్పంచ్ గుండేటి మధు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించి ఖండాంతరాలు దాటినా అభిమానం తగ్గలేదని నిరూపించుకున్నారు.ఈ సందర్భంగా మధు యాదవ్ కేక్ కట్ చేసి సీట్లు పంపిణీ చేశారు.అనంతరం మధు యాదవ్ మాట్లాడుతూ దాసరి మనోహర్‌రెడ్డి జీవితంలో మరెన్నో పదవులు పొంది,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి రామారావు,అవిరినేని ప్రవీణ్ రావు, పాల్గొన్నారు.

వడ్డేపల్లి రామచందర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్

నవతెలంగాణ-రామగిరి

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌ను మంగళవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కొప్పుల వెంకటేశ్వర్లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

వైట్ సీలింగ్ టెంట్లు అందజేత

నవతెలంగాణ-జూలపల్లి

మహా శివరాత్రి సందర్భంగా జూలపల్లిలో శివాలయానికి 50 వేల రూపాయల విలువ గల వైట్ సీలింగ్ టెంట్లు పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ శివాలయంలో వైట్ సీలింగ్ టెంటు ప్యాండల్స్ అత్యవసరమని శివాలయ కమిటీ తెలుపగా శివాలయ నిర్మాణ దాత నల్ల మనోహర్ రెడ్డికి 50,000 వేల రూపాయల విలువ చేసే వైట్ సీలింగ్ టెంట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి శివాలయం నిర్మాణ దాత బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్ల మనోహర్ రెడ్డి, జూలపల్లి సింగిల్ విండో చైర్మన్ కుంజర్ల వెంకటయ్య, నాయకులు పొట్టాల మల్లేశం, లోకలింగారెడ్డి, వజ్రారెడ్డి, పాటకుల అనిల్, గుమ్మడి రాజిరెడ్డి, మల్లెత్తుల కనుకయ్య, వంగపల్లి వెంకటరమణ, కోడూరి మహేష్, మేర శ్రీను, బండి రాజిరెడ్డి, పాల్గొన్నారు.

బీసీ నేతలకే పట్టం కట్టాలి..

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు

నవతెలంగాణ-ఎలిగేడు

బహుజన సమాజ్ పార్టీ బలపరుస్తున్న కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ నేతలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని బహుజన సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపల్లి బాబు కోరారు. మంగళవారం మండలంలోని శివపల్లి, నర్సాపూర్, లాలపల్లి, సుల్తాన్‌పూర్, ఎలిగేడు గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ఓటర్లను కలసి బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద బహుజన వర్గాల నుండి ఎదిగిన విద్యావంతులైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణగౌడ్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి యటకారి సాయన్న ముదిరాజ్‌లకు నిరుద్యోగులు, ప్రజాసమస్యలపై శాసనమండలిలో పోరాడేందుకు ఈనెల 27న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసి అవకాశం కల్పించాలని కోరారు. ఈ క్రార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు గోట్టె రాజు, నియోజకవర్గ అధ్యక్షులు బోంకూరి దుర్గయ్య,ప్రధానకార్యదర్శి సాతూరి అనిల్, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బోయిని రంజిత్ ,సీనియర్ నాయకులు కాంపెల్లి నంబయ్య, ఇరుగురాల సాగర్ పాల్గొన్నారు.

సింగరేణి ఆర్జీ 1లో అవగాహన సదస్సు

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ 1 జిఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదాయపు పన్ను ప్రణాళికలపై, ఐసిఐసిఐ బ్యాంక్ టాక్స్ ప్లానింగ్‌పై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఓటూజిఎం గోపాల్ సింగ్ హాజరయ్యారు. సింగరేణి ఉద్యోగుల ఆదాయపు పన్ను మినహాయింపు ప్లానింగ్ ఏవిధంగా చేసుకోవాలో తెలిపారు. ఉద్యోగులు ఏదైనా లోన్స్ , వ్యక్తిగత లోన్స్, హౌసింగ్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ ఇతర లోన్స్ తీసుకున్నప్పుడు దానిని ట్యాక్స్ నుండి మినహాయిపు పొందుటకు చేపట్టాల్సిన ప్రణాళికలు తెలిపారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్‌లను అనుసరించి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గించడానికి జీతం ఆదాయంపై పన్ను మినహాయింపులను, పాత పన్ను, కొత్త పన్ను విధానంలో భేదాలను వివరించారు. పాత ఆదాయ పన్ను స్లాబ్, నూతన ఆదాయ పన్ను స్లాబ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం పర్సనల్ కిరణ్ బాబు, డిజిఎం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, సీనియర్ పిఓ హనుమంత రావు, సారంగపాణి, ఐసిఐసిఐ బ్యాంక్ జోనల్ హెడ్ సతీష్ పాల్ రెడ్డి, రీజియనల్ హెడ్ రవీందర్ రావు, బ్రాంచ్ మేనేజర్ హుస్సేన్, సిఎ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వద్ద భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-గోదావరిఖని:

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి నదికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు డిమాండ్ చేశారు. గోదావరిఖనిలోని టిడిపి-టీఎస్‌టీయుసి కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నదిలో నీరు లేదని, దీంతో స్నానాలకు వచ్చే భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని, తక్షణమే ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేగా గెలిచి 47 సంవత్సరాలు పూర్తి చేసుకొని 48వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆయనకు రామగుండం తెలుగుదేశం పార్టీ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ముదిగంటి దామోదర్ రెడ్డి, పెగడపల్లి రాజనర్సు, గుండబోయిన ఓదెలు, చిటికెల రాజలింగం, బెక్కం వీరేందర్, ఏల్పుకొండ నరసయ్య తదితరులున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

నవతెలంగాణ - మానకొండూర్



మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి

విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయి. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫెస్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి హాజరై ప్రదర్శనలను తిలకించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. అత్యుత్తమ ప్రదర్శనలకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి, ఎంపీడీఓ వరలక్ష్మీ, ఎంఈవో మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టభద్రుల మద్దతే నాకు అత్యంత విలువైన ఆయుధం

- గెలిచాక కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదు
- జీతంలో 50శాతం నిరుద్యోగులకు..
- నా గెలుపు ఒక మార్పునకు సంకేతం
- 8హామీలతో బాండ్‌పై సంతకం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ
- నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ



నవతెలంగాణ - కరీంనగర్

నిరుద్యోగుల సమస్యలపై స్పష్టత, అవగాహన ఉన్న వ్యక్తిగా, పది లక్షల స్టూడెంట్స్‌తో అనుబంధం పెంచుకున్న విద్యావేత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మంచి జీవితం, జీతాన్ని వదులుకొని నిరుద్యోగుల పక్షాన గొంతు వినిపించడానికి రాజకీయ క్షేత్రంలోకి అడుగుపెట్టినట్టు ప్రసన్న హరికృష్ణ తెలిపారు. కోచింగ్ ద్వారా ఎంతోమంది నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. రాజకీయాల్లో నేను కొత్త వ్యక్తిని. నమ్మకాలు, ఆర్థిక పరిమితులు, ప్రత్యర్థుల ఒత్తిళ్లను అధిగమిస్తూ ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాని, పట్టభద్రుల మద్దతే నాకు అత్యంత విలువైన ఆయుధమని, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రులకు సరైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికల బరిలో నిలిచి మీ ముందుకు వచ్చానని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.



నవతెలంగాణ : ప్రస్తుత విద్యా విధానంలో ఎలాంటి మార్పులు రావాలి?

ప్రసన్న హరికృష్ణ : ప్రస్తుత విద్యా విధానం సైద్ధాంతిక పరిజ్ఞానంపై ఎక్కువగా ఆధారపడి ఉంది. విద్యార్థులకు నైపుణ్య పరంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలను పెంచే విధంగా మార్పులు రావాలి. ప్రాక్టికల్ లెర్నింగ్, పరిశోధన, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

నవతెలంగాణ : అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవలోకి రావాలనే నిర్ణయం ఎందుకు తీసుకున్నారు?

ప్రసన్న హరికృష్ణ : విద్యారంగంలో పనిచేసిన అనుభవం ద్వారా నేను ప్రజల సమస్యలను దగ్గరగా గమనించాను. సమాజంలో మార్పును తీసుకురావాలంటే పాలనలో ప్రత్యక్షంగా భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని భావించాను. అందుకే నా కెరీర్‌ను త్యజించి ప్రజాసేవను ఎన్నుకున్నాను.

నవతెలంగాణ : నాణ్యమైన విద్య అందించడంలో మీ ప్రాధాన్యత ఏమిటి?

ప్రసన్న హరికృష్ణ : ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమర్థమైన బోధన, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి బోధన విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రతి విద్యార్థికి నైపుణ్య అభివృద్ధి అవకాశాలు కల్పించి, వాస్తవ ప్రపంచానికి సిద్ధంగా ఉంచడం నా లక్ష్యం.

నవతెలంగాణ : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సూచించే మార్గాలు?

ప్రసన్న హరికృష్ణ : విద్యను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించాలి. పారిశ్రామిక రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టాలి. స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహించి, యువతను ఉపాధి కల్పించగల వ్యక్తులుగా తీర్చిదిద్దాలి.

నవతెలంగాణ : ప్రభుత్వం గ్రంథాలయాల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవడం లేదని మీరు పేర్కొన్నారు. దీని పరిష్కారానికి మీ ప్రణాళిక ఏమిటి?

ప్రసన్న హరికృష్ణ : గ్రంథాలయాలు ప్రజలకు విజ్ఞాన కేంద్రాలుగా ఉండాలి. అందుకు వీలుగా గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. వాటిని డిజిటల్ లైబ్రరీలుగా మార్చాలి. పుస్తక ప్రేమికులను ఆకర్షించే కార్యక్రమాలు నిర్వహించాలి.

నవతెలంగాణ : పట్టభద్రులు విచక్షణతో ఓటు వేయాలన్న మీ అభిప్రాయాన్ని వివరించగలరా?

ప్రసన్న హరికృష్ణ : ఓటు కేవలం హక్కు కాదు, బాధ్యత. అభ్యర్థుల అర్హతలను పరిశీలించి, సమాజానికి సేవ చేసే వ్యక్తులను ఎంచుకోవాలి. మత, కుల, డబ్బు ప్రలోభాలకు లోనవకుండా ఓటు వేయాలి.

నవతెలంగాణ : ప్రస్తుతం విద్యారంగంలో మీరు చూసే ప్రధాన లోపాలు ఏమిటి?

ప్రసన్న హరికృష్ణ : ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సదుపాయాలు లేవు. ఉపాధ్యాయుల తగిన సంఖ్యలో నియామకాలు లేవు. ప్రయివేటు విద్యా సంస్థలు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తుండటంతో సామాన్య కుటుంబాలకు విద్య అందటం కష్టంగా మారింది.

నవతెలంగాణ : పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు మీరు తీసుకునే ప్రత్యేక చర్యలు ఏమిటి?

ప్రసన్న హరికృష్ణ : వారికోసం ప్రత్యేకంగా ఉపాధి కల్పన కార్యక్రమాలు నిర్వహించాలి. స్టార్టప్‌లు, స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలి. సాంకేతిక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి.

నవతెలంగాణ : ప్రభుత్వ విధానాల కారణంగా ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నాయి?

ప్రసన్న హరికృష్ణ : నిరుద్యోగం పెరుగుతోంది. విద్య, వైద్యం ఖరీదుగా మారుతోంది. రైతులు, చిన్నతరహా వ్యాపారులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

నవతెలంగాణ : గెలిచాక పార్టీ మారుతారని వస్తున్న ఆరోపణలపై?

ప్రసన్న హరికృష్ణ : ఈ ఎన్నిక ఓ సామాన్య అభ్యర్థి విజయం సాధిస్తే, భవిష్యత్తులో రాజకీయం ఎలా ఉండాలనే దానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. పట్టభద్రులు, యువత ప్రజాస్వామ్య యుద్ధం చేయాలి. నేను గెలిచాక ఎట్టి పరిస్థితుల్లో ఏ పార్టీలో చేరబోను. పట్టభద్రుల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రధాన పార్టీలు ఇలా విషప్రచారం చేస్తున్నాయి.

నవతెలంగాణ : విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి వంటి రంగాల్లో మీరు ప్రాధాన్యత ఇవ్వబోయే అంశాలు ఏమిటి?

ప్రసన్న హరికృష్ణ : ఉచిత వైద్యం అందుబాటులోకి తేవడం. గ్రామీణ అభివృద్ధి కోసం సుస్థిర పథకాలు అమలు చేయడం. నిరుద్యోగం తగ్గించేందుకు సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం.

నవతెలంగాణ : మీ మ్యానిఫెస్టో ?

ప్రసన్న హరికృష్ణ : ఏ ఎన్నికలల్లో ఎవరు చేయాలని సహసం నేను చేశాను. 8 హామీలతో బాండ్‌పై సంతకం చేశాను. జీతం నుంచి 50శాతం నిరుద్యోగులకు ఖర్చు, జాబ్ క్యాలెండర్ కోసం కృషి, ఉచితంగా నిరుద్యోగులకు కోచింగ్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ మేళా, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ప్రయివేట్ ఉద్యోగుల సంక్షేమం, గ్రంథాలయాల్లో ఉచిత మధ్యాహ్న భోజనం, విద్యా వ్యవస్థ బలోపేతం ఈ హామీలను అమలు చేస్తాను.

నవతెలంగాణ : మీ రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి, వాటిని ఎలా అధిగమించారు?

ప్రసన్న హరికృష్ణ : పార్టీ రాజకీయాల్లో నేను కొత్త వ్యక్తిని. నమ్మకాలు, ఆర్థిక పరిమితులు, ప్రత్యర్థుల ఒత్తిళ్లను అధిగమిస్తూ పట్టభద్రులకు సేవ చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాను. ప్రజల మద్దతే నాకు అత్యంత విలువైన ఆయుధం.

100శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడమే 'శ్రీ చైతన్య' లక్ష్యం

విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

ఘనంగా 'స్వాగత్' ఫ్రెషర్స్ వేడుకలు

నవతెలంగాణ - తిమ్మాపూర్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్

మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో 'స్వాగత్' పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100శాతం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, వృత్తిపట్ల సమగ్ర విజ్ఞానం కలిగి ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మెకానికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో 'గైరేషన్' వేడుకలు

శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లర్నింగ్, డేటా సైన్స్ వంటి నూతన కోర్సుల ద్వారా విద్యార్థుల సమగ్ర విజ్ఞాన పొందుతారనీ అన్నారు. కళాశాలలోని ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కాజా జియావుద్దీన్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రవీందర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రం పరిశీలన

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రభుత్వ కార్యదర్శి యోగితా రానా సందర్శించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏయే కారణాలవల్ల పిల్లలను పునరావాస కేంద్రానికి పంపిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది బోధిస్తున్న అంశాలను, ఫీల్డ్ సిబ్బంది తీసుకుంటున్న చర్యలను ప్రశ్నించారు. కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీధర్, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

కరీంనగర్‌లోని మల్కాపూర్ రోడ్‌లో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో సందర్శించారు. పాఠశాలలోని కంప్యూటర్ గదిని, తరగతి గదులు, విద్యార్థుల హాస్టల్ సముదాయం, డైనింగ్ హాల్ పరిశీలించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఆత్మవిశ్వాసం ముందు వైకల్యం అడ్డురాదని అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన తబలా వాయిద్యం పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, విద్యాధికారి జనార్ధన్‌రావు, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య

నవతెలంగాణ - జమ్మికుంట : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలో కోఆర్డినేటర్లతో కలిసి ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎస్ మొబైల్ స్టోర్‌లో సరికొత్త మొబైల్ వీవో 50 ప్రారంభం



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లోని టూ టౌన్ ఏరియాలోని ఎస్ మొబైల్ స్టోర్‌లో భారతదేశపు నెంబర్ వన్‌గా నిలిచిన వివో కంపెనీ లోని కొత్త మోడల్ అయిన సరికొత్త టెక్నాలజీతో వివో వి50 మొబైల్‌ను బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సెల్ ఇన్ ఫ్లుయెన్సర్ పావని గౌడ్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివో మేనేజర్లు పి.శ్రీకాంత్, కే.భాస్కర్ హాజరయ్యారు. అనంతరం ఎస్ మొబైల్ షాప్ యాజమాన్యం పులి ప్రవీణ్‌గౌడ్, వివో విబిఎ షాబాజ్ ఖాన్ మాట్లాడుతూ.. వివో వి50 మొబైల్ కొన్న ప్రతి కస్టమర్‌కి అద్భుతమైన ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి గొప్ప అవకాశాన్ని కస్టమర్లు సద్వినియం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూషన్ ఎన్.నరేష్ కుమార్, వికాస్ రావు, సయ్యద్ యాసిన్, శ్రీనివాస్ రెడ్డి, కే.మహేష్ పాల్గొన్నారు.

హుజురాబాద్ గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడిగా రాజ్ కుమార్

నవతెలంగాణ - హుజురాబాద్


బద్దుల రాజ్ కుమార్ భాషబోయిన రవి

హుజురాబాద్ ప్రాథమిక గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడిగా బద్దుల రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఇ.మంజుల తెలిపారు. మంగళవారం సహకార సంఘం డైరెక్టర్లుగా ఎంపికైన ఏడుగురి నుండి అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. రాజ్‌కుమార్ ఒక్కరే నామినేషన్ వేయడంతో అతడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా భాషాబోయిన రవి, డైరెక్టర్లుగా గంద్రకోట సారయ్య, భాషబోయిన రవి, లెంకలపల్లి రవీందర్, సింగరవేణి రవి, చేపూరి కొమరమ్మ డి.స్వరూపలు ఎన్నికైనట్లు తెలిపారు.

మొహమ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు

నవతెలంగాణ - కరీంనగర్



కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మొహమ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తమ పూర్తి మద్దతును ప్రకటించింది. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిజమైన మార్పునకు అంకురార్పణ చేసే నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గత ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చినా, గ్రాడ్యుయేట్ సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మొహమ్మద్ ముస్తాక్ అలీ గ్రాడ్యుయేట్ యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధానాలకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఆప్ కన్వీనర్ డాక్టర్ డిడి.సుధాకర్, డాక్టర్ లక్ష్మ్ నాయుడు, విజయ్ మల్లంగి, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నిబద్ధతతో వ్యవహరిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు

నవతెలంగాణ - గంగాధర



ప్రభుత్వ ఉద్యోగులు వృత్తినిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి ఉద్యోగవిరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీడీపీవో కస్తూరిని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణితోపాటు పలువురు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, విజయ్, సంక్షేమ అధికారి సబిత, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, శక్తి చిల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, అంగన్‌వాడి సూపర్వైజర్లు, అంగన్వాడి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం ఆశీస్సులు తీసుకున్న సుంకె దంపతులు

నవతెలంగాణ - గంగాధర



చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్,దీవెన దంపతులు మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. సుంకె దంపతులు తమ వివాహ వార్షికోత్సవంను పురస్కరించుకుని కేసీఆర్‌ను కలిసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా కేసీఆర్ సుంకె రవిశంకర్, దీవెన దంపతులను ఆశీర్వదించారు. వారివెంట ఆయన కుమారుడు దీక్షిత్ ఉన్నారు.

ఘనంగా 'స్పోర్ట్స్ స్పార్క్' వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్



కరీంనగర్ జ్యోతినగర్ ఎక్స్‌ప్లోరిక పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు 'స్పోర్ట్స్ స్పార్క్' అనే పేరుతో తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వీయూఎం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, పాఠశాల క్రీడా పతాకాన్ని ఎగురవేసి క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులచే నిర్వహించబడిన కవాతు, విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులను, వారి కుటుంబ సభ్యులను, క్రీడలలో గెలుపొందిన వారిని పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాద్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేశ్, ప్రాచీ, వినోద్ రావు, వీయూఎం ప్రసాద్, టీఎస్వీ రమణ, హన్మంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మిష్ఠ పాల్గొన్నారు.

బీసీలను అణగదొక్కుతున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్

బీసీలను అణగదొక్కుతున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగినట్లు డాక్టర్ బండారి రాజ్ కుమార్ ప్రకటించారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సామాజిక సేవే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన డాక్టర్ రాజ్ కుమార్, కరోనా మహమ్మారి కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్యసేవలు అందించానని గుర్తుచేశారు. తన సేవలను గుర్తించిన వైద్య వర్గాలు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికకు తనను సిఫార్సు చేశాయని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టభద్రులు, నిరుద్యోగ యువతకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని విమర్శించారు. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరి, పైగా పదవీ విరమణ వయసు పెంచే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే యూనివర్సిటీల్లో బోధనా సిబ్బందికి పదవీ విరమణ వయస్సు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం అభ్యంతరకరమన్నారు. పట్టభద్రుల హక్కుల కోసం పోరాడే నా తరహా సామాన్యునికి మద్దతుగా నిలవాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ రాజ్ కుమార్ సతీమణి డాక్టర్ సాయికృష్ణ ప్రియా మాట్లాడుతూ పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఓటును అమ్ముకోవద్దని, సమాజ సేవే ధ్యేయంగా పనిచేస్తున్న డాక్టర్ బండారి రాజ్ కుమార్‌ను మొదటి ప్రాధాన్యత ఓటుగా గెలిపించి, నైతిక విలువలకు పట్టం కట్టాలని కోరారు.

నల్లగొండ ఆలయానికి విరాళం

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి ఆలయానికి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నోముల రజిత సంపత్ గౌడ్ రూ.10116 విరాళం మంగళవారం ఆలయ చైర్మన్ బండారుపల్లి లక్ష్మణ్‌కు అందజేశారు. వారివెంట మల్యాల సంపత్‌గౌడ్, భూత్కూరి శ్రీనివాస్, గాజుల అంజయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రారంభం

నవతెలంగాణ-మానకొండూర్ :


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ రమేష్‌బాబు

మండలంలోని ఊటూర్ సబ్ స్టేషన్ లో 11కేవి బ్రేకర్‌తో పాటు మండల కేంద్రంలో 3 నూతన ట్రాన్స్ ఫార్మర్స్‌ను మంగళవారం విద్యుత్ ఎస్ఈ ఎం.రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్రా హైడ్రాన్ స్కూల్లో సైన్స్ ఫెయిర్



నవతెలంగాణ - హుజురాబాద్ : పట్టణంలోని టెట్రా హైడ్రాన్ మోడల్ స్కూల్ మోడల్ స్కూల్లో మంగళవారం సైన్స్ డేను పురస్కరించుకొని ముందస్తుగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు చేసిన పలు నమూనాలను పరిశీలించారు. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్, చంద్రయాన్, నేచర్ ఫార్మింగ్, పలు ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముచ్చ నారాయణరెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి, సంతోష్‌రావు, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు షహనాజ్ బేగం, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు ప్రచారం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు ఆయన నివాసంలో పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యల గురించి, విద్య, ఉపాధి వంటి అంశాలపై తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. శీనన్న యువసేన సభ్యులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణను గెలిపించాలి

బీఎస్పీ మండల అధ్యక్షుడు భాస్కర్



నవతెలంగాణ - శంకరపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని మంగళవారం శంకరపట్నం మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవునూరి భాస్కర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల కార్యదర్శి ఆడెపు రాజమల్లు, దేవునూరి అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లో మట్టి అక్రమ దందా

- కెనాల్ మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్న మట్టి మాఫియా

నవతెలంగాణ - గన్నేరువరం



బెజ్జంకి, గన్నేరువరం మండలాల శివారు గ్రామాలైన గునుకుల కొండాపూర్, వడ్లూరు, చీమలకుంటపల్లి శివారు గ్రామాలు అక్రమ వ్యాపారులకు అడ్డాలుగా మారాయి. బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామంలో వరద కాలువ కెనాల్ మట్టిని పట్టపగలు ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా జెసిబి, టిప్పర్ల సహాయంతో గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో వెంచర్‌కు రెండు రోజులుగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ ఏ ఒక్క అధికారి అటువైపు గా తొంగి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కెనాల్ మట్టిని తరలిస్తున్నారని ఎవరైనా గ్రామస్తులు అధికారులకు సమాచారం చేరవేసినప్పటికీ అది మా పరిధి కాదని చేతులు దులుపుకొని దాటవేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గునుగుల కొండాపూర్‌లో మట్టి టిప్పర్‌ను గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ యథావిధిగా ఎలాంటి భయం లేకుండా గునుకుల కొండాపూర్ మీదుగా గుండ్లపల్లికు మట్టి రవాణా కొనసాగుతూనే ఉన్నది. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, పోలీసులు చూసి చూడనట్టుగా వ్యవహరించడంపై గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే నిర్లక్ష్య ధోరణి కొనసాగితే రెండు మండలాలలో వరద కాలువ చుట్టూ తట్టెడు మట్టి కూడా దొరకదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈకి వివరణ కోరడానికి ఫోన్ చేస్తే ఫోన్ కలవలేదు. ఇప్పటికైనా మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఇరు మండలాల ప్రజలు కోరుతున్నారు.

సర్వశక్తులూ ఒడ్డుతాం

(మొదటిపేజీ తరువాయి)

11 కిలోమీటర్ల తర్వాత నీరు ఉందన్నారు. అయినప్పటికీ 11.5 కిలోమీటర్ల దూరం వరకు వివిధ ఏజెన్సీల రక్షణ బృందాలు వెళ్లగలిగాయని చెప్పారు. 13.50 కిలోమీటర్ల వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బీ.ఎం) ఉందని, అక్కడికి వెళ్లే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇక్కడి నుంచి ఎయిర్ సప్లై పైప్‌లైన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైనదని తెలిపారు. సొరంగంలో ఎంత దూరం వరకు బురద, నీరు ఉందనేది జీఎస్ఐ, ఎంజీఆర్ఐ అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. చివరి 40 మీటర్లలో నీరు, బురద మట్టి ఉందని, రాళ్లు ఉన్నా కనిపించడం లేదని అన్నారు. 15 అడుగుల ఎత్తులో 200 మీటర్ల వరకు ఈ బురద ఉందని ప్రతినిధులు, అధికారులు వివరించారు. ప్రస్తుతం టన్నెల్‌లో 10 వేల ఘనపుటడుగుల (క్యూబిక్ మీటర్లు) బురద ఉందని ప్రాథమికంగా అంచనా వేశామని, దాన్ని బయటికి తీయడమే ప్రధాన సవాలుగా ఉందని అన్నారు. కన్వేయర్ బెల్ట్‌కు బుధవారం సాయంత్రం లేదా ఎల్లుండిలోగా మరమ్మతులు పూర్తవుతాయని తెలిపారు. ఈ కన్వేయర్ బెల్ట్ ద్వారా గంటకు 800 టన్నుల బురదను బయటికి తీయొచ్చన్నారు. వీటిని మరింత త్వరితగతిన వెలికి తీయడానికి అక్కడికి వెళ్లగలిగే జేసీబీలను తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టన్నెల్‌లో గంటకు 3600 నుంచి 5వేల లీటర్ల ఊట నీరు వస్తుందని తెలిపారు. లోపలి నుంచి నీటితోపాటు, బురదను కూడా బయటికి తీయడానికి ఒకే పైప్‌లైన్ వినియోగించనున్నామని స్పష్టం చేశారు. వాటర్ ఫ్లోటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులతోపాటు సహాయక చర్యలు చేపట్టిన వారితో ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

పదేండ్లపాటు పెండింగ్‌లో పెట్టి ఇప్పుడు విమర్శలా : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

పదేండ్లపాటు ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి.. ఇప్పుడు జరిగిన టన్నెల్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేయడం కూడా ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చన్నారు. ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజ్‌లు సర్వసాధారణం అని, సొరంగం తవ్వకాల సమయంలో ఏర్పడిన లీకేజ్ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని చెప్పారు. ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీ, నేవీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఇతర ఏజెన్సీలు సమిష్టిగా పని చేస్తున్నాయని, వేగంగా, సురక్షితంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డీ వాటరింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల కోసం నిరంతరం ఆక్సిజన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ మంగళవారం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తాజా సమాచారం కోరగా, ప్రధాని మోడీ ఇప్పటికే సీఎంకు ఫోన్ చేసి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రమాద స్థలంలో పరిస్థితి తీవ్రంగా ఉందని, నీటి ప్రవాహం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోందని చెప్పారు. టన్నెల్‌లోని మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నా మని వివరించారు. టన్నెల్‌లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు, మట్టి ప్రవహించా యన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి, దీనిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో సీఎండీ ముషరాఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ ఈ.శ్రీధర్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ రంగనిపుణులు క్రిస్ కూపర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధి గ్రేన్ మేకర్డ్, ఉత్తరాఖండ్ దుర్ఘటన రెస్క్యూ ఆపరేషన్ నిపుణుల బృందం, జేపీకి చెందిన పంకజ్ గౌర్, నేవీకి చెందిన మరికోస్, ప్రసాద్, ఆర్మీ కల్నల్ వికాస్, కల్నల్ సురేష్, మోర్త్ డైరెక్టర్ అన్ను కల్యు, కమాండెంట్ ప్రసన్న, అగ్నిమాపక శాఖ రీజినల్ ఫెయిర్ ఆఫీసర్ సుధాకర్ రావు, హైడ్రాకు చెందిన పాపయ్య, అధికారి సదానందం, ఉత్తరకాశీ టన్నెల్ రెస్క్యూ ర్యాట్ మైనర్స్ గ్రూప్ ప్రతినిధి ఫిరోజ్ కురేషి, నవయుగకు చెందిన కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో వివరాలు చెప్పండి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్



నవతెలంగాణ-ఓయూ

కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మళ్లీ జరుగుతున్న సర్వేలో పాల్గొనాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ అన్నారు. కుల గణన సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర డివిజన్లలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే వివరాలు ప్రజల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వారాసిగూడలోని జడ్ఎం ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు తప్పకుండా సర్వేలో వివరాలు తెలపాలని కోరారు. ఆన్‌లైన్‌లో, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు గానీ వివరాలు తెలిపి సర్వేలో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కుల గణన సర్వేలో పాల్గొనాలని, అందుబాటులో లేని వారు 040 21111111 నెంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షులు సజన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, షకీల్ ఖాన్, జాము అనిల్ కుమార్, వాహిదుద్దీన్ లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్, శేఖర్, శోభ, రాధ, కల్పన, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో నిరాశ..!

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికలపై సందిగ్ధం
- 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా మార్చే యోచనలో సర్కార్
- ఇప్పటికే ఎన్నికలకు సిద్ధమైన గ్రామస్థాయి నేతలు

పల్లె పోరుకు మరింత సమయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని మొన్నటి వరకు ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో నేతలు పదవులపై ఆశతో ఉన్నారు. అధికారులు సైతం ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర పనులు పూర్తి చేశారు. అయితే మరోసారి కులగణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడంపై.. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పల్లె పోరుపై సందిగ్ధం నెలకొంది. జిల్లాలో ఉన్న 61 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే కొన్నింటినీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేయగా.. మిగిలిన 34 జీపీలను 3 మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఎన్నికలు జరుగుతాయా..? లేదా..? అనే సందేహంలో ఆశావహులు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.

పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాదిపైనే..



గ్రామ పంచాయతీల పాలక కమిటీల కాలపరిమితి ముగిసి ఏడాది దాటిపోయింది. గత ఆగస్టులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 34 గ్రామపంచాయతీల్లో ఆశావహులు అన్నీ సిద్ధం చేసుకునే పనుల్లో ఉన్నారు. ఇదే క్రమంలో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో 19 ఎంపీటీసీలు, 3 జెడ్పీటీసీ స్థానాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆయా పార్టీల నాయకులు కూడా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ పై నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయంలో గ్రామాల్లో నేతలు చర్చించుకున్నారు. ఈ నెల 15 నాటికి షెడ్యూల్ వెలువడుతుందని అంతా భావించారు. కానీ, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది.

ఓటరు జాబితా, రెండు మండల పరిషత్‌లు రద్దు

సమీప మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 7 మున్సిపాల్టీల్లో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. పంచాయతీ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా గతేడాది సెప్టెంబర్‌లో పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో విలీనమైన గ్రామాలను గత నెల 4న ప్రభుత్వం రాష్ట్ర గెజిట్‌లో ప్రకటించింది. సదరు పంచాయతీల ఉన్నతీకరణ కారణంగా పంచాయతీరాజ్ చట్టం 2018లో సవరణ చేసి ఆ శాఖ పరిధిలో నుంచి తొలగించారు. ఈ అంశాలను ఉదహరిస్తూ 28 విలీన గ్రామాల్లో ఓటరు జాబితాలు చెల్లవని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనికితోడు ఇటీవల ఘట్‌కేసర్, కీసర మండలాల్లోని గ్రామాలన్నీ సమీప మున్సిపాల్టీల్లో విలీనం కావడంతో ఈ రెండు మండల పరిషత్‌లను ఇటీవల రద్దు చేశారు.



34 జీపీలు.. 3 మున్సిపాల్టీలు

పల్లెలను పట్టణాలుగా మార్చేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆ దిశగా సన్నాహాలను వేగవంతం చేసింది. జిల్లాలో 34 గ్రామ పంచాయతీలతో మూడు కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. 3 మున్సిపాల్టీలను ప్రతిపాదిస్తూ ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంచాయతీ రాజ్‌కు అక్కడి నుంచి రాష్ట్ర పురపాలక సంచాలకుల కార్యాలయం (సీడీఎంఏ), ఆ తర్వాత సర్కార్‌కు చేరాయి. ఈ ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే వీటిపై సర్కార్ నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా గత పంచాయతీ ఎన్నికల నాటికి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు, 5 గ్రామీణ మండలాలు ఉండేవి. వీటిలోంచి ఔటర్ రింగ్ రోడ్డు లోపల, బయట ఉన్న 28 గ్రామాలను గతేడాది సెప్టెంబర్‌లో 7న మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. విలీనం వల్ల 33 గ్రామాలు మాత్రమే మిగిలి ఉండగా, కొత్తగా మరో గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు.

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- నేడు ప్రధాని మోడీతో భేటీ
- ఏఐసీసీ అగ్రనేతలతోనూ సమావేశం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన రేవంత్ బుధవారం ప్రధాని మోడీతో.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించేలా బడ్జెట్‌ను సవరించాలని కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన పలు పెండింగ్ సమస్యలను సీఎం...ప్రధాని ముందుంచనున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు నిధులు ఇవ్వాలని కోరనున్నారు. భేటీ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన గురించి ప్రధానికి వివరించనున్నట్టు తెలిసింది.

ఏఐసీసీ అగ్రనేతలతోనూ...

తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులపై వారితో ఆయన చర్చించనున్నారు. ఈ కోటాలో దాదాపు పది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సీపీఐ, ఎంఐఎం పార్టీలు కూడా ఒక్కొక్కటి చొప్పున ఎమ్మెల్సీ సీటును కోరుతున్నాయి. ఈ విషయాన్ని సీఎం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించనున్నారు. సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కొత్త మంత్రివర్గ విస్తరణపై ఈసారైనా క్లారిటీ వస్తుందా? రాదా? అనేది చూడాలి.

నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్టు..

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



మాట్లాడుతున్న చావ రవి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చావా రవి మాట్లాడారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గత ఆరేండ్లుగా.. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని తెలిపారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల్లో నెల మొదటి తేదీనే వేతనాలు ఇస్తామన్న హామీ అమలు కావడం లేదని అన్నారు. రెండేండ్లుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టేందుకు కృషి చేస్తారని తెలిపారు. గురుకులాల పని వేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని, కేజీబీవీ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్న సమస్యలపై పోరాడుతున్నామని తెలిపారు. నర్సిరెడ్డి మళ్లీ ఎమ్మెల్సీగా గెలిస్తే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, టీపీటీఎఫ్ బాధ్యులు ఎంవీ నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షమీ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఉద్దండు షరీఫ్, జిల్లా పూర్వ కార్యదర్శి జి.రాజశేఖర్, వైరా మండల బాధ్యులు జి.రామకృష్ణ, ఎ.సుధాకర్, బి.అనితదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్.వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్ర వ్యాప్తంగా గత 48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల జాడ దొరకడం లేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పలకరించే తీరిక, ప్రమాద ఘటనను సందర్శించే ఓపిక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదు. ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటూనే ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎంపై విమర్శలు గుప్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు 500 మంది కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోజుకు ఒక రైతు చొప్పున ఇప్పటివరకు 450 మంది రైతులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 36వ సారి రేవంత్ ఢిల్లీకి వెళ్లినా కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. 15 నెలల స్వల్ప కాలంలోనే అధికార కాంగ్రెస్ పార్టీని వదిలి ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే రేవంత్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్ మాత్రమే కాదనీ, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్, ఎస్ఎల్‌బీసీ, ఖమ్మం పెద్దవాగు ప్రమాదాలు జరిగినా బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం పిల్లర్ పగిలినప్పుడు హడావుడి చేసిన ఎన్‌డీఏ, ఈ ప్రమాదాల విషయంలో మౌనంగా ఎందుకుందని నిలదీశారు. తాము గత పదేండ్లలో ఏటా రూ.40 వేల కోట్ల అపులు చేస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 నెలల్లో 1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క ఇటుకైనా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్ రామ్ అవుతుందని కేసీఆర్ ముందే హెచ్చరించారని గుర్తు చేశారు. ఏడాది కాలంలో చేసిన రూ. లక్షన్నర కోట్ల అప్పుతో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాటి కొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి?

- బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రతి ఎన్నికల సమయంలోనూ హిందూ, ముస్లింలని రెచ్చగొట్టడమేంటి? బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్..పాకిస్తాన్..హిందూ..ముస్లిం మాటలు తప్ప వేరేవి రావా?' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రశ్నించారు. "భారతీయులంతా నా సోదరులే. భారత రాజ్యాంగాన్ని కాపాడతాను" అని ప్రమాణం చేసిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాలు చేయడం అవసరమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికపై ఎన్నికల ప్రచారానికి రండి అని సవాల్ విసిరారు. అన్ని రంగాల్లోనూ వెనుకబడ్డ పాకిస్తాన్‌తో పదేపదే పోల్చి మన దేశాన్ని గొప్పతనాన్ని తగ్గించొద్దని బండి సంజయ్‌కు సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 ఏండ్లుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలైనా ఇచ్చారా? తెలంగాణలో ఎంతమందికి ఉద్యోగాలిచ్చారు? ఎంత మందికి ఉపాధి కల్పించారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశ ప్రయోజనాల కోసం నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు అమ్ముకుంటూ పోతున్నదనీ, ప్రయివేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నదని విమర్శించారు. నిరుద్యోగులకు, యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో చెప్పుకోవడానికి అభివృద్ధి లేదు..ఆయనలో సబ్జెక్టు అంతకన్నా లేదు అని విమర్శించారు. రాష్ట్రంలోని పట్టభద్రులకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని తెలిపారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ అగర్‌బత్తీలపై మీద కూడా జీఎస్టీ వేసిందని విమర్శించారు. ఉన్నత విద్యపై 18 శాతం జీఎస్టీ ఏంటని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల మాట ఏమైందని ప్రశ్నించారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టని అసమర్థ స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు.

మాది ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం

ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లోనూ కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం : కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



'మా పార్టీ ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం.. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లో కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం' అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. '14 నెలల కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందాం?.. ఉద్యోగాల కల్పన, నిధుల ఖర్చుపై బహిరంగ చర్చకు సవాల్ విసిరితే సీఎం తోకముడిచారు' అని ఆయన విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు.

గుజరాత్, మధ్యప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలోనూ ఎప్పటి నుంచో దూదేకుల వంటి సామాజిక తరగతులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దానికి తాము ఏనాడూ అభ్యంతరం పెట్టలేదని చెప్పారు. 12.5 శాతం ముస్లిం జనాభాలో 10.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటామని అన్నారు. నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపి బీసీల పొట్టకొడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఫోన్ ట్యాపింగ్ దొంగలు విదేశాలకు పారిపోయింది నిజం కాదా? అని, సీబీఐ విచారణ కోరితే హైకోర్టు ముందే తమ అడ్వకేట్ జనరల్ ఒప్పుకోని మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము మీకు లేదా? అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

పోలింగ్ రోజు ప్రయివేటు స్కూల్స్, కాలేజీలకు సెలవివ్వండి

బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి

ఈ నెల 27న గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు సంబంధించి విలువైన ఓటు హక్కును వినియోగించు కునేందుకు పట్టభద్రులు అందరికీ అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసింది. చాలా కళాశాలల్లో, పాఠశాలల్లో ఓటు హక్కు కలిగిన సిబ్బందికి కొన్ని గంటలు మాత్రమే పర్మిషన్ ఇస్తామని చెబుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కచ్చితంగా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు యాజమాన్యాలు ఓటు కలిగిన సిబ్బందికి రోజంతా సెలవు దినాన్ని ప్రకటించాలి. వారికి ఏడాదిలో అందిం చే సీఎల్‌లకు వీటికి సంబంధం లేకుండానే అదనంగా పోలింగ్ రోజు సెలవు దినంగా అవకాశాన్ని ఇవ్వాలి.

బండి సంజయ్.. దిగజారుడు మాటలు మానుకో..

- ప్రతి అంశంలో ముస్లిములు, పాకిస్తాన్‌ను ముడిపెట్టడం సరికాదు
- ప్రతి ఎన్నికల్లోనూ మతవిద్వేషాలను రెచ్చగొట్టడం అలవాటైంది
- అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



'ప్రతి అంశంలోనూ.. దేశానికి, పాకిస్తాన్‌కు, హిందువులకు-ముస్లిములకు ముడిపెట్టడం.. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇకనైనా పద్ధతి మార్చుకో.. దిగజారుడు మాటలు మానుకో..' అని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిని పెట్టకుండా బీజేపీకి మద్దతుగా నిలుస్తోందని, పదేండ్లుగా ఆ రెండు పార్టీల మధ్య ఉన్న చీకటి లోపాయికారి ఒప్పందం మరోమారు బయటపడిందని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ బిడ్డగా తమరికి కేంద్రంలో స్థానం రావడం తమకు సంతోషంగా ఉందని, ఆ బాధ్యతను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వర్తించాల్సింది పోయి.. మళ్లీ పాత పద్ధతిలోనే హిందూ ముస్లిం, ఇండియా- పాకిస్తాన్ అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దుబాయ్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో ఇండియా గెలిస్తే.. అది బీజేపీ గెలిపించినట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టభద్రుల ఎన్నికలు అంటేనే రాష్ట్ర స్థితిగతులు, రాష్ట్ర అంశాలను అవగాహన చేసుకుని ఓటు వేసే అంశమని చెప్పారు. 'మీరెన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని మత విద్వేషపు మాటలు మాట్లాడినా మా అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఆపలేరు.. సీఎం నాయకత్వంలో ఏడాదిలో చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన సంక్షేమాలు.. మీరు పది సంవత్సరాల్లో చేసిన దానిపై చర్చకు సిద్ధం' అని సవాల్ విసిరారు. పదేండ్లలో కనీసం 50వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని, తాము వచ్చిన ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలనూ భర్తీ చేస్తామని తెలిపారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారన్న దానిపై తాము నోటీసులు ఇవ్వలేదంటున్న సంజయ్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో తేల్చాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

గుజరాత్ గురించి మాట్లాడే బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు మాట్లా డరని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన మెట్రో రైల్ నిధులు, ఫోర్త్ సిటీ అంశం తదితర వాటిపై ఎప్పుడైనా ప్రధానిని అడిగారా? కనీసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా? అని అన్నారు.

ఈ రోజు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగు తున్నారంటూ విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ప్రతిఘటనకు ఓ సాధనంగా..



మారా కలెక్టివ్... హింసకు గురైన మహిళల స్వరాన్ని ప్రపంచానికి వినిపిస్తోంది. బాధిత అందునా దళిత మహిళలు తమ కథలను తిరిగి రాయడానికి అవసరమైన శక్తినిస్తోంది. గ్రామీణ మధ్యప్రదేశ్‌లో లైంగిక, కుల ఆధారిత హింస నుండి బయటపడినవారు దళిత మహిళా నాటక రచయితలు మారారు. నాటకాన్ని తమ ప్రతిఘటనకు ఒక సాధనంగా మలుచుకున్నారు. ఇప్పటి వరకు వినని తమ మనసులోని వేధనను ధైర్యంగా సమాజానికి చాటిచెబుతున్నారు.

మారా లైంగిక హింస, అత్యాచారానికి గురైన మొదటి వ్యక్తి కథలను వివరిస్తుంది. 'మీలో చెప్పలేని కథను మోయడం కంటే గొప్ప వేదన మరొకటి లేదు' అంటారు తన 'ఐ నో వై ది కేజ్డ్ బర్డ్ సింగ్స్' (1969) అనే కవితా సంపుటిలో ప్రముఖ రచయిత్రి మాయా ఏంజెలో. 2018లో గ్రామీణ భారతదేశంలోని దాదాపు వంద మంది మహిళలు లైంగిక, లింగ ఆధారిత హింస అనుభవాలను వివరించారు. వాటిని విన్న తర్వాత అంగారికా గుహ, అనుషి అగర్వాల్ ఓ ఆలోచన చేశారు. బెంగళూరుకు చెందిన 'మారా' అనే సంస్థ ఆధ్వర్యంలో ఆ బాధిత మహిళల అనుభవాలను 'చు కర్ దేఖో' (టచ్ అండ్ సీ) అనే నాటకాన్ని రూపొందించారు.

సామూహిక ప్రతిధ్వని

మారా కలెక్టివ్ సభ్యులలో మమతా సోలంకి ఒకరు. ఊహించలేని హింసకు గురైన తర్వాత సోలంకి నిశ్శబ్దంలోకి నెట్టబడింది. భర్త ఆమెను విడిచిపెట్టి వెళ్లిన తర్వాత ఇండ్లలో వంట చేసుకుంటూ బతికింది. అనేక కష్టాలు అనుభవించింది. ఒక రోజు క్యాటరింగ్ ఆర్డర్ ఇస్తామని చెప్పి ఆమెను సుదూర గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆధిపత్య కులానికి చెందిన వ్యక్తుల బృందం ఆమెను బంధించి రెండు రోజులు లైంగికంగా వేధించింది. కానీ పోలీసులు ఆమె చెప్పిన విషయాన్ని నమ్మలేదు. నిందితులపై చర్య తీసుకోవడంలో ఆలస్యం చేశారు. చివరికి నేరస్థులను అరెస్టు చేసినా కోర్టు వారికి వెంటనే బెయిల్ ఇచ్చేసింది. విడుదలయ్యాక ఆమెపై మళ్లీ దాడి చేసి బెదిరించడం మొదలుపెట్టారు. దాంతో సోలంకి తన గ్రామంలో ఇక జీవించడం కష్టమని నిర్ధారించుకున్నారు. గుహ, అగర్వాల్‌లను మొదటిసారి కలిసినప్పుడు ఆమె వారితో మాట్లాడలేక పోయింది. బయటకు అడుగు పెట్టడానికి కూడా భయపడింది. కానీ 'చు కర్ దేఖో' చూసిన తర్వాత సోలంకిలో ఏదో మార్పు వచ్చింది.

ప్రేక్షకులకు వేరే మార్గం లేదు

'వేదికపై మా కథలు చూసినప్పుడు చలించిపోయాను. కానీ నేను ఒంటరిగా లేను, నా చుట్టూ ఉన్న చాలా మంది మహిళలు కూడా ఏడుస్తున్నారు. ఆ క్షణంలో, మేమందరం కోలుకోవడం ప్రారంభించామని నేను అనుకుంటున్నాను. చాలా కాలంగా సమాజం నన్ను నమ్మడానికి, నా బాధను అంగీకరించడానికి నిరాకరించింది. కానీ ఇప్పుడు, నేను ప్రపంచం ముందు నిలబడి నా సొంత మాటలలో నా కథను చెప్పాను. నేను వేదికపై ఉన్నప్పుడు ప్రేక్షకులకు వినడం తప్ప వేరే మార్గం లేదు. వారు అసౌకర్యంతో కూర్చోవాలి, వారి మనసులలో, శరీరాలలో దానిని అనుభవించాలి, దానిని అంగీకరించాలి. ఎందుకంటే నేను ఇకపై కనిపించను' అంటూ ఆమె గుర్తు చేసుకున్నారు.

ధైర్యంగా చెప్పడానికి

సమాజంలో చాలా మంది మహిళలు చదవలేరు, రాయలేరు. అందుకే వారు స్కెచ్‌లు గీయడం ప్రారంభించారు. అవి స్టోరీబోర్డులుగా మారాయి. ఈ మహిళలు థియేటర్‌ను ప్రతిఘటన రూపంగా మలుచుకున్నారు. తమలోని బాధను, నిజాలను సమాజానికి ధైర్యంగా చెప్పడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. సమాజంలో తమను తాము ఓ శక్తిగా నిలబెట్టుకుంటున్నారు. దీని నుండి రూపుదిద్దుకున్న మొదటి నాటకం 'నజర్ కే సామ్నే' (ఇది ఇప్పుడు బ్యాంకాక్‌లో 50 ప్రదర్శనలు పూర్తి చేసింది). ఈ నాటకం మహిళల జీవిత అనుభవాల ద్వారా హింసలోని గతిశీలతను అన్వేషిస్తుంది. అయితే ఇది హింసను ఒక ఏకైక సంఘటనగా చూడటాన్ని తిరస్కరిస్తుంది. దీనికి బదులుగా బాధిత మహిళలు స్వేచ్ఛగా, ఇష్టంగా, ఎలాంటి భయం లేకుండా ఇంటి నుండి బయటకు అడుగు పెట్టే హక్కును అన్వేషిస్తుంది. డ్రాయింగ్, ఇంప్రూవైజేషన్, కదలికల ద్వారా స్క్రిప్ట్‌ను రూపొందించారు.



ఇది వ్యక్తిగత చరిత్రల నుండి ఉద్భవించిన నజర్ కే సామ్నే మాదిరిగా కాకుండా, మహిళలు వారి సొంత అనుభవాల నుండి బయటపడటానికి, విస్తృత అధికార వ్యవస్థలను విమర్శించడానికి థియేటర్‌ను ఉపయోగించడానికి ఈ నాటకం వీలు కల్పిస్తుంది.

అవమానంగా భావించారు


మరొక సభ్యురాలైన వర్ష మాల్వియా.. ఆమె శరీరం, మనసు భరించిన హింసను వివరిస్తుంటే ఇప్పటికీ ఆమె వణికిపోతుంది. అగర్వాల్, గుహతో మొదటిసారి తన కథను పంచుకోమని అడిగినప్పుడు ఆమె అపరాధ భావన, సిగ్గుతో కుంగిపోయింది. 'నన్ను నా ఇంటి నుండి కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, డెహ్రాడూన్‌లో అమ్మేశారు. నేను తప్పించుకుని తిరిగి ఇంటికి వెళితే కుటుంబ సభ్యులు నన్ను నిరాకరించారు. నన్ను వాళ్లు అవమానంగా భావించారు. చాలా కాలం పాటు నేను కూడా దాన్ని నమ్మాను. జరిగిన ప్రతిదానికీ నన్ను నేను నిందించుకున్నాను' అని ఆమె పంచుకున్నారు. మారా బృందంతో రోజుల తరబడి కూర్చున్న తర్వాతే ఆమె అవగాహన మారిపోయింది. 'ఇది నేను భరించాల్సిన అవమానం కాదని, అసలైన నిజం ఏమిటో స్పష్టంగా కనిపించడానికి వారు నాకు సహాయం చేసారు' అంటూ జత చేశారు. తర్వాత ఆమె పంచాయితీ హాళ్లు, కమ్యూనిటీ స్థలాలు, గ్రామాలలో ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. ఇక్కడ పితృస్వామ్య, కుల ఆధారిత హింస రోజువారీ వాస్తవికత. కొన్నిసార్లు ప్రేక్షకులలోని ఆధిపత్య కుల పురుషులు నాటకం ఇతివృత్తాలను తోసిపుచ్చారు. కొన్ని సార్లు భద్రతా కారణాల రీత్యా ప్రదర్శనలను తరలించాల్సి వచ్చింది. అయినప్పటికీ మహిళలు చూడటానికి వచ్చారు.

థియేటర్ ఉపయోగించుకుంటూ...

ఈ బృందం ఇప్పుడు మార్జు బెర్ మోయినా కి కహానీ అనే కొత్త నాటకాన్ని విడుదల చేసింది. ఇది ఇద్దరు యువతులు తమ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న అవినీతిపరుడైన రాజు, మంత్రిపై పోరాడే కథ. అయితే ఇది వ్యక్తిగత చరిత్రల నుండి ఉద్భవించిన నజర్ కే సామ్నే మాదిరిగా కాకుండా, మహిళలు వారి సొంత అనుభవాల నుండి బయటపడటానికి, విస్తృత అధికార వ్యవస్థలను విమర్శించడానికి థియేటర్‌ను ఉపయోగించడానికి ఈ నాటకం వీలు కల్పిస్తుంది. ప్రదర్శన ఈ మహిళలకు చలనశీలత, స్వాతంత్ర్యం, కొంతమందికి ఆర్థిక స్థిరత్వాన్ని కూడా ఇచ్చింది. ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన వారు ఇప్పుడు ప్రదర్శనల కోసం నెలకు 15-20 రోజులు ప్రయాణిస్తారు. నగరాల్లో, స్త్రీవాద సమావేశాలలో, అంతర్జాతీయ ప్రదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. మారా చేస్తున్న కృషికి స్త్రీవాదులు, వ్యక్తిగత దాతలు మాత్రమే మద్దతు ఇస్తున్నారు. అయితే నిధులు పొందడం వీరికి ఎప్పుడూ ఒక సవాలే.

గర్భిణీలకు ఆహార జాగ్రత్తలు

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మించాలన్నా.. ఆమె హెల్తీగా ఉండాలన్నా గర్భిణీలు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆహారం తీసుకునే విషయంలో కొన్ని సూచనలు పాటించాలి. గర్భిణీ సమయంలో తల్లి ఆరోగ్యానికి, బిడ్డ పెరుగుదలకు సరిపోయేంత ఆహారం కొంచెంకొంచెంగా ఎక్కువ సార్లు తినాలి. కాల్షియం, ఇనుము అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వీటితో పాటు పుల్లటి పండ్లు తీసుకోవాలి. పాలు, మాంసం, గుడ్లు, చేపలు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. అలాగే సరైన విశ్రాంతి తీసుకోవాలి. గర్భిణీలలో ముఖ్యంగా రక్తహీనత సమస్య ఉంటుంది. దీని వలన బరువు తక్కువ ఉన్న బిడ్డలు పుట్టడం, తల్లికి అధిక రక్తస్రావం కావడం జరుగుతుంది. కాబట్టి ఇనుము ఎక్కువగా ఉన్న ఆహారం అంటే ఆకుకూరలు,



బెల్లం, రాగులు, ఎండిన పండ్లు (కర్జూరం, ద్రాక్ష), నువ్వులు, చెరుకురసం, ఉలవలు తీసుకోవాలి.

రోజుకు ఒకటి చొప్పున ఐరన్ మాత్రలు వేసుకోవాలి. కొన్ని రకాల పండ్లు, ఆహార పదార్థాలు తినడం వల్ల సమస్యలు వస్తాయన్న అపోహలు ఉన్నాయి. బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం అవుతుందనడం ఎంత మాత్రం నిజం కాదు. ఇందులో అధిక కేలరీలు ఉంటాయి. అందుకే తొందరగా జీర్ణం కాదు. కొబ్బరి నీళ్లలో ఎక్కువ మోతాదులో పొటాషియం, లవణాలు ఉంటాయి. బీట్‌రూట్‌లో ఇనుము, బీటా కెరోటిన్లు... క్యారెట్ కన్నా ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందువల్ల బీట్‌రూట్ కన్నా క్యారెట్ కొంత వరకు మంచిదే. అరటిపండు తినడం వల్ల పిల్లలు నల్లగా పుట్టరు. జున్ను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిలో ఎక్కువగా కొవ్వు పదార్థాలు ఉంటాయి. అందువల్ల ఎక్కువ తింటే అజీర్ణం చేయవచ్చు . అందుకే మిరియాలను కలుపుకొని తినాలి. దానివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు.



ఇరాన్ షాడో ట్యాంకర్లపై
అమెరికా ఆంక్షలు
భారత కంపెనీలపైనా ప్రభావం

వాషింగ్టన్ : ఇరాన్ నుంచి చమురును ఎగుమతి చేయకుండా అడ్డుకొనేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. ఇరాన్ షాడో ట్యాంకర్లు, వాటి ఆపరేటర్లు, మేనేజర్లను లక్ష్యంగా చేస్తూ అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. వివిధ దేశాలకు చెందిన 30మంది వ్యక్తులు, కంపెనీలు, ట్యాంకర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో భారతీయుల పేర్లు కూడా చేర్చినట్లు సమాచారం. వీరంతా ఇరాన్ చమురు విక్రయాలు, బ్రోకరేజీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. హాంకాంగ్, యుఎఇలోని చమురు బ్రోకర్లు, నేషనల్ ఇరానియన్ అయిల్ కంపెనీలు ఉన్నాయి. 'ఇరాన్ తరచూ లక్షల పీపాల చమురును ఎగుమతి చేయడానికి రహస్య ట్యాంకర్లు, షిప్పింగ్ కంపెనీలు, బ్రోకర్లపై ఆధారపడుతోంది. ఇలా వచ్చిన నిధులను ఇతర దేశాలను అస్థిరపరిచే చర్యలకు వాడుతోంది. ఇరాన్ చమురు సరఫరా గొలుసుకట్టు వ్యవస్థలను దెబ్బతీయడానికి అమెరికా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తోంది. ఎవరైనా ఇరాన్‌తో ఆయిల్ డీల్స్ చేస్తే తమ ఆంక్షల పరిధిలోకి వస్తారు" అని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ తెలిపారు.ఈ తాజా ఆంక్షల పరిధిలోకి భారత్‌లోని కొన్ని కంపెనీలు రానున్నాయి. బిఎస్ఎం మారిటైమ్ లిమిటెడ్ లైబులిటీ పార్టనర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఐఎన్‌సీ సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్‌తో కలిసి చమురు రవాణా, కొనుగోలు, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు అమెరికా చెబుతోంది. అలాగే, ఫ్లక్స్ మారిటైమ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఓ నౌకకు టెక్నికల్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ ఓడ లక్షల టన్నుల ఇరాన్ ముడి చమురును రవాణా చేసిందని అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ఇరాన్‌పై వీలైనంత ఆర్థికఒత్తిడిని పెంచాలని ట్రెజరీ సెక్రటరీని ఆదేశిస్తూ ఈనెల ప్రారంభంలో ట్రంప్ ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అలాగే, విదేశాంగ శాఖను కూడా ఆయన ఆదేశించారు. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయేలా చూడాలన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై తలోదారి!

న్యూయార్క్ : సోమవారం జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సమావేశం రెండు తీర్మానాలను ఆమోదించగా ఓటింగుకు భారత్ గైర్హాజరు అయింది. వీటిలో ఒక దానికి ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్ మద్దతు ఇవ్వగా మరో తీర్మానాన్ని అమెరికా ప్రతిపాదించింది. అయితే అట్లాంటిక్ దేశాలు కొన్ని సవరణల ద్వారా తీర్మానాల్లో మార్పులు చేశాయి. ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించేందుకు అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఇమ్మానుయేల్ మాక్రాన్ వాషింగ్టన్‌లో సమావేశమైన సమయంలోనే పశ్చిమ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం గమనార్హం. కాల్పుల విరమణ ఏ మేరకు విజయం సాధించిందన్న విషయంపై ఇరువురు నేతలు పరస్పర విరుద్ధంగా స్పందించారు. రష్యాకు ఉక్రెయిన్ శాశ్వతంగా భూమిని కోల్పోవాల్సిందేనని అమెరికా అంటోంది. దీనిపై మాక్రాన్ స్పందిస్తూ 'శాంతి అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదు. గ్యారంటీలు లేకుండా కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు అర్థమూ కాదు' అని స్పష్టం చేశారు.

సర్వసభ్య సమావేశంలో...

యుద్ధంపై రష్యాకు వ్యతిరేకంగా ఈయూ, ఉక్రెయిన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా అమెరికా, రష్యా, బెలారస్, ఉత్తర కొరియా వ్యతిరేకంగా ఓటేశాయి. తీర్మానానికి అనుకూలంగా 93 ఓట్లు, వ్యతిరేకంగా 18 ఓట్లు వచ్చాయి. 65 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. రష్యా ప్రతిపాదించిన సవరణ కూడా వీగిపోయింది. ఇక అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి యూరోపియన్ దేశాలు భారీగా సవరణలు ప్రతిపాదించాయి. ఇవన్నీ ఉక్రెయిన్‌కు అనుకూలమైనవే. అమెరికా తీర్మానాన్ని ఐరాస సమావేశం ఆమోదించినప్పటికీ చివరికి దానిని ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సవరణలకు 93 దేశాలు అనుకూలంగా ఓటేయగా కేవలం 8 దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి. 73 దేశాలు ఓటింగుకు గైర్హాజరు అయ్యాయి.

ఓటింగుకు దూరంగా భారత్

అందరూ భావించినట్లుగానే రెండు తీర్మానాలపై జరిగిన ఓటింగుకు భారత్ దూరంగా ఉంది. రష్యాను విమర్శిస్తూ ఈయూ ప్రతిపాదించిన తీర్మానంపై జరిగిన ఓటింగులో భారత్ పాల్గొనలేదు. గత మూడు సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం ఇంత బహిరంగంగా ఎన్నడూ తన వైఖరిని బహిర్గతం చేయలేదు. అమెరికా ప్రతిపాదించిన తీర్మానంలో కఠినమైన భాషను వాడకపోవడంతో దానికి మద్దతుగా భారత్ ఓటింగులో పాల్గొంటుందని అందరూ అనుకున్నారు. అయితే రష్యా ఆక్రమణను వ్యతిరేకిస్తూ సవరణ ప్రతిపాదించగానే భారత్ ఓటింగుకు దూరమైంది. ఐరాసలో ఉక్రెయిన్‌పై గతంలో చేసిన తీర్మానాల విషయంలో ఎలా వ్యవహరించిందో ఇప్పుడూ అదే వైఖరి తీసుకుంది. ఐరాస సమావేశంలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి ఫ్రాన్స్ తెచ్చిన మూడు కీలక సవరణలు ఆమోదం పొందాయి.

భద్రతా మండలిలోనూ...

సోమవారం మధ్యాహ్నం జరిగిన ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఉక్రెయిన్‌పై అమెరికా, ఈయూ మధ్య మరోసారి విభేదాలు బయటపడ్డాయి. రష్యాను సమర్థించేలా అమెరికా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానికి ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. తీర్మానాన్ని 10 దేశాలు సమర్థించగా యూరోపియన్ కౌన్సిల్ దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్, గ్రీస్, స్లొవేనియా, డెన్మార్క్ గైర్హాజరు అయ్యాయి. దీంతో ఉక్రెయిన్‌పై భద్రతామండలి మొట్టమొదటిసారిగా తీర్మానాన్ని ఆమోదించింది. గతంలో రెండుసార్లు ఆ ప్రయత్నం జరిగినప్పటికీ రష్యా వీటో చేసింది.

విభేదాలకు బీజం

అట్లాంటిక్ ప్రాంతంలో విభేదాలకు ఈ నెల ప్రారంభంలోనే బీజం పడింది. ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చించారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పరిణామంపై యూరోపియన్ యూనియన్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యూరోపియన్ నేతలను పట్టించుకోకుండా ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తారేమోనని అవి భావించాయి. అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బ్రెజెల్స్, మ్యూనిచ్‌లో పర్యటన జరిపిన తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదేమైనా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై పశ్చిమ దేశాల మధ్య నెలకొన్న విభేదాలు ఐరాస సర్వసభ్య సమావేశంలోనూ, భద్రతా మండలిలోనూ బయటపడ్డాయి. మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యాలు యూరోపియన్ యూనియన్ మద్దతిచ్చిన తీర్మానాన్ని వ్యతిరేకించాయి.

సర్వసభ్య సమావేశంలో చైనా ఓటింగుకు దూరంగా ఉండగా బ్రిటన్, ఫ్రాన్స్ ఆ తీర్మానానికి మద్దతు ఇచ్చాయి. హంగరీ మినహా మిగిలిన ఈయూ దేశాలన్నీ రెండు తీర్మానాలకూ అనుకూలంగా ఓటేశాయి. నాటో సభ్య దేశాల విషయానికి వస్తే అమెరికా, హంగరీ మాత్రమే ఈయూ కూటమితో విభేదించాయి. జీ-77లోని 134 దేశాల మధ్య కూడా ఏకాభిప్రాయం కన్పించలేదు. ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య ఈ విభేదాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. దక్షిణాసియా దేశాల్లో మిశ్రమ స్పందన కన్పించింది. భారత్, పాకిస్తాన్, శ్రీలంక దేశాలు రెండు తీర్మానాల ఓటింగుకూ దూరంగానే ఉన్నాయి. నేపాల్, మాల్దీవులు, భూటాన్ దేశాలు ఈయూ తీర్మానానికి అనుకూలంగా ఓటేయగా దానికి బంగ్లాదేశ్ దూరంగా ఉండిపోయింది. కానీ ఆ తర్వాత అమెరికా తీర్మానానికి చేసిన సవరణలకు మద్దతు ఇచ్చింది.

అన్ని బడుల్లో
'తెలుగు' తప్పనిసరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సహా ఇతర బోర్డు పాఠశాలల్లో కూడా తెలుగు సబ్జెక్టును అమలు చేయాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతి, 2026-27 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని కోరారు. సీబీఎస్ఈ సబ్జెక్టు జాబితా ప్రకారం సింగిడి (ప్రామాణిక తెలుగు) స్థానంలో వెన్నెల (సులభమైన తెలుగు)ను ప్రవేశపెట్టామని తెలిపారు. మాతృభాష తెలుగును రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్‌తోపాటు గుర్తింపు పొందిన సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర బోర్డు యాజమాన్యాల్లోని పాఠశాలల్లో కూడా తెలుగును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించారు. 2018, మార్చి 30న చట్టం 10 ద్వారా ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల తెలుగు భాషను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో అమలు చేయలేదని తెలిపారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తెలుగు భాషను రాష్ట్రంలో తప్పనిసరిగా అమలు చేయాలనే సంకల్పంతో చర్యలను చేపట్టిందని వివరించారు. అందులో భాగంగానే సీబీఎస్ఈ యాజమాన్యాల బోర్డుతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు తెలుగు బోధించి పరీక్షలను నిర్వహించామని నిర్ణయించామని పేర్కొన్నారు. తెలుగును సరళీకృత విధానంలో బోధించి చదువుకునే వారి అభిరుచి పెంచుతూ చదువును కొనసాగించడానికి సులభతర తెలుగు వాచకం వెన్నెలను పాఠ్యాంశంగా తొమ్మిది, పదో తరగతి సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ యాజమాన్యాల్లో పరీక్షలను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. సులభమైన తెలుగును అమలు చేయడం ద్వారా మాతృభాషేతర విద్యార్థులకు అలాగే ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సులభమైన తెలుగును అమలు చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ ఇతర బోర్డు పాఠశాలల్లోని విద్యార్థులకు తొమ్మిది, పదో తరగతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని వివరించారు. 2025-26 విద్యాసంవత్సరం ఆయా యాజమాన్యాల్లో విధిగా తెలుగు భాషా బోధనా, పరీక్షల నిర్వహణ ఒకటి నుంచి పదో తరగతి వరకు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

అలుపెరుగని పోరాటం చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

మినిమమ్ బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, సీఆర్టీలకు మినిమమ్ బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టుల మంజూరు, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వీటితోపాటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

డాలర్ దెబ్బ.. రూపాయి వామ్మో

న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చిత్తులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది.

కిం కర్తవ్యం ?

కెనడా వీసా ని'బంధనాల'తో భారతీయుల ఇబ్బందులు

న్యూఢిల్లీ : వలసలను నివారించేందుకు కెనడా ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యల కారణంగా వేలాది మంది విదేశీ విద్యార్థులు, కార్మికులు సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వీరిలో భారతీయులు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పని, నివాస పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై కూడా కెనడా నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపుతోంది. కెనడా ప్రభుత్వం విధించిన తాజా వీసా నిబంధనలు ఈ నెల ప్రారంభం నుండే అమలులోకి వచ్చాయి. విద్యార్థులు, కార్మికులు, వలసవాదుల వీసా హోదాను ఏ సమయంలో అయినా మార్చేసే అధికారాన్ని సరిహద్దు అధికారులకు కట్టబెడుతూ కెనడా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ గందరగోళానికి కారణమైంది. నూతన ఇమ్మిగ్రేషన్-రెఫ్యూజీ ప్రొటెక్షన్ నిబంధనల ప్రకారం తాత్కాలిక నివాస పత్రాలను నిరాకరించే లేదా తిరస్కరించే అధికారం కెనడా సరిహద్దు సిబ్బందికి ఉంటుంది. అంటే దీనర్థం సరిహద్దు అధికారులు అలాంటి పత్రాలను రద్దు చేయవచ్చు. వీటిలో వర్క్ పర్మిట్లు, స్టూడెంట్ వీసాలు కూడా ఉన్నాయి. అయితే పర్మిట్లు, వీసాలు రద్దు చేసేందుకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు. నూతన నిబంధనలు అనిశ్చితికి దారితీసే అవకాశం ఉన్నదని, వేలాది మందిపై ప్రభావం పడుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కెనడాలో నివసిస్తున్న విదేశీ విద్యార్థులు, ఉద్యోగుల్లో భారతీయుల సంఖ్యే అధికం. భారతీయ విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, చట్టబద్ధమైన వలసవాదులకు కెనడా అనువైన ప్రదేశం. కెనడాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్యే 4.2 లక్షలకు పైగా ఉంటుంది.



విద్యార్థి, కార్మికుడు, ఉద్యోగి లేదా వలసదారుడు...ఎవరైనా సరే తిరస్కరణకు గురైతే దేశంలో ప్రవేశించే చోటే నిలిపివేసి స్వదేశానికి పంపుతారు. ఒకవేళ పర్మిట్ రద్దయిన వ్యక్తి అప్పటికే అక్కడ నివసిస్తున్నా, చదువుకుంటున్నా నిర్దిష్ట సమయం లోగా దేశం విడిచి వెళ్లాల్సిందిగా నోటీసు ఇస్తారు. విద్యార్థులు, ఉద్యోగులే కాదు. పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో కెనడా వెళుతుంటారు. వారందరికీ తాత్కాలిక పర్మిట్లు జారీ చేస్తారు. ఎంత కాలం నివసించవచ్చో నిర్దేశిస్తారు. గత సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో కెనడా 3.6 లక్షల మందికి పైగా భారతీయులకు పర్యాటక వీసాలు జారీ చేసింది. కాగా ఒకవేళ పర్మిట్లు, వీసాలు రద్దయితే అప్పటికే మదుపు చేసిన సొమ్ము గతి ఏమిటన్నది ఇంకా తెలియడం లేదు. విద్యకో, రుణానికో, తనఖాకో, అద్దె రూపంలోనో చెల్లించిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరేనా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

పైసా.. కైసా...?

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న పింఛన్లకు అదనంగా వీటిని ఇవ్వాలనుకుంటే నెలకు అదనంగా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ కావాల్సి ఉంటుందంటూ ఆర్థికశాఖ లెక్కలేసింది. ఈ మొత్తాన్ని కూడా ఇప్పుడు భరించే స్థితిలో లేం కాబట్టి, కొత్త పింఛన్ల జోలికి కూడా పోవటం లేదని ఓ అధికారి తెలిపారు. ఈ రకంగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేయలేక, కొత్త పింఛన్లు ఇవ్వలేకా ప్రభుత్వం సతమతమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీంతోపాటు అంగన్‌వాడీల్లోని టీచర్లకు ఇచ్చే వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామనీ, పీఎఫ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీనిచ్చింది. టీచర్లతోపాటు హెల్పర్లకు ఇచ్చే రిటైర్మెంట్ బెనిఫిట్లను రెట్టింపు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం వాగ్దానం చేసింది. ప్రస్తుతం టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలను బెనిఫిట్లుగా ఇస్తున్నారు. ఇందుకోసం ప్రతీయేటా బడ్జెట్‌లో రూ.20 కోట్లను కేటాయిస్తున్నారు. వీటిని రెట్టింపు చేయాలంటే రూ.40 కోట్లు అవసరమవుతాయి. 'ఖజానా' కష్టాల నేపథ్యంలో సంబంధిత దస్త్రం కూడా పక్కకు పోయినట్టు సమాచారం.

నవచిత్రం

అర్జున్ సర్కార్ విశ్వరూపం

నాని నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ హిట్ 3 : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రమిది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. నాని పుట్టినరోజు సందర్భంగా సర్కార్స్ లాఠీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. పోలీసులను కలవరపెట్టే వరుస రహస్య హత్యల నేపథ్యంలో టీజర్ స్టార్ట్ అవుతుంది. వారు ఎంత ప్రయత్నించినా హంత కుడిని పట్టుకోవడంలో విఫలమవుతారు. చివరి ప్రయత్నంగా టెర్రిఫిక్, బ్రూటల్ ఇన్వెస్టిగేటర్ అర్జున్ సర్కార్‌ని ఆశ్రయిస్తారు. అర్జున్ సర్కార్‌గా నాని పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో కట్టిపడేశారు. బ్రూటల్, కనికరంలేని పాత్రలో అదరగొట్టారు. అతని ఇంటెన్స్ ప్రజెన్స్, యాంగర్ టెర్రిఫిక్‌గా ఉన్నాయి. ముఖ్యంగా ఓ సన్నివేశంలో అతను నేరస్థుడిని పొడిచి కత్తిని పైకి లాగడం, రూఫ్ పై రక్తం చిమ్మడం – అతని పాత్ర క్రూరత్వాన్ని హైలెట్ చేస్తూనే నాని నటన విశ్వరూపాన్ని చూపిస్తోంది. దర్శకుడు శైలేష్ కొలను 'హిట్' సిరీస్‌ను అద్భుతమైన కథనం, గ్రేట్ విజువల్స్‌తో నెక్స్ట్‌లెవల్‌కి తీసుకెళ్ళాడు. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీ అదిరిపోయింది. మిక్కీ జె మేయర్ నేపథ్య సంగీతం ఇంపాక్ట్‌ని మరింత పెంచుతుంది. ప్రశాంతి తిపిర్నేని, నాని ప్రొడక్షన్స్ వాల్యూస్ అత్యున్నతంగా ఉన్నాయి. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం మే 1న థియేటర్లలో విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.

భైరవి నటన అత్యద్భుతం..


భైరవి

తెలుగు తెరకు మరో కథానాయిక పరిచయం కాబోతోంది. అందం, అభినయం తో ప్రేక్షకులను అలరించేందుకు నూతన నాయిక భైరవి రెడీ అవుతోంది. సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటిస్తున్న చిత్రంలో కథానాయికగా మనకి కనిపించబోతోంది.


తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 1గా ఓ సినిమా రూపొందుతోంది. శివ వర ప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. సీనియర్ నటీనటులు రఘుబాబు, పృథ్వీ ప్రభావతి తదితరులు నటించారు. ఈ సందర్భంగా నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, 'ఈ మూవీ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో రూపొందిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రమిది. 'సర్కార్ నౌకరి' ఫేమ్ ఆకాష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా భైరవిని తెలుగు తెరకు పరిచయం చేస్తున్నాం. అచ్చమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలో భైరవి అద్భుతంగా నటించింది. హీరోకి మరదలుగా ఆమె పాత్ర సినిమాలో హైలెట్ ఉంటుంది. ఇది ఆమెకు డెబ్యూ మూవీ అయినప్పటికీ తన ప్రతిభతో, ఎంతో పరిణితితో నటించింది. సెంటి మెంట్, ఎమోషనల్ వంటి సీన్లలో ఆమె యాక్టింగ్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే టైటిల్, విడుదల తేదీ ప్రకటిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం:శివ, నిర్మాత: తాటి బాలకృష్ణ, సహ నిర్మాత: తాటి భాస్కర్, సంగీతం: యశ్వంత్.

అంతకు మించి నవ్విస్తాం..

బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్'ను ప్రకటించినప్పటి నుండి సినీ ప్రియులంతా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటలు ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఈ చిత్ర టీజర్ మంగళవారం విడుదలైంది. రిలీజైన నిమిషాల్లోనే ఈ టీజర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వేసవికి ఈ సినిమా ప్రేక్షకులకు మరిచిపోలేని వినోదాన్ని పంచనుందని టీజర్‌తో స్పష్టమైంది.

'మ్యాడ్' సినిమాలో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు.

మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ మరియు విష్ణు ఓఐ (లడ్డు).. 'మ్యాడ్ స్క్వేర్'లో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. టీజర్‌లో వారి అల్లరి, పంచ్ డైలాగ్‌లు కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఈ చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి.


నిధి అగర్వాల్, పవన్ కళ్యాణ్

'కొల్లగొట్టినాదిరో'..

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఇప్పుడు ఈ సినిమా నుంచి రెండవ గీతంగా విడుదలైన 'కొల్లగొట్టినాదిరో' పాట అద్భుతంగా ఉంది. ఈ పాట సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్ళింది. పాట ప్రారంభం నుంచి ముగింపు వరకు.. ఎంతో వినసొంపుగా, శ్రోతలను కట్టిపడేసేలా సాగింది. ఇక పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్ లిరికల్ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ సరసన జంటగా నటించిన నిధి అగర్వాల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. తెరపై ఈ జోడి చూడముచ్చటగా ఉంది. అలాగే ఈ పాటలో అనసూయ భరద్వాజ్, పూజిత పొన్నాడ మెరిసి తమ నృత్యంతో అదనపు ఆకర్షణగా నిలిచారు. కీరవాణి స్వరపరిచిన ఈ గీతం సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తోంది. బహుళ భాషల్లో విడుదలైన ఈ గీతాన్ని ప్రతిభగల గాయనీ గాయకులు మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల, ఐరా ఉడిపి, మోహన భోగరాజు, వైష్ణవి కన్నన్, సుదీప్ కుమార్, అరుణ మేరీ ఆలపించి పాటకు మరింత మాధుర్యం తీసుకొచ్చారు తెలుగులో చంద్రబోస్, తమిళంలో పా. విజయ్, మలయాళంలో మంకొంబు గోపాలకృష్ణన్, కన్నడలో వరదరాజ్, హిందీలో అబ్బాస్ టైరేవాలా సాహిత్యం అందించారు.

ఈ చిత్రానికి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.